# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 9 | జూన్ 2026 | వెల : రూ.15

'సర్' ప్రయోగం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

బీజేపీని జయించగల భావజాలమేదీ?

ఫిరాయింపులు : భలే ఖరీదైన బేరాలు!

ఆపలేని ఆ ఐదు అంటే భయం!

'అయోధ్య'లో దొంగలు పడ్డారు!

గాలివాటం, గందరగోళం, నిర్బంధకాలం

పెట్టుబడిదారీ విధానం, ఉపాధి కల్పన - చరిత్ర ఏం చెప్తోంది ?

ట్రంప్‌ను భయపెడుతున్న 'కమ్యూనిస్టు భూతం'

కార్పొరేట్‌లకు అచ్ఛే దిన్

ప్రతిఘటన, పునరుజ్జీవనం.. ఇండియా కూటమి భవిష్యత్తు

ఆంద్రే బెటెయిల్ : భారతదేశంలో కుల వ్యవస్థపై కొన్ని ప్రతిబింబాలు..

స్వామి వివేకానంద 'హిందూత్వ' వ్యతిరేకి

మన దేశంలో ఎలాంటి పౌరులను తయారు చేస్తున్నాం?

మతమౌఢ్యం వదులుకున్న వాడే స్వేచ్ఛా మానవుడు..

భారత రైతాంగ సమస్యలకు  పరిష్కారం ఎప్పుడు?

అర్థశాస్త్ర విమర్శ పుస్తకానికి అనువాదకుని ముందుమాట

అతి వాస్తవిక మాయలోకం మానవ మనుగడ

ఎగసిన ఉద్యమ తరంగం AISF 1936-2026

బలమైన రైతు కూలీ ఉద్యమాన్ని నిర్మించాలి

జూన్ - 2026

పేజీలు : 44

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 8

వెల : 15 రూపాయలు

డి.వి.వి.యస్.వర్మ

- సంపాదకులు

సంపాదక వర్గం

కొప్పర్తి వెంకటరమణమూర్తి

మందలపర్తి కిషోర్

డి.సోమసుందర్

డా॥ బి.రమేష్ చంద్రబాబు

## ఈ సంచికలో..

1. సంపాదకీయం 3

2. బీజేపీని జయించగల భావజాలమేదీ?
- ఎ.కృష్ణారావు 4

3. ఫిరాయింపులు : భలే ఖరీదైన బేరాలు!
- రాజ్‌దీప్ సర్దేశాయి 6

4. ఆపలేని ఆ ఐదు అంటే భయం!
- పి.చిదంబరం 8

5. 'అయోధ్య'లో దొంగలు పడ్డారు!
- కందారపు మురళి 10

6. గాలివాటం, గందరగోళం, నిర్బంధకాలం
- అశోక్ కుంబము 12

7. పెట్టుబడిదారీ విధానం, ఉపాధి - చరిత్ర ఏం చెప్తోంది ? -ప్రభాత్ పట్నాయక్ 17

8. ట్రంప్‌ను భయపెడుతున్న 'కమ్యూనిస్టు భూతం' - ఎం.కోటేశ్వరరావు 19

9. కార్పొరేట్‌లకు అచ్చే దిన్ - మార్పు శరత్ 21

10. ప్రతిఘటన, పునరుజ్జీవనం.. ఇండియా భవిష్యత్తు - దీపాంకర్ భట్టాచార్య 22

11. ఆంద్రే బెటెయిల్ : కుల వ్యవస్థపై కొన్ని ప్రతిబింబాలు - కె.శ్రీనివాసులు 23

12. స్వామి వివేకానంద 'హిందుత్వ' వ్యతిరేకి - కే.ఎల్.కాంతారావు 25

13. దేశంలో ఎలాంటి పౌరులను తయారు చేస్తున్నాం? - అశిష్ సింగ్ 28

14. మతమౌఢ్యం వదిలిన వాడే స్వేచ్ఛా మానవుడు - దేవరాజు మహారాజు 30

15. రైతాంగ సమస్యలకు పరిష్కారం ఎప్పుడు? - వడ్డే శోభనాద్రీశ్వరరావు 32

16. అర్థశాస్త్ర విమర్శ పుస్తకానికి అనువాదకుని ముందుమాట - ఎ.గాంధి 35

17. అతి వాస్తవిక మాయలోకం - ప్రొఫెసర్ పి.కేశవకుమార్ 37

18. ఎగసిన ఉద్యమ తరంగం AISF - కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ 39

19. బలమైన రైతు కూలీ ఉద్యమాన్ని నిర్మించాలి 41




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

## దారి దీపం

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెసేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM



# 'సర్' ప్రయోగం
# ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

"ఒక మనిషి – ఒక ఓటు – ఒకే విలువ"ను భారత రాజ్యాంగం ప్రసాదిస్తుందని అంబేద్కర్ స్పష్టం చేశారు. 13 రాష్ట్రాలలో 'సర్' ప్రయోగం ఫలితాలను పరిశీలిస్తే "ఒక ఓటు – ఒకే విలువ" లేని ప్రజలను రూపొందించే లక్ష్యం కనిపిస్తుంది. ఇది రాజ్యాంగ విరుద్ధం. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. మొదటి దశ 'సర్'లో 13 రాష్ట్రాలలో "ఓటర్ల సమగ్ర పరిశీలన"ను ఎన్నికల కమిషన్ పూర్తిచేసింది. దేశంలో జనాభా పెరుగుతున్నది. ప్రతి ఎన్నికకు ఓటర్ల సంఖ్య పెరుగుతున్నది. కాని చిత్రం ఏమిటంటే 'సర్' తర్వాత ఆ రాష్ట్రాలలో కొత్త ఓటర్లను చేర్చుకున్న తర్వాత కూడా గతానికంటే ఓటర్ల సంఖ్య లక్షలలో, కోట్లలో తగ్గింది.

తమిళనాడులో 'సర్'కు ముందు 6.41 కోట్ల ఓటర్లు వుంటే 'సర్' తర్వాత కొత్త ఓటర్ల చేర్పుతో సహా 5.67 కోట్లకు పడిపోయింది. ఒక కోటీ రెండు లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. గుజరాత్‌లో 5 కోట్ల మంది ఓటర్లు వుంటే 'సర్' తర్వాత 4.40 కోట్లకు పడిపోయింది. 78 లక్షల ఓటర్లను తొలగించారు. 13 రాష్ట్రాలలో ఆరు కోట్ల మంది ఓట్లు కోల్పోయారని అంచనాలు వేస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాల్సిన ఎన్నికల కమిషన్ "కంచే చేను మేసినట్లు" కోట్లాది మందిని అనర్హులను చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. అంతకుమించి వారిని ఓటు లేని వారిని చేయడమే కాదు, పౌరసత్వం లేని ప్రజలుగా మార్చి వేస్తున్నది. దేశంలో రెండో తరగతి ప్రజలను రూపొందిస్తున్నది. ఈ తొలగించిన ఓటర్లలో అత్యధికులు పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీ మతస్తులు. ఈ పేదల మీద 'సర్' పిడుగుపాటు కానుంది. ఇప్పటికే బీహార్, బెంగాల్‌లోని బీజేపీ ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో ఓటర్లు కాని వారికి రేషన్ వుండదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవని ప్రకటించాయి. రాజ్యాంగం ప్రకటించిన సామాజిక న్యాయం, జీవించే హక్కును 'సర్' కాలరాస్తుందనడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఓటు లేకపోతే పాస్ పోర్టు కూడా వుండదట. 'ది టెలిగ్రాఫ్' ఎడిటర్ రాజశేఖర్‌కు ఓటు లేదని పాస్ పోర్టును తిరస్కరించారనే వార్త వచ్చింది.

ఓటర్ల జాబితాలో ఇబ్బడిముబ్బడిగా "విదేశీయులు, చొరబాటుదారులు వున్నారని వారిని గుర్తించడం, ఓటర్ల జాబితా నుంచి తొలగించడం – వారిని ఆయా దేశాలకు సాగనంపడం" అన్నది సర్ లక్ష్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. 13 రాష్ట్రాల 'సర్' ఫలితాల తర్వాత ఎంత మంది విదేశీయులను, చొరబాటుదారులను గుర్తించింది, తొలగించింది, వారి వారి దేశాలకు సాగనంపిందీ అన్న వివరాలు చెప్పకుండా అమిత్ షా మౌనం పాటిస్తున్నారు. తొలగించిన ఓటర్లలో అత్యధిక సంఖ్యాకులు 'హిందువులు' భారతీయులు కాకుండా పోతారా ? వారిని ఎక్కడికి సాగనంపుతారో అమిత్ షా స్పష్టం చెయ్యాలి.

ఇంతకీ 'సర్' అమలు చేస్తున్న ఎన్నికల కమిషన్‌కు ఒక ఓటరు పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం లేదు. పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం కేంద్ర హోం శాఖకు మాత్రమే వుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు కూడా తేల్చి చెప్పింది. 'సర్' పేరుతో ఎన్నికల కమిషన్ తన పరిధిని దాటి అతిగా వ్యవహరిస్తున్నది. ఎన్నికల కమిషన్ కేవలం ఓటరుగా చేరే వ్యక్తి భారతీయుడు అన్న ఏ ఆధారం వున్నా ఓటరుగా చేర్చుకోవాలి. తిరస్కరించకూడదు. పౌరసత్వాన్ని నిర్ణయించే పని ఎన్నికల కమిషన్‌ది కాదు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఆధార్, పాస్‌పోర్టు వగైరాలు వుంటే ఓటరుగా చేర్చుకుని తీరాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ ఓటు ద్వారా యజమానులవుతారు. ఓటు తొలగించడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం. ఎన్నికల కమిషన్ అర్హులందరికీ ఓటు ఇచ్చేదిగా వుండాలి. ఓటు తొలగించే దారి తొక్కడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అవుతుంది. ❑

**– డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977**

# బీజేపీని జయించగల భావజాలమేదీ?



- ఎ.కృష్ణారావు

'కాంగ్రెస్ పరాన్నజీవి. ఇతర పార్టీలపై ఆధారపడి అది మనుగడ సాగిస్తోంది. అవసరం తీరిపోగానే వాటిని వదుల్చుకుంటుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొద్ది రోజుల క్రితం వ్యాఖ్యానించారు. తమిళనాడులో డీఎంకేను వదిలిపెట్టి సినీనటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేతో కాంగ్రెస్ చేతులు కలపడాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారు. అయితే గత కొద్ది రోజులుగా సంభవిస్తోన్న పరిణామాలను చూసిన తర్వాత 2029 ఎన్నికల నాటికి ఇండియా కూటమిలో ఎన్ని పార్టీలు ఉంటాయో, మోదీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్‌లో ఎన్ని పార్టీలు ఉంటాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పలు ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షలో పడ్డాయి. అవి తమ దారి ఏదో తేల్చుకోవల్సివుంది. అయితే అందుకు వాటికి ఎక్కువ సమయం లేదు.

ఈ నేపథ్యంలో.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ముఖాముఖి పోటీ ఉంటుందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రాంతీయ పార్టీలు చీలిపోవడం, బీజేపీతో అవి చేతులు కలపడం గురించి కాంగ్రెస్ పెద్దగా కలవరపడుతున్నట్లు కనిపించడం లేదు. నిజానికి చాలా ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ రాజకీయ స్థలాన్ని ఆక్రమించినవే. పార్లమెంటు ఉభయ సభల్లో తన సంఖ్యా బలాన్ని పెంచుకోవడానికి బీజేపీ యుద్ధ ప్రాతిపదికన అమలు పరుస్తున్న వ్యూహాలను కాంగ్రెస్ అంత తీవ్రంగా పరిగణించడం లేదు. 2029 నాటికి బీజేపీతో ముఖాముఖి తలపడాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ అడుగులు వేస్తున్నట్లు కనపడుతోంది. ముఖ్యంగా దేశంలో యువతను తమ వైపు ఎలా సమీకరించాలా అన్న ఆలోచనే కాంగ్రెస్‌లో కనపడుతోంది. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ నిశ్చితంగా ఒక అజెండా ప్రకారం పనిచేస్తున్నట్లు కనపడదు. కులగణన, సామాజిక న్యాయం, రిజర్వేషన్లపై నిన్నటి వరకూ దృష్టి సారించిన కాంగ్రెస్ ఇప్పుడు యువతలో పెరుగుతున్న ఆందోళనను గమనించి వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాజస్థాన్‌లోని కోటలో 'ఛాత్రోంకీ గూంజ్' పేరిట భారీ ర్యాలీని ఏర్పాటుచేసింది. ఆ ర్యాలీలో వేలాది యువతీ యువకులను ఉద్దేశించి రాహుల్‌గాంధీ ప్రసంగించారు. కాక్రోచ్ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రాబల్యం యువతను ఆకట్టుకునేందుకై రాహుల్‌గాంధీ దృఢసంకల్పంతో పూనుకోవడానికి కారణం కావచ్చు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో అధిక సంఖ్యలో మహిళలు, యువత, ముఖ్యంగా తొలిసారి నమోదు చేసుకున్న ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారని అనేక అధ్యయనాలు తెలిపాయి. 2029 నాటికి ఈ పరిస్థితి మారుతుందా ? యువతలో, మహిళల్లో కాంగ్రెస్ కోల్పోయిన పట్టు తిరిగి సాధించగలుగుతుందా? ఇది ఆ పార్టీ భవిష్యత్తుకు అత్యంత ముఖ్యమైనది.

అయితే లోక్‌సభలో, రాజ్యసభలో సీట్లు పెంచుకోవడానికి, అనేక పార్టీలను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి బీజేపీ చేస్తోన్న తీవ్ర ప్రయత్నాలను తేలికగా కొట్టి పారేయడానికి వీలులేదు. ఆరెస్సెస్ నేత ఒకరు చెప్పిన దాని ప్రకారం, బీజేపీకి హిందూత్వ అజెండా అత్యంత ప్రధానమైనది. 2029లో మళ్లీ గెలవడమే కాకుండా మరికొన్ని దశాబ్దాలపాటు అధికారంలో ఉన్నప్పుడే ఆ అజెండాను నెరవేర్చుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ అజెండాలో భాగంగానే దేశవ్యాప్తంగా అనేక ప్రాంతీయ పార్టీలపై బీజేపీ దృష్టి సారించింది. జనతాదళ్(యు), తృణమూల్ కాంగ్రెస్, శివసేన, ఎన్సీపీలను పూర్తిగా కైవసం చేసుకునేందుకు వేగంగా పావులు కదుపుతోంది. తమిళనాడులో డీఎంకే, జార్ఖండ్‌లో జేఎంఎం, తెలంగాణలో బీఆర్ఎస్, ఢిల్లీలో ఆప్ ఇప్పుడు తమ దారి ఎటు వైపో నిర్ణయించుకోవాల్సిన విషమ పరీక్షలో ఉన్నాయి. తమ అజెండా పూర్తి కావాలంటే అనేక పార్టీలను నయానో, భయానో తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ అనుసరిస్తున్న వ్యూహం.

2029లో 2024 ఎన్నికల ఫలితాలు పునరావృతమై, తాము మెజారిటీ కోల్పోయే ప్రమాదం మళ్లీ వాటిల్లకుండా ఉండేందుకు బీజేపీ వేగంగా చర్యలు తీసుకుంటోంది. వీటిలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అత్యంత కీలకమైనవి. మోదీ సర్కార్ నిర్వహించే నియోజకవర్గాల పునర్విభజన జరిగే తీరు పూర్తిగా బీజేపీకి అనుకూలంగా ఉంటుందని మరి చెప్పనవసరం లేదు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కాంగ్రెస్, ఎన్డీఏలో లేని ప్రాంతీయ పార్టీలు అధిక ప్రయోజనం పొందకుండా ఉండేందుకు బీజేపీ సంకల్పించింది. గత ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాని ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లో అత్యధిక సీట్లు సాధించేందుకు; బిహార్, జార్ఖండ్, హరియాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో భౌగోళిక, జనాభా నిర్మాణాల్లో మార్పుల ద్వారా అదనపు స్థానాలు సాధించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.

అసోం, జమ్మూ కశ్మీర్‌లో డీలిమిటేషన్ తర్వాత ఏమి జరిగిందో తెలిసిందే. అసోంలో దిగువ అసోం, బరాక్ వ్యాలీలో ముస్లిం మెజారిటీ నియోజకవర్గాలను చీల్చారు. స్థానికులు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాల్లో చీల్చిన ప్రాంతాలను చేర్చారు. దీనివల్ల కాంగ్రెస్‌కు, ఏఐయూడీఎఫ్‌కూ తీవ్ర నష్టం జరిగింది. ఎస్టీ, ఎస్సీలకు సీట్లు పెరగడం వల్ల బీజేపీ ప్రాంతీయ మిత్రపక్షాలు లబ్ధి పొందాయి. జమ్మూ కశ్మీర్‌లో కూడా కశ్మీర్ లోయలోని ముస్లిం మెజారిటీ సీట్ల కంటే జమ్మూలోని హిందూ మెజారిటీ సీట్లు పెరిగాయి. అంతేకాదు, చాలా మంది సిట్టింగ్ ఎంపీల పట్ల ప్రజలకు ఉండే వ్యతిరేకతను అరికట్టేందుకు సీట్ల పెంపు ఎంతో ఉపయోగపడుతుంది. పెరిగిన సీట్లలో యువత, మహిళలకు, అనేక మంది కొత్త వారికి అవకాశాలు కల్పించి సాధ్యమైనన్ని మెజారిటీ సీట్లను సాధించుకోవడమే బీజేపీ లక్ష్యం.

రకరకాల సమస్యలను చేపట్టి ప్రజల్లోకి వెళ్లడం ద్వారా తన ఉనికిని పటిష్ఠం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్‌కు బీజేపీ సమగ్ర వ్యూహాలపై ఎంతవరకు అవగాహన ఉన్నదో చెప్పడం కష్టం. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా మోదీ కేంద్రీకృతంగా ఉంటోంది. దేశవ్యాప్తంగా పెరుగుతోన్న ఆరెస్సెస్ ప్రభావాన్ని సైద్ధాంతికంగా ఎదుర్కొనేందుకు సమాయత్తం కావడానికి బదులు ఆ సంస్థకు రిజిస్ట్రేషన్ ఉన్నదా, లేదా అన్న నిరుపయోగ చర్చల్ని లేవనెత్తుతున్నది. ఈ కారణంగానే బీజేపీ వ్యూహాల గుట్టుమట్టులు కాంగ్రెస్‌కు అర్థమవుతున్నాయా లేదా అన్న అనుమానం కలుగుతోంది. దేశంలోని మొత్తం 4,123 అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్‌కు 662 సీట్లు మాత్రమే ఉన్నాయి. అయిదు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఒక్క అసెంబ్లీ సీటు రాలేదు. యూపీ, బిహార్, గుజరాత్, ఒడిషా వంటి రాష్ట్రాల్లో పది శాతం సీట్లు కూడా ఆ పార్టీ గెలుచుకోలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కూ మధ్య 286 నియోజకవర్గాల్లో ముఖాముఖి పోరు జరిగితే, బీజేపీ 180 సీట్లు, కాంగ్రెస్ 83 సీట్లు గెలుచుకుంది. లోక్‌సభలో డిప్యూటీ నాయకుడు, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న గౌరవ్ గొగోయ్ ఇటీవల అసోం అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయారు. మరో లోక్‌సభ సభ్యుడు, రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు వైద్యలింగం సైతం గత అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయారు. ప్రభుత్వ వ్యతిరేకతను కాంగ్రెస్ తనకు అనుకూలంగా ఎందుకు ఉపయోగించుకోలేకపోతోంది? ఈ ప్రశ్నకు జవాబు సాధించనంత వరకూ ఎన్ని ర్యాలీలు నిర్వహించినా, ఎన్ని నాటకీయ ప్రదర్శనలు చేసినా, కాంగ్రెస్ బలోపేతం అయ్యే అవకాశాలు లేవు. కాంగ్రెస్ ఎదుర్కొంటున్న సమస్యనే ప్రాంతీయ పార్టీలూ ఎదుర్కొంటున్నాయి. పైగా అవి చీలిపోతున్నాయి. ఇందుకు బీజేపీని నిందించడంకన్నా ఈ చీలికలు ఎందుకు సంభవిస్తున్నాయో, ప్రజలు తమను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రాంతీయ పార్టీల అధినాయకులు నిష్పాక్షికంగా ఆత్మశోధన చేసుకుంటున్నారా? ఒకప్పుడు బలమైన సైద్ధాంతిక శక్తులుగా ఉన్న వామపక్షాల ప్రస్తుత గమ్యం ఏమిటి?

> *వాస్తవం ఏమిటంటే, ఒకే నాయకుడి ఆకర్షణ, కుల సమీకరణాలపై ఆధారపడ్డ ప్రాంతీయ కోటలు వేగంగా కుప్పకూలిపోతున్నాయి. సిద్ధాంతాలేవీ లేకుండా కేవలం అధికార ఆకాంక్షలు ఎల్లకాలమూ నెరవేరవని స్పష్టమవుతోంది. మమతాబెనర్జీ, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, అరవింద్ కేజ్రీవాల్, కేసీఆర్, నవీన్ పట్నాయక్, జగన్‌ల భవిష్యత్తు ప్రశ్నార్థకం కావడానికి కారణం అదే. ప్రాంతీయ దిగ్గజాలు ఎవరూ ఇప్పుడు ప్రాబల్యంలో లేరు. కొన్ని పార్టీల వారసుల పోకడలు ఆశాజనకంగా లేవు. జరుగుతున్నవి సాధారణ పరిణామాలు కాదు, భారత రాజకీయ వ్యవస్థలో జరుగుతున్న లోతైన నిర్మాణాత్మక మార్పులకు అవి సంకేతాలని ఒక విశ్లేషకుడు పేర్కొన్నారు.*

బీజేపీ మోదీ చుట్టూ తిరుగుతున్నప్పటికీ అది మోదీ ఆధారిత పార్టీ కాదు. దాని ఎత్తుగడలు, వ్యూహాలు, విస్తరణ, చర్యలు ఒక దీర్ఘకాలిక లక్ష్యానికి అనుగుణంగా సాగేందుకు బీజేపీ వెనుక ఉన్న ప్రబల శక్తులు ఎన్నో. ఈ లక్ష్య సాధనలో మోదీ ఒక ప్రధాన ఉపకరణం మాత్రమే అని ఆరెస్సెస్‌కూ, బీజేపీకీ తెలుసు. కాంగ్రెస్ విషయంలో అలా చెప్పడానికి వీలులేదు. వారసత్వ నాయకత్వం ఆధారితంగా సాగుతున్న కాంగ్రెస్ సంస్థాగతంగా, సైద్ధాంతికంగా పటిష్ఠమై, గ్రామ గ్రామాల్లో విస్తరించి, తిరుగులేని జనప్రియ పార్టీగా మారేందుకు రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రయత్నాలు ఏవీ కనపడడం లేదు. ప్రత్యర్థి బలహీనత, తప్పుడు చర్యలు, ప్రభుత్వ వ్యతిరేకత మూలంగా యాదృచ్ఛికంగా అధికారం లభించే అవకాశాలు లేవని ఇప్పటికి ఎన్నోసార్లు రుజువైంది. భారత రాజకీయ వ్యవస్థ కుప్పకూలిపోతుందని కొందరు ఆందోళనపడడంలో అర్థం లేదు. నిజానికి అది పునర్వ్యవస్థీకరణ దశలో ఉన్నది. ప్రాంతీయ స్వరాలు సన్నగిల్లడం మూలాన వచ్చే ఎన్నికల్లో రెండు జాతీయ ధ్రువాల మధ్య ప్రధాన పోటీ ఏర్పడే అవకాశం స్పష్టంగా కనపడుతోంది. ఆత్మరక్షణలో ఉన్న ప్రాంతీయ శక్తులు ఏదో ఒక ధ్రువం వైపు మొగ్గు చూపడం అనివార్య పరిణామంగా కనపడుతోంది. డీలిమిటేషన్, ప్రాంతీయ శక్తులు చేరడం మూలంగా కాంగ్రెస్‌కు సహజంగా కొన్ని సీట్లు పెరగవచ్చు. కానీ ప్రభంజనం రేకెత్తించి అధికారం సాధించాలంటే, వ్యక్తులకన్నా జాతీయస్థాయి ప్రభావశీల భావజాలాలు రాజకీయాలను నిర్ణయించడం ప్రధానం. ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో..)**

# ఫిరాయింపులు : భలే ఖరీదైన బేరాలు!



- రాజ్‌దీప్ సర్దేశాయి

కాల వైపరీత్యం! నిన్నటిదాకా తాము విమర్శించిన పార్టీలోనే నేడు చేరిపోతున్న ప్రజా ప్రతినిధుల సంఖ్య పెరిగిపోతోంది. ఇటీవల బెంగాల్, మహారాష్ట్రలో చోటు చేసుకున్న తృణమూల్ కాంగ్రెస్, శివసేన ఎమ్మెల్యే, ఎంపీల ఫిరాయింపులే అందుకు నిదర్శనాలు. ఎటువంటి సంకోచాలు లేకుండా.. చేరిన క్షణమే, ఆ పార్టీ నాయకులతో బహిరంగంగా, చాలా కాలం తరువాత కలుసుకున్న పాతమిత్రుల్లా వ్యవహరిస్తున్నారు! ప్రజలు ఏమనుకుంటున్నారనేది ఈ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పట్టడం లేదు !

నిజానికి ఫిరాయింపులు అనేవి కొత్త రాజకీయ పరిణామాలు కానే కావు. భారతదేశ రాజకీయాలలో పార్టీ ఫిరాయింపులకు దశాబ్దాల చరిత్ర ఉన్నది. ఈ నీతిబాహ్య రాజకీయాల పట్ల ఇప్పుడు ప్రజల్లో ఎటువంటి పట్టింపు లేకపోవడమే దిగ్భ్రాంతికరం. ఫిరాయింపులకు పాల్పడిన వారు తమను ఎన్నుకున్న ఓటర్లకుగానీ, విశాల ప్రజానీకానికిగానీ తమ నిర్ణయంపై ఎటువంటి వివరణ ఇవ్వడం లేదు. రాజకీయాలు వ్యాపార లావాదేవీల వ్యవహారమయ్యాయి. ఫిరాయింపుదారులకు, వారిని చేర్చుకున్న పార్టీకి మధ్య కుదిరిన ఒప్పందానికి షరతులు ఏమిటో ప్రతి ఒక్కరికీ తెలుసు. రాజ్య వ్యవస్థ ఆర్థిక వనరులు అందుబాటులో ఉండడమనేది కూడా సదరు ఒప్పందంలో భాగంగా ఉంటోంది. ఇటీవల పార్టీ ఫిరాయించిన శివసేన ఎంపీ ఒకరు ఇలా చెప్పారు : 'నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు సాధించుకోవాలంటే నేను పార్టీ మారడం తప్పనిసరి'.

ఫిరాయింపులను ప్రజల తీర్పును వంచించడంగా ఎవరూ ఇంకెంత మాత్రం భావించడం లేదు. అవి సాధారణ వ్యవహారాలైపోయాయి. అధికార సాధనకు ఫిరాయింపులూ మరొక మార్గమని ప్రజలు అంగీకరిస్తున్నారు ! ఫిరాయింపులపై విమర్శలకు బీజేపీ మద్దతుదారులు అదే రీతిలో ప్రతిస్పందిస్తున్నారు : కాంగ్రెస్ విషయమేమిటి ? దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో ఫిరాయింపులు జరగలేదా ? 'ఆయారామ్, గయారామ్' అనే పరిహాసం ప్రాచుర్యంలోకి వచ్చింది నరేంద్ర మోదీ అధికారంలోకి రావడానికి చాలా కాలం ముందే కాదూ?

'అవును' అనేదే పై ప్రశ్నలన్నిటికీ సమాధానం. ఫిరాయింపులు భారత ప్రజాస్వామ్యమంత పాతవి. కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వాలను రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బర్తరఫ్ చేశారు. పదవుల కోసం పార్టీ మారిన శాసనసభ్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే రాజకీయ అవకాశవాదం బాగా వర్ధిల్లింది. నాయకులు పార్టీలు మారడంపై విమర్శలు రావడం పరిపాటి. అయితే ఆ విమర్శలకు పాలకపక్షం వారు ప్రతిస్పందిస్తూ 'గతంలో మీరూ అదే చేశారు కదా' అని పాత విషయాలను బయటకు తీసి ఎత్తిపొడవడం కూడా అంతే పరిపాటి. నాయకులు పార్టీలు మారడం అనేది కొత్తేమీ కాదు. ఇప్పుడు అసలు సమస్యేమిటంటే ఆ ఫిరాయింపుల స్వభావం పూర్తిగా మారిపోవడమే. కాంగ్రెస్ హయాంలో ఆధిపత్య పార్టీ వ్యవస్థకు తార్కాణంగా ఫిరాయింపులు ఉండేవి. ఇప్పుడు ఒక సర్వాధిపత్య పార్టీని సృష్టించి సుస్థిరం చేసే వ్యూహంలో భాగంగా ఫిరాయింపులు జరుగుతున్నాయి.

నాటి నేటి ఫిరాయింపులలో ఈ వ్యత్యాసం సమకాలీన రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మార్పును వివరిస్తుంది. గత దశాబ్దకాలంలో నరేంద్రమోదీ, అమిత్‌షాల నేతృత్వంలోని బీజేపీ ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రంగా ఆవిర్భవించింది. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదొక అపూర్వమైన విషయమే, సందేహం లేదు. సంస్థాగత బలం, ఆర్థిక వనరులు, కమ్యూనికేషన్ సాధనాలు, నాయకత్వ నిర్మాణం మొదలైన అంశాలలో ఈ బీజేపీకి సమస్థాయి పార్టీ మరేదీ లేదు. ఎన్నికలలో బీజేపీ సాధిస్తున్న అప్రతిహత విజయాలకు ఆ శక్తి సామర్థ్యాలే కారణమని అంగీకరించవలసి ఉన్నది. అయితే ఆ ఘన విజయాలు ఒక కొత్త రాజకీయ తర్కాన్ని కూడా సృష్టించాయి. ఎన్నికల్లో విజయం సాధించడం ఇంకెంత మాత్రం అధికారంలో కొనసాగేందుకు ఒక మార్గం కాదు. దేశవ్యాప్తంగా సమస్త ఎన్నికలలోనూ విజయం సాధించడమే బీజేపీకి లక్ష్యంగా మారింది. ఈ దృక్కోణం నుంచి చూసినప్పుడు ఫిరాయింపులు కేవలం యాదృచ్ఛిక సంఘటనలు కాదు, అవి పార్టీలను స్వాధీనపరచుకునే వ్యూహాలు.

ఫిరాయింపులు జరిగిన పద్ధతిని చూడండి.. జ్యోతిరాదిత్య సింధియా, ఆయన విధేయులు కాంగ్రెస్ నుంచి నిష్క్రమించిన తరువాత మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ప్రభుత్వం పడిపోయింది. మహారాష్ట్రలో శివసేన తొలి చీలికను చవిచూసింది. ఆ తరువాత ఎన్సీపీ చీలిపోయింది. ఈశాన్య రాష్ట్రాలలో ప్రత్యర్థి పార్టీల నాయకులు, శాసనసభ్యులను చేర్చుకోవడం ద్వారా బీజేపీ

అక్కడ క్రమంగా విస్తరించింది. ఇప్పుడు పలు ఈశాన్య రాష్ట్రాలలో అధికారంలో ఉన్నది. శాసనసభలలో సంఖ్యా బలాన్ని పెంచుకోవడం కంటే ప్రత్యర్థి పార్టీలను అన్ని విధాలా దెబ్బతీయడమే బీజేపీ అసలు లక్ష్యం. భవిష్యత్తులో తనకు ఏ విధమైన సవాళ్లూ రాకుండా ఉండేందుకు బీజేపీ చాలా పకడ్బందీగా వ్యవహరిస్తోంది. సైద్ధాంతిక నిబద్ధత, కార్యకర్తల విధేయత పరిపూర్ణంగా ఉన్న పార్టీ తమది అని ఒకప్పుడు సగర్వంగా చెప్పుకున్న బీజేపీ, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున చేర్చుకుంటున్నది. భారతీయ జనతా పార్టీ నిజానికి ‘భర్తీ జనతా పార్టీ’ అని పలువురు వ్యంగ్యంగా విమర్శిస్తున్నారు. ఈ పరిహాసంలో సత్యం ఉన్నది.

వాజపేయి నాయకత్వంలో బీజేపీ ఇతర పార్టీలతో పొత్తులు, సామాజిక సంకీర్ణాలు, ఓటర్లను ఆకట్టుకోవడం ద్వారా విస్తరించింది. ప్రజలను ఒప్పించడం ద్వారానే రాజకీయ విస్తరణ సాధ్యమని వాజపేయి విశ్వసించారు. అయితే మోదీ – షాల నేతృత్వంలోని బీజేపీ రాజకీయ విస్తరణకు ఎమ్ అండ్ ఏ (మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్) నమూనాను అనుసరిస్తోంది. నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను పార్టీలో చేర్చుకోవడం, కొన్ని సందర్భాలలో పార్టీలకు పార్టీలనే కలుపుకోవడం ద్వారా విస్తరిస్తోంది. వాజపేయి, మోదీ నమూనాలు రెండిటికీ పార్టీ పెరుగుదలే లక్ష్యం. అయితే అందుకు అనుసరించిన పద్ధతులు మౌలికంగా భిన్నమైనవి.

రాజకీయవేత్తలు సాధారణంగా విజయవంతమైన పార్టీల వైపు ఆకర్షితులవుతారని బీజేపీ మద్దతుదారులు వాదిస్తారు. ఈ వాదన నిస్సందేహంగా నిజమే. అయితే ఇది ఒక రాజకీయ శూన్యంలో సంభవించడం లేదు. మోదీ సర్కార్ తమ నాయకులపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతుందని, ఆర్థిక ఒత్తిళ్లకు లోను చేస్తుందని, విధేయతలు మార్చుకున్న వారికి ప్రోత్సాహకాలు కల్పిస్తుందని ప్రతిపక్షాలు తరచూ ఆరోపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఉన్న విపక్ష నాయకులు బీజేపీలో చేరితే వారికి ఆ పార్టీ చట్టం నుంచి రక్షణ కల్పిస్తుందనే భావన ప్రజలలో నెలకొనడానికి సహేతుకమైన కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల, రాజ్యాంగ వ్యవస్థల నిష్పాక్షికత పైనే కాకుండా ఆ నిష్పాక్షికతపై ప్రజల పరిపూర్ణ నమ్మకంపై కూడా ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడ ఆధారపడి ఉన్నది. అయితే ఇప్పుడు ఆ సంస్థల, వ్యవస్థల నిష్పాక్షికతలో ప్రజల విశ్వాసం హరించుకుపోతోంది. ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని చాలా తెలివిగా ఉల్లంఘించడం జరుగుతోంది. ఇటీవల బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు త్రిపురకు చెందిన ఒక అనామక పార్టీలో చేరడమే అందుకొక నిదర్శనం. న్యాయ వ్యవస్థ సైతం ఫిరాయింపుల వ్యతిరేక కేసులలో నిర్ణయం తీసుకోవడంలో చేస్తున్న జాప్యం ఆ అక్రమ చర్యలను నిరోధించడానికి దోహదం చేయడం లేదు.

పౌరులు ఓటు వేసినప్పుడు ఒక అభ్యర్థిని తమ ప్రతినిధిగా ఎన్నుకోవడమే కాకుండా ఒక రాజకీయ పార్టీని, దాని ప్రణాళికను అంగీకరిస్తున్నారు. పాలనకు దిశా నిర్దేశంగా ఒక రాజకీయ దార్శనికతను ఆమోదిస్తున్నారు. మరి ఎన్నికల అనంతరం గెలిచిన వారి ఎత్తుగడలు పౌరుల అభీష్టాన్ని వమ్ము చేస్తున్నాయి. ఇది న్యాయమేనా ? రాజకీయ పునరేకీకరణలకు వ్యతిరేకంగా చేస్తున్న వాదన కాదు ఇది. పార్టీల ప్రాధాన్యాలు మారుతుంటాయి. నాయకులు తమ అభిప్రాయాలను తరచూ మార్చుకుంటుంటారు. సైద్ధాంతిక విశ్వాసాలతో కాకుండా అధికార లాలసతో ఫిరాయింపులు మామూలు వ్యవహారమయినప్పుడు ప్రజాస్వామ్యం భావాల సంఘర్షణకు ఆస్కారమివ్వదు; రాజకీయ ఆస్తుల విపణిగా పరిణమిస్తుంది.

బెంగాల్, మహారాష్ట్రలో ఫిరాయింపులకు పాల్పడిన వారు తమను ఒక రాజకీయ వేలంలో అమ్ముడుపోయిన వారుగా ప్రజలు భావిస్తారనే విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. ప్రజలు తమను ఛీ కొడతారనే భయం ఆ ఫిరాయింపుదారులకు ఏ మాత్రం లేదు. అసలు రాజకీయ సంస్కృతే పార్టీ ఫిరాయింపులకు అనుకూలంగా ఉన్నప్పుడు ప్రజలకు ఎందుకు భయపడాలి ? చెప్పవచ్చినదేమిటంటే ఫిరాయింపులకు నైతిక సమర్థింపు, న్యాయసమ్మతి ఇంకెంత మాత్రం అవసరం లేదు. అధికార సాధనలో సఫలమవడమే ముఖ్యం. ఎలా అందలాలు ఎక్కారన్నది ఎవరూ పట్టించుకోని చాలా అప్రధాన వ్యవహారమే సుమా !

స్వాతంత్ర్య శతాబ్దికి వడివడిగా సాగుతున్న నేటి భారతదేశంలో ఫిరాయింపులు అనేవి ఇంకెంత మాత్రం రాజకీయ నాయకులు పార్టీలు మారే సాధారణ వ్యవహారం కాదు. ఫిరాయింపుల అనైతికతతో రాజకీయ సంస్కృతే సమూలంగా మారిపోయింది : రాజకీయాలు సైద్ధాంతిక నిబద్ధత కోల్పోయి వ్యాపార వ్యవహారాలయ్యాయి; ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంకంటే స్వార్థ ప్రయోజనాలకు పార్టీలు మారడం సాధారణమైపోయింది ; ప్రజలను ఒప్పించి ఓట్లు, సీట్లు సాధించడం కాకుండా ఇతర పార్టీల తరఫున గెలిచిన వారిని ప్రలోభాలతో వశపరచుకుని చట్టసభలలో సంఖ్యా బలం పెంచుకోవడానికి నాయకులు ప్రాధాన్యమిస్తున్నారు. కార్పొరేట్ సంస్థలు కంపెనీలను స్వాధీనం చేసుకున్న విధంగా రాజకీయ పార్టీలు ధనబలంతో శాసనసభ్యుల మద్దతును కూడగట్టుకోవడం ప్రజాస్వామిక తీర్పును అపహాస్యం చేస్తోంది. నాయకుల, పార్టీల అనైతిక వ్యవహారాల ఫలితంగా ఎన్నికలు రాజకీయ బేరసారాలకు మొదటి వేలంపాట (ఓపెనింగ్ బిడ్)గా మారిపోయాయి. ❑

# ఆపలేని ఆ ఐదు అంటే భయం!



- పి.చిదంబరం

**భా**రతీయ సమాజం మారుతోంది. అనూహ్య వేగంతో మారుతున్న సామాజిక ధోరణులను, రాజకీయాలు పోతోన్న పోకడలను నేను చాలా సంవత్సరాలుగా నిశితంగా గమనిస్తున్నాను. ఒక పెద్ద మార్పుగా కనిపించేది కాలంలో తాత్కాలికమైనదిగాను, ప్రభావశీలతలో అప్రధానమైనదిగాను తేలిపోతుంది. కనిపించే ప్రతి మేఘమూ నిలబడి వర్షించదు. చిరుజల్లు వెదజల్లి సాగిపోతోంది. చెప్పవచ్చిన దేమిటంటే మన జీవనగంగలో ప్రతి ప్రవాహమూ లోతైనది కాదు. ఎండిపోతోన్న తావులు అందులో ఎన్నో ఉన్నాయి. భారతదేశ చరిత్రలో 1947 ఒక కీలక సంవత్సరం. అదొక కొత్త ఆరంభం. దరిమిలా మన జాతి జీవనంలో అనేక ప్రభావాలు, ప్రాబల్యాలను దేశప్రజలు గుర్తించారు. అయితే అవి చాలా వరకు స్వల్పకాల అద్భుతాలుగా మిగిలిపోయాయి. ఆరంభదశలో ఉన్న మార్పులు అనేకం విశాల ప్రజానీకం దృష్టికెక్కలేదు. అయితే ఈ మార్పులు సంఖ్యానేక భారతీయుల జీవితాలను మౌనంగా ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు గాంధీజీ మహాత్ముడిగా భాసించారు. ఎందరో ఆయన్ను దైవ సమానుడిగా గౌరవించారు. గాంధేయ వాదుల సంఖ్య తక్కువేమీ కాదు. గాంధేయ జీవన విధానం, అహింస, సత్యాగ్రహం, చరఖా, పౌర ఉల్లంఘన మొదలైనవి గాంధీ అనంతరం రెండు దశాబ్దాలకు మించి మనగలగలేకపోయాయి. స్వాతంత్ర్యానంతరం శీఘ్ర పట్టణీకరణ పెరుగుదలను చాలా తక్కువమంది ఊహించారు. మరింత తక్కువ మంది వాతావరణ మార్పును గుర్తించారు. అంతకంటే చాలా తక్కువ మంది సమాజం, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతి మధ్య సంకీర్ణ సంబంధాన్ని అర్థం చేసుకున్నారు.

'జోస్యం చెప్పడం ఒక కష్టసాధ్యమైన విషయం. ముఖ్యంగా భవిష్యత్తు గురించి అయితే' అని నీల్స్ బోర్ (ఇరవయో శతాబ్ది వైజ్ఞానిక విప్లవకారుల్లో అగ్రగణ్యుడు) అన్నారు. ఆయన తాత్విక హాస్యంలో సామాన్య వివేకం పరిపూర్ణంగా ఉన్నది. అయినప్పటికీ భవిష్యత్తు అనే నిషిద్ధ ప్రదేశాన్ని దర్శించేందుకు నేను సాహసిస్తున్నాను. మన సమాజ జీవితంలో అయిదు ధోరణులు క్రమ క్రమంగా శక్తిని, వేగాన్ని పుంజుకోవడాన్ని నేను గమనించాను. వాటిని నేను ఏవగించుకుంటున్నాను. కొన్నిటికి భయపడుతున్నాను కూడా. అయితే అవి ఆపడానికి వీలు లేనివి. ఎవరూ ఆపలేనివిగా కనిపిస్తున్నాయి.

మన ప్రజాస్వామ్యం క్షీణిస్తోంది. ప్రజల యొక్క ప్రజల చేత, ప్రజల కొరకు పాలనే ప్రజాస్వామ్యం. ఇది ఒక సార్వజనీన సత్యం. వ్యక్తులు స్వేచ్ఛగా జన్మిస్తారు. అనేక స్వేచ్ఛల విషయంలో వారికి స్వతస్సిద్ధ హక్కులు ఉంటాయి. ప్రజల హక్కులను గౌరవించి, వాటిని కాపాడే ప్రభుత్వమే ప్రజాస్వామిక ప్రభుత్వం.. ప్రజల హక్కులను పరిరక్షించి, వాటిని ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణలోకి తీసుకువచ్చేందుకు స్వతంత్ర సంస్థలను నెలకొల్పడం ప్రజాస్వామ్య ప్రభుత్వ విధ్యుక్త ధర్మం. ఈ కర్తవ్య నిర్వహణను సక్రమంగా పాటించని ప్రభుత్వం ప్రజాస్వామిక ప్రభుత్వం కానేరదు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ అంతకంతకూ తగ్గిపోతున్నాయని ఫ్రీడమ్ హౌస్, వీ-డెమ్ ఇనిస్టిట్యూట్, రిపోర్టర్స్ విదౌట్ బోర్డర్స్ మొదలైన సంస్థలు నిర్ధారిస్తున్నాయి. వివిధ సూచికల ఆధారంగా ఏ దేశాలు స్వేచ్ఛాయుతమైనవో, ఏ దేశాలు స్వేచ్ఛాయుతమైనవి కావో అవి వర్గీకరిస్తాయి. కేవలం ఎన్నికల నిర్వహణను మాత్రమే కాకుండా, కొన్ని నిర్దిష్ట ప్రమాణాల ప్రాతిపదికన అవి నిర్ణయానికి వస్తాయి. మొత్తం మీద ప్రజాస్వామ్య పాలన విషయంలో చాలా దేశాల స్కోరు అంతకంతకూ పడిపోతోంది. 2005లో భారత్ స్కోరు 77 కాగా అది ఇప్పుడు 63-67 మధ్య ఉన్నది. భారత్ కేవలం ఒక 'ఎన్నికల ప్రజాస్వామ్యం' మాత్రమేనని వీ-డెమ్ అభిప్రాయపడింది. మన దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరగడం క్రమంగా తగ్గిపోతోంది. ప్రజాస్వామిక పాలనకు సంబంధించి ప్రపంచంలో మన స్థానం పడిపోతుండడం పట్ల భారత ప్రజలు కలత చెందడం లేదు. ప్రభుత్వాలు సమకూరుస్తున్న సంక్షేమ చర్యలకు వారు సంతృప్తి చెందుతున్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం వారిని ఆనందపరుస్తోంది. ప్రజాస్వామిక పాలనలో చైనా స్కోరు చాలా సంవత్సరాల పాటు 9/100గా ఉన్నది. అయితే చైనా ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అన్ని అంతర్జాతీయ సంస్థల నివేదికలు ఘంటాపథంగా చెప్పాయి. భారత్ సైతం అదే మార్గంలోకి వెళ్లవచ్చు.

దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యదాయకంగా ఉందని చెప్పగలమా? మన ఆర్థిక వ్యవస్థలోని అనేక రంగాలలో డ్యూపోలీ (ద్విస్వామ్యం-ఒక మార్కెట్‌లో ఒక ఉత్పత్తి లేదా సేవను అందించేవి కేవలం రెండు ప్రధాన కంపెనీలు ఉండడం) లేదా ఒలిగోపోలీ (పరిమిత స్వామ్యం - ఒక మార్కెట్‌లో పెద్ద విక్రేతలు వేళ్ల మీద లెక్కపెట్టదగిన కొద్దిమంది మాత్రమే ఉండడం) ప్రాబల్యంలోకి

వెళ్లిపోవచ్చు. విమానయానం, టెలీ కమ్యూనికేషన్స్, సిమెంట్, స్టీల్, విద్యుత్, ఫార్మా, పెట్రోలియం, రక్షణ ఉత్పత్తులు, మైనింగ్, కిరాణం మొదలైనవి అందుకు నిదర్శనాలు. మిగతా రంగాలలో కూడా త్వరలోనే ఇదే తరహా ధోరణులు ప్రబలిపోవచ్చు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లు దాదాపుగా అంతరించిపోవచ్చు. ఎన్జీవో అణచివేతకు గురవుతాయి. మొత్తం మీద పరిస్థితులు పూర్తిగా గుత్తాధిపత్య సంస్థలకు అనుకూలంగా మారతాయి. పెట్టుబడి, శ్రమశక్తి మధ్య సమతౌల్యత యథా విధిగా పెట్టుబడికి అనుకూలంగా ఉండడమే కొనసాగుతుంది. ఆదాయ అసమానతలు మరింతగా పెరుగుతాయి. ఆర్థిక సమానత్వాలు అసాధ్యమైపోతాయి. వలసలు పెరిగిపోతాయి. అస్తిత్వాలు అర్థం కోల్పోతాయి. చాలా పెద్ద నగరాలు కాస్మోపాలిటన్ నగరాలుగా పరిణమిస్తాయి. భాషల, మతాల, సంస్కృతుల మేళవింపు నెలవులుగా ఆ మహానగరాలు వెలుగొందుతాయి. అనేక పట్టణాలు సైతం అదే రీతిలో అభివృద్ధి చెందుతాయి. పట్టణీకరణ ధోరణులు వ్యాప్తి చెందుతాయి. మాస్ ట్రాన్సిట్ సిస్టమ్ (నగరాల్లోని లక్షలాది ప్రజలు ఒకేసారి సురక్షితంగా, తక్కువ ఖర్చుతో ప్రయాణించడానికి ఉపయోగపడే ప్రజా రవాణా వ్యవస్థ) అభివృద్ధి చెందుతుంది. ఏ ఒక్కరూ 'ఒక ప్రదేశానికి చెందినవారై' ఉండరు. 'స్వస్థలం' అనే భావన ఉమ్మడి కుటుంబ ఆచారం వలే అంతరించిపోతుంది. నిత్యం తటస్థపడే వ్యక్తులలో అత్యధికులు కొత్తవారై ఉంటారు. స్నేహ సంబంధాల పరిధి కుంచించుకుపోతుంది. సోషల్ మీడియా, చాటింగ్ యాప్స్ వీడియో కాల్స్ ద్వారానే సంబంధాలు ఏర్పడతాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మనుషుల మధ్య ప్రత్యక్ష సంబంధాలు, భావోద్వేగాలు తగ్గిపోతాయి. మనుషుల మధ్య సంభాషణలు స్మార్ట్ ఫోన్లు మొదలైన ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా సంధానమవుతాయి. 'ఏ మనిషీ ఒక ద్వీపం కాదు' అన్న భావన తప్పు అని రుజువవుతుంది. ఆత్మీయతలు, భావోద్వేగాలు కాకుండా వ్యాపార లావాదేవీలే మనుషుల మధ్య సంబంధాలను నిర్ణయిస్తాయి.

సాంస్కృతిక జాతీయవాదం ప్రబలిపోతుంది. మైనారిటీ వర్గాలలో భయాందోళనలు పెరిగిపోతాయి. శాస్త్రం (సైన్స్)ను మిథ్యా శాస్త్రం(సూడో–సైన్స్) నుంచి వేరు చేసే రేఖ చెదిరి పోతుంది. పురాణాల మిడి మిడి జ్ఞానాన్ని సైన్స్‌గా, కల్పిత గాథలు చరిత్రగా, ఆచారాలను సాంకేతికతగా ప్రచారం చేస్తారు. రుజువుల ఆధారంగా సత్యాన్ని ఆవిష్కరించే పద్ధతులు తిరస్కర ణకు గురవుతాయి. పురాణగాథలు, పునర్జన్మలు వేదాలలోని జీవశాస్త్ర విషయాలపై మరింత లోతైన పరిశోధన చేయవ ల్సిందిగా ఐఐటీలపై ఒత్తిడి పెరిగే అవకాశమున్నది. సాంస్కృతిక పునరుద్ధరణ అనేది ఆలయాల పునర్నిర్మాణం, హిందూ మత పండుగల నిర్వహణ చుట్టూ పరిభ్రమిస్తుంది. పలు పట్టణాలలో మాంసం విక్రయశాలలను మూసివేయవచ్చు. పశ్చిమ బెంగాల్‌ను అనుసరించి మధ్యాహ్న భోజన పథకంలో కోడి గుడ్లను ఇవ్వడాన్ని నిలిపివేస్తారు. మరిన్ని రాష్ట్రాలు ఉమ్మడి పౌరస్మృతులను ఆమోదించి అమలులోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నది. హిందూత్వ అజెండా పట్ల వ్యతిరేకతను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తారు. ఒకే ఒక్క భాషలో మాట్లాడగల, రాయగల సామర్థ్యమున్న బాలల, వయోజనుల సంఖ్య మరింతగా పెరగడం ఖాయం(ఆ ఏకైక భాష హిందీ కాక మరేమవుతుంది?). మతపరమైన, భాషాపరమైన, జాతిపరమైన మైనారిటీలు నిత్యం భయాందోళనలతో బతికే పరిస్థితులు దాపురిస్తాయి.

ఇంత వరకు పేర్కొన్న పరిస్థితుల పర్యవసానాలు ఏమిటి? 144 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తు ఎలా పరిణమించ నున్నది? ఈ జనాభా 167 కోట్లకు పెరిగి, ఆ తరువాత క్రమంగా తగ్గిపోవడం ప్రారంభమవుతుంది. భారతీయులు ఆహారాన్ని, సరుకులను సమృద్ధంగా ఉత్పత్తి చేస్తున్నారు. వాటిని అధికాధికంగా వినియోగించుకుంటున్నారు. గణనీయంగా ఎగుమతి చేస్తున్నారు. కనుక ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, దేశ ఆర్థిక వ్యవస్థ 5శాతం లేదా అంతకంటే ఎక్కువ వార్షిక వృద్ధిరేటుతో పురోగమిస్తూనే ఉంటుంది. సంపన్నులు, కుబేరుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. అయితే పేదల సంఖ్య అంతకంటే ఎక్కువగా అధికమవుతుంది. వారి జీవన ప్రమాణాలు నాసిరకంగా ఉంటాయి. ఏదో ఒక సాకుతో భారత్ అభివృద్ధిలో భాగస్వాములు కాకుండా కోట్లాది ప్రజలను మినహాయిస్తే వారి పరిస్థితి మరింత దిగజారుతుంది. అన్ని రకాల అసమానతలు పెరిగిపోతాయి. ప్రజల్లో అసంతృప్తి, ఆగ్రహావేశాలు పెరిగిపోతాయి.

*'ప్రజాస్వామ్య ప్రమాణాల పతనం, ఆర్థిక గుత్తాధిపత్యాల పెరుగుదల, పట్టణీకరణ విస్తరణ, సాంస్కృతిక జాతీయవాద ప్రాబల్యం, ధనిక - పేద వ్యత్యాసాలు అధికమవడం' ముంచుకొస్తున్న అనివార్య పరిణామాలు. ఈ ఐదు ఆర్థిక, సామాజిక, రాజకీయ ధోరణులను మీరు నిరాకరించవచ్చు లేదా వాటికి మరికొన్నిటిని కలపవచ్చు లేక వాటి నుంచి కొన్నిటిని తీసివేయవచ్చు. ఏది చేసినా, దేశం ఏ దిశగా పోతుందో మీరు కాదనలేరు. ప్రపంచంలో భారత్ స్థానాన్ని నిర్ణయించేవి అవే.* ❑

# ‘అయోధ్య’లో దొంగలు పడ్డారు!



- కందారపు మురళి

*“నాకు చాలా విషయాలు తెలుసు ! నిజం చెబితే నేను ఇబ్బందుల్లో పడతాను. వాళ్లు చాలా శక్తివంతులు. సమయం వచ్చినప్పుడు నేనే మాట్లాడతాను! అప్పటి వరకు నన్ను అడక్కండి” ప్రస్తుత బీజేపీ ఎంపీ, ఉత్తరప్రదేశ్‌కి చెందిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఈ నెల 17వ తేదీన మీడియాతో చేసిన వ్యాఖ్యలివి. నిప్పు లేకుండా పొగరాదని.. అయోధ్య ఆలయంలో వందల కోట్ల రూపాయలు తినేశారని బహిరంగంగా బ్రిజ్ భూషణ్ ఆరోపించారు. ఈయన అంతలా భయపడిపోవటానికి కారణమైన ఆ పెద్ద మనుషులు ఎవరు ? రామ జన్మభూమి ఉద్యమంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన, ఆరుసార్లు పార్లమెంటు సభ్యుడిగా పనిచేసిన బ్రిజ్‌భూషణ్ లాంటి వ్యక్తే ఇలా భయపడితే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి ?*

ధర్మసేనకు చెందిన సంతోష్ ధూబే మాట్లాడుతూ తాము కర్ సేవక్ పురంలో భద్రపరిచిన బంగారు, వెండి, అష్టధాతువులతో తయారైన 1250 రామ్ శిలలు (ఇటుకలు) దేశంలోని వివిధ ప్రాంతాలు, విదేశాల నుంచి వచ్చినవి కనపడటం లేదని వాటి స్థానంలో మట్టి ఇటుకలు ఉన్నాయని ఆరోపించారు. రామ మందిరం ట్రస్ట్‌లోని కొందరు కీలక పదాధికారులపై అనుమానాలు ఉన్నాయని, వారి పేర్లను ప్రస్తావిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పోలీసులు తిరస్కరించడంతో, కోర్టులో కేసు దాఖలు చేశారు. రామ జన్మభూమి కేసులో కీలకమైన వ్యక్తిగా పనిచేసిన మహంతు ధర్మదాసు మాట్లాడుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో కాదు. సిబిఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య కార్యదర్శిగా పనిచేసి రిటైర్ అయిన ఐఏఎస్ అధికారి, రామ జన్మభూమి ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేన్ మిశ్రా మాట్లాడుతూ అయోధ్య ఆలయ నిర్వహణలో ప్రక్షాళన అవసరమని, తీవ్ర లోపాలున్నాయని, భక్తుల విశ్వాసాలను దెబ్బ తీయడంతో పాటు, ఆలయ పరిపాలనా వ్యవస్థలోని లోపాలు కళ్లకు కట్టినట్టు




తన అనుభవాన్ని వివరించారు. ఆలయంలో 1500 మంది విధులు నిర్వహిస్తున్నారని, వీరిలో చాలా మంది వలంటీర్లని వీరికి బాధ్యతలు అప్పగించడానికి సరైన వ్యవస్థ లేకపోవడం, జవాబు దారీతనం లోపించటం, విరాళాల లెక్కల్లో అవకతవకలు చోటు చేసుకోవడం, ఒక ఆలయ ఉద్యోగి ఇంటి నుంచి నగదు స్వాధీనం చేసుకోవడం వంటివి తనను కలతకు గురిచేశాయని అన్నారు. ఆలయ నిర్వహణను అనుభవజ్ఞులైన వారికి అప్ప చెప్పాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిత్యయోగి మిశ్రా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “రాముని ఆలయం కోసం 500 ఏళ్లు ఆగాము. సిట్ నివేదిక వచ్చే వరకు 15 రోజులు ఆగలేరా? ఆధారాలు ఉంటే సిట్‌కు సమర్పించండి” అంటూ విమర్శలు చేశారు.

### రామాలయంలో ఏం జరుగుతోంది?

అయోధ్య రామాలయంలో ఏం జరుగుతుందన్న ప్రశ్న భక్తుల

నుంచి ఎదురవుతున్నది. భక్తులు ఇచ్చిన సొమ్ములు, బాల రాముని అభరణాలు, ఆస్తులు భద్రమేనా ? అన్న సంశయం వీరిలో వ్యక్తమవుతున్నది. అయోధ్య ఆలయంలో భక్తులు ఇచ్చిన కానుకలు, రాముని ఆభరణాలు చోరీకి గురయ్యాయని గత కొంతకాలంగా విమర్శలు వస్తున్నాయి. దీనిపై కేంద్ర ప్రభుత్వం గానీ రాష్ట్ర ప్రభుత్వం గానీ స్పందించలేదు. పైగా ఇవి ఆరోపణ లేనని కొట్టిపారేస్తూ వచ్చారు. రామ జన్మభూమి ట్రస్టులో వివాదాలు ముదిరి ఒకరిపై.. మరొకరు ఆరోపణలు చేసుకునే స్థాయికి వెళ్లడంతో రాముని ఆలయంలో ఏం జరుగుతుందన్న చర్చ.. జాతీయ మీడియాలో చోటు చేసుకోవడంతో ఈ సమస్యపై యూపీ ప్రభుత్వం అనివార్యంగా స్పందించాల్సి వచ్చింది. ముగ్గురు అధికారులతో ప్రత్యేక విచారణ బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది.రామాలయానికి చెందిన రామ్‌శంకర్ యాదవ్ అలియాస్ టిన్ను యాదవ్, లవకుష్ మిశ్రా, అను కల్ప్ మిశ్రా మరో ఇద్దరి ఆధ్వర్యంలో చోరీలు జరిగాయని ఫిర్యాదులు వచ్చినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. వీరిలో లవకుష్ మిశ్రా ఇంటి నుంచి 12 లక్షల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నా ఇప్పటి వరకు ఒక్కటంటే ఒక ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేయకపోవడం విశేషం. సిట్ విచారణలో 11 నెలల్లో ఆలయ భద్రత కోసమే పది కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసినట్టు తేలింది. అయినా గడచిన 45 రోజుల సీసీ ఫుటే జ్ మాత్రమే అందుబాటులో ఉందని, ఉన్న ఫుటేజ్ కూడా ట్యాం పరింగ్‌కు గురైందని అంటున్నారు. హుండీల నుంచి నగదు, నగలు మాయమవడం, ఇతర చోరీ వ్యవహారాల గురించి 200 మందికి పైగా విచారిస్తున్నారని, ఇందులో 125 మంది విచారణ పూర్తయిందని మీడియాలో వార్తా కథనాలు వచ్చాయి.

2025 జనవరి, ఫిబ్రవరి నెలలలో జరిగిన మహా కుంభమేళా సందర్భంగా హుండీల ద్వారా వచ్చిన సొమ్ముకు లెక్కా పత్రం లేకుండా పోయిందని సిట్ గుర్తించింది. బంగారం, వెండి, నగలు, వజ్రాలు వంటి కానుకలకు వచ్చిన రశీదులకు.. ఆలయంలోవున్న రికార్డులకు సరిపోవడం లేదని తేలింది. మహా కుంభమేళా సందర్భంగా ప్రతి రోజు పది లక్షల మంది భక్తులు అయోధ్యను సందర్శించారని హుండీలు గంటల వ్యవధిలో నిండిపోయేవని, రెండు నెలలపాటు ఇదే పరిస్థితి కొనసాగిందని, ఈ రెండు నెలలపాటు వచ్చిన విరాళాలు, కానుకలకు సరైన లెక్కలు లేవని తేలింది. సీసీ టీవీ ఫుటేజీలు డిలీట్ చేసి ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దీంతో ఆలయ సిబ్బంది తమకు తెలియకుండా అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఉద్యోగులకు ఆంక్షలు పెట్టింది. దేశంలోని ఆలయాలన్నింటినీ ప్రభుత్వ పెత్తనం నుంచి తొలగించి అయోధ్య తరహాలో హిందూ సమాజానికి అప్పగించాలని, ఆరెస్సెస్ అనుయాయ సంఘాలు దేశమంతటా హిందూ శంఖారావ సభలు పెట్టి యాగీ చేస్తున్న సందర్భాలను ఒకసారి గుర్తుకు చేసుకోండి. స్వయంగా ప్రధాని మోడీ పదకొండు రోజులపాటు ప్రత్యేక దీక్షను చేపట్టి 2024 జనవరి 22న అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన అతిథిగా పాల్గొని మోడీ చేసిన ప్రసంగం గుర్తుచేసుకుంటే శతాబ్దాల నిరీక్షణకు ముగింపు పలికామని, రామ మందిరాన్ని దేశ ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా అభివర్ణించిన విషయం గుర్తుందిగా !

## పైన పటారం.. లోన లొటారం

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆలయం.. పైన పటారం కనిపిస్తున్నది. మేడిపండు చందంగా తయారైన ఈ వ్యవహారంలో బీజేపీ పరివారానికి దేవుని మీద భక్తి కంటే.. దేవుని ఆస్తులు, కానుకలు, హుండీల మీదనే కన్ను ఉన్నట్టుగా నిరూపితమైంది. అయోధ్యలోని రామ మందిర నిర్వహణ ట్రస్టు విడుదల చేసిన ఆదాయ వివరాలను పరిశీలిస్తే 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో ఆలయం మొత్తం ఆదాయం రూ.327 కోట్లుగా ఉంది. ప్రకటించిన ఆదాయంలో భక్తుల విరాళాలు రూ.153 కోట్లుగా పేర్కొన్నారు. రూ.5 వేల కోట్ల ఆస్తులున్న తిరుమలలో భక్తుల సంఖ్య రోజుకు 70 వేల నుంచి 75 వేల మంది వస్తుంటారు. సెలవు, ప్రత్యేక దినాలలో 90 వేల నుంచి లక్ష మందికి పైగా వస్తుంటారు. టీటీడీకి రోజుకు సరాసరిన 3 నుంచి 5 కోట్ల రూపాయల వరకు ఆదాయం ఉంటుంది. తిరు మల ఆలయంలో లక్ష మందిలోపు దర్శించుకుంటే సరాసరిన రోజుకు నాలుగు కోట్ల ఆదాయం వస్తుంటే అయోధ్య ఆలయాన్ని 2025 జనవరి, ఫిబ్రవరి నెలలలో రెండు నెలలపాటు సరాసరిన పది లక్షల మంది ప్రతి రోజూ దర్శించుకుంటే ఆదాయం ఏ స్థాయిలో ఉండాలి? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

రామ మందిరం ట్రస్ట్ ప్రకటించిన వార్షిక ఆదాయంపై అనుమానాలు ఎవరికైనా తలెత్తుతాయి. అయోధ్య ఆలయంలో జరుగుతున్న తంతుపై కిమ్మనకుండా హిందుత్వవాదులు కూర్చున్నారు. దేశంలోని ఆలయాలను హిందూ సమాజానికి అప్పజెప్పాలని, ప్రభుత్వ పెత్తనం నుంచి విముక్తి కల్పించాలని, దేశమంతటా హిందూ శంఖారావం పేరిట సభలు జరుపుతున్న విశ్వ హిందూ పరిషత్ పెద్దలకు, అయోధ్య ఆలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మఠాధిపతులు, పీఠాధిపతులు, సాధుసంతులకు ఎందుకు నోట మాట రావడం లేదు. తిరుమల ఆలయ వివాదాలైతే అయిన దానికి.. కాని దానికి విరుచుకుపడే పెద్ద మనుషులకు నోరు పెగలకపోవడానికి కారణం ? ఈ వివాదాల వెనుక మోడీ పరివారం ఉందనే కదా ! బాలరాముడికి.. బాలారిష్టాలు తప్పి పోయి. భక్తి విశ్వాసాలతో భక్తులు సమర్పించిన కానుకలకు భద్రత రావాలని కోరుకుందాం. ❑ **(నవతెలంగాణ సౌజన్యంతో..)**

# గాలివాటం, గందరగోళం, నిర్బంధకాలం



- అశోక్ కుంబము

ఒక సమాజాన్ని, ఒక కాలాన్ని అంచనా వేయడానికి అనేక ప్రమాణాలు ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి, రాజకీయ పరిణామాలు, సాంస్కృతిక ఉత్పత్తి, సామాజిక సంబంధాలు.. ఇవన్నీ ఒక సమాజపు లక్షణాలను నిర్దిష్ట స్థలకాలంలో తెలుసుకోవడానికి ఉపయోగపడుతాయి. వీటితోపాటు మరో ముఖ్యమైన ప్రమాణం కూడా ఉంది. అది ఒక సమాజం ఏ అంశాల గురించి మాట్లాడుతోంది ? ఎవరిని చర్చా వస్తువులుగా మారుస్తోంది? ఎందుకంటే చర్చా వస్తువు ఎంపిక కూడా ఒక రాజకీయ చర్యే. ఏ విషయాలకు ప్రాధాన్యత ఇచ్చి చర్చిస్తున్నామో, ఏ ప్రశ్నలను ద్వితీయ స్థాయి ప్రశ్నలుగా పక్కన పెడుతున్నామో, ఏ సమస్యల పట్ల మౌనంగా ఉంటున్నామో అవన్నీ ఆ సమాజపు చారిత్రక స్థితినీ, రాజకీయ చైతన్యాన్నీ ప్రతిబింబిస్తాయి.

తెలుగు సమాజంలో గత కొన్ని నెలలుగా దాదాపు నిరంతరాయంగా చర్చా వస్తువుగా మారుతున్న వ్యక్తి పవన్ కళ్యాణ్. ఒకరోజు ఆయన వ్యాఖ్య, మరో రోజు ఆయన మతోన్మాద ప్రదర్శన, ఇంకో రోజు ఆయన రాజకీయ నిర్ణయం, మరొక రోజు ఆయన అభిమానుల అతి ప్రవర్తన. ఏదో ఒక రూపంలో ఆయన ప్రజా చర్చల్లో కేంద్రంగా ఉంటూనే ఉన్నాడు. వీరోచిత పోరాటాలు, సామాజిక ఉద్యమాలు, హక్కుల కోసం సంఘర్షణలు, అసమానతలు, అణిచివేతలపై జరిగే సిద్ధాంత చర్చలు తెలుగు సమాజానికి కొత్తవి కావు. దేశంలోనే అత్యంత చైతన్యవంతమైన రాజకీయ వాదోపవాదాలకు వేదికగా నిలిచిన చరిత్ర ఈ నేలకు ఉంది. అలాంటి నేలపై ఒక మిడిమిడి జ్ఞానం తో, బాధ్యతారాహిత్యంగా ఊగిపోయే సినీ నటుడు-రాజకీయ నాయకుడు ఇంత విస్తృత స్థాయిలో చర్చా వస్తువుగా మారడం నేటి మన సమాజ దుస్థితిని, రాజకీయ సంక్షోభాన్ని సూచిస్తుంది.

పవన్‌కళ్యాణ్ ఒక ప్రముఖ సినీనటుడు, ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధి. కాబట్టి ఆయన మాటల పట్ల, చేష్టల పట్ల ప్రజల్లో ఆసక్తి ఉండటం సహజమే అని కొందరు భావించవచ్చు. అది కొంతవరకు నిజమే. కానీ సమస్య ఆసక్తిలో లేదు. ఆ ఆసక్తికి ఉన్న సామాజిక, రాజకీయ పునాది, దాని పర్యవసానమే అసలు సమస్య. పవన్ కళ్యాణ్ ఏ విలువలకు ప్రతినిధి? సమాజాన్ని ఏ దిశగా నడిపించాలని ప్రయత్నిస్తున్నాడు? ఆయన రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని విస్తరిస్తున్నాయా లేక కుదిస్తున్నాయా? అనేవే ముఖ్యం.



**పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టినప్పుడు ఆయన తనను ఒక ప్రత్యామ్నాయంగా, వ్యవస్థను ప్రశ్నించే వ్యక్తిగా, యువత ఆకాంక్షలకు ప్రతినిధిగా పరిచయం చేసుకున్నాడు. కానీ ఆ ప్రత్యామ్నాయం ఎటువంటి స్పష్టమైన సామాజిక లేదా రాజకీయ దృక్పథంతో నిర్మితమైనది కాదు. ఒక సందర్భంలో ఒక మాట, మరో సందర్భంలో మరో మాట, ఒక ఎన్నిక బరిలో ఒక వైఖరి, మరో ఎన్నికలో దానికి విరుద్ధమైన వైఖరి.. ఇలా పరిస్థితులను బట్టి మారే గాలివాటంగా ఆయన రాజకీయ ప్రయాణం నడిచింది. సిద్ధాంతం స్థానంలో ఉద్వేగం, కార్యాచరణ స్థానంలో వ్యక్తిత్వం, రాజకీయ స్పష్టత స్థానంలో గందరగోళం నిలిచాయి.**

అయితే గాలివాటం రాజకీయాల సమస్య కేవలం స్థిరత్వం లేకపోవడంలోనే కాదు. అది సమాజంలో ఒక గందరగోళాన్ని సృష్టిస్తుంది. ప్రజలకు ఏ విలువల కోసం నిలబడాలో కాకుండా, ఎవరిని అనుసరించాలో మాత్రమే నేర్పిస్తుంది. హేతువు స్థానంలో భావావేశాన్ని, రాజకీయ చర్చ స్థానంలో వ్యక్తిగత విధేయతను నిలబెడుతుంది. ఒకరోజు లౌకికత గురించి మాట్లాడి, మరొకరోజు సనాతన రాజకీయాల గురించి మాట్లాడటం. ఒకప్పుడు అధికారాన్ని ప్రశ్నించే ఊపు, తరువాత అదే అధికార నిర్మాణాల్లో సేద తీరడం. ఇవన్నీ ఆయనలోని రాజకీయ గందరగోళాన్ని సమాజం ముందుంచాయి. రాజకీయ

గారడీయో, బూటకపు ఎన్నికలో, ప్రజా గందరగోళమో.. ఎలాగైతేనేం మొత్తానికి అధికారంలో భాగమయ్యాడు.

అధికారంలోకి వచ్చాకే ఆయన అసలు రూపం కనబడటం మొదలయ్యింది. విమర్శను రాజకీయ జీవితంలో సహజమైన భాగంగా స్వీకరించాల్సిన చోట, దానిని శత్రుత్వంగా చూడడం ప్రారంభమైంది. భిన్నాభిప్రాయాన్ని ప్రజాస్వామ్య హక్కుగా కాకుండా వ్యక్తిగత అవమానంగా చిత్రీకరించే ధోరణి బలపడింది. ప్రభుత్వాలను, నాయకులను, విధానాలను ప్రశ్నించే సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు, యూట్యూబర్లు, ప్రజా మేధావులపై వేధింపులు, కేసులు, విచారణలు, నిర్బంధ చర్యలు మొదలయ్యాయి. విమర్శకు ప్రతి విమర్శతో సమాధానం చెప్పడం ప్రజాస్వామ్యం. విమర్శకు పోలీసులతో సమాధానం చెప్పడం నిర్బంధం. విభేదాన్ని వాదనతో ఎదుర్కోవడం ప్రజాస్వామిక సంస్కృతి. విభేదాన్ని కేసులతో ఎదుర్కోవడం అధికార దుర్వినియోగం. అహంకారం.

గాలివాటం రాజకీయాలు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించినప్పుడు, ఆ గందరగోళం చివరికి నిర్బంధ రాజకీయాలకు మార్గం వేస్తుంది. ఎందుకంటే సిద్ధాంతం లేని చోట వ్యక్తి పూజ వస్తుంది. వ్యక్తి పూజ ఉన్న చోట ప్రశ్నల పట్ల అసహనం పెరుగుతుంది. ప్రశ్నలను భరించలేని అధికారం చివరికి నిర్బంధాన్ని ఆశ్రయిస్తుంది. అక్కడే గాలివాటం ముగుస్తుంది. గందరగోళం తన పని పూర్తి చేస్తుంది. సమాజం నిర్బంధకాలం అంచులపై నిలబడుతుంది. అయితే ఇది కేవలం ఒక నాయకుడి ప్రవర్తనలో వచ్చిన మార్పుగా మాత్రమే చూడటం సరైనది కాదు. దీని వెనుక ఆయన చుట్టూ నిర్మితమైన ఒక సామాజిక-రాజకీయ మంద ఉంది. ఆ మంద నిర్మాణంలో సినిమా ఇమేజ్ ఒక పాత్ర పోషిస్తే, కుల, మతోన్మాద రాజకీయాలు మరో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కులం అనేది ఒక ఉపరితల అంశం కాదు. అది రాజకీయార్థిక నిర్మాణంలో అంతర్భాగం. రాష్ట్ర రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, పార్టీల ఎదుగుదల, నాయకత్వ పోటీలు, అధికార సమీకరణాలు అన్నీ వివిధ ఆధిపత్య కులాల చుట్టూ తిరగడం చరిత్ర పొడవునా మనకు కనిపిస్తుంది. కమ్మ, రెడ్డి, కాపు వంటి ప్రధాన సామాజిక వర్గాలు కేవలం ఓటు బ్యాంకులుగా మాత్రమే కాకుండా, రాజకీయ శక్తి నిర్మాణాలుగా పనిచేశాయి.

అయితే కుల విధేయత ఎప్పుడూ తనను తాను ప్రత్యక్షంగా ప్రకటించుకోదు. “నేను ఈ కులానికి చెందిన వాడిని కాబట్టి ఈ నాయకుడి వెంటే ఉన్నాను” అని చాలా మంది చెప్పరు. దానికి బదులుగా “అభివృద్ధి”, “నిజాయితీ”, “నాయకత్వ లక్షణాలు”, “మంచితనం”, “దార్శనికత” వంటి గంభీరమైన తటస్థ పదాల వెనుక అది తనను తాను దాచుకుంటుంది. అందుకే కుల రాజకీయాలు కనిపించనంత మాత్రాన అవి లేవని కాదు. చాలాసార్లు వాటి ప్రభావం అత్యధికంగా ఉన్నప్పుడే అవి అత్యల్పంగా కనిపిస్తాయి. ఎందుకంటే అవి అంతగా సాధారణీకరించబడి ఉంటాయి.

ఈ సందర్భంలో తరచూ వినిపించే ప్రశ్న: “ఈ రోజుల్లో కులమెక్కడుందండి?” ఇది నిజంగా కులాన్ని తిరస్కరించే ప్రశ్న కాదు. చాలాసార్లు అది కులాన్ని కనిపించకుండా చేసే ఒక రాజకీయ వ్యూహం. సామాజిక శాస్త్రవేత్తలు దీనిని “కుల నిరాకరణ”గా అభివర్ణిస్తారు. కులం వల్ల లాభపడే వారికి అది సహజ స్థితిగా అనిపిస్తుంది. కులం వల్ల నష్టపోయే వారికి మాత్రం అది ప్రతిరోజూ ఎదురయ్యే వాస్తవం. అందుకే కులం లేదని చెప్పే సౌకర్యం కులం వల్ల నష్టపోయిన వారికి కాదు, లాభపడిన వారికే ఉంటుంది.

అయితే పవన్ కళ్యాణ్ చుట్టూ ఏర్పడిన మద్దతును కేవలం కుల రాజకీయాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోవడం కూడా సరిపోదు. దానికి సినిమా సంస్కృతి ఉత్పత్తి చేసిన హీరో ఆరాధన కూడా జత కలిసింది. ఈ ఆరాధన మన సమాజపు వెనుకబాటుతనంలోనే ఉంది. సాహిత్యంలో, సినిమాల్లో నిర్మించబడిన పాత్రలను వ్యక్తీకరణగా మార్చి ఆరాధించడం మన సమాజ చైతన్య స్థాయిని సూచిస్తుంది. తెరపై అన్యాయాన్ని ఎదిరించే హీరో, రాజకీయాల్లో కూడా అదే పాత్ర పోషిస్తాడనే ఒక భావోద్వేగ సమీకరణం పనిచేస్తుంది. సినిమా పాత్రల్లో హీరో అయిన వ్యక్తి నాయకుడైతే ఆ నాయకుడు ఒక ప్రజా ప్రతినిధిగా కాకుండా ఒక రక్షకుడిగా, రక్షకుడి నుంచి క్రమంగా ఆరాధ్య వ్యక్తిగా మారతాడు. ఇలాంటి పరిస్థితుల్లోనే పవన్ కళ్యాణ్ తన అభిమానుల్లో కొందరికి “దేవుడు”గా మారాడు.

ఇక్కడి నుంచే “జనసేన” అనే పేరుకు కూడా ఒక ప్రత్యేక రాజకీయ అర్థం ఏర్పడుతుంది. ప్రజాస్వామ్యం పౌరులను కోరుకుంటుంది; సైనికులను కాదు. పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉంటుంది. భిన్నాభిప్రాయం వ్యక్తం చేసే హక్కు ఉంటుంది. తన నాయకుడినే నిలదీసే హక్కు ఉంటుంది. కానీ సైనికుడి రాజకీయ సంస్కృతి ప్రశ్నకంటే విధేయతను, విమర్శకంటే అనుసరణను, చర్చ కంటే ఆజ్ఞాపాలనను ప్రోత్సహిస్తుంది.

అందుకే ఒక రాజకీయ పార్టీ తనను “సేన”గా, తన కార్యకర్తలను “సైనికులు”గా నిర్వచించుకోవడం కేవలం ఒక పేరు ఎంపిక కాదు ; ఒక రాజకీయ ఎత్తుగడ. ముఖ్యంగా రాజ్యాంగబద్ధ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పనిచేసే పార్టీకి “సేన” అనే ప్రతీక అవసరమేమిటి ? సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను పరిష్కరిస్తామని చెప్పే వారికి సైనికులు ఎందుకు కావాలి ? చైతన్యవంతమైన పౌరులు సరిపోరా ?

సమస్య పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి గురించి మాత్రమే కాదు.

ఆయన చుట్టూ నిర్మితమైన రాజకీయ సంస్కృతి గురించి. హేతువును పక్కనపెట్టి భావావేశాన్ని ముందుకు తేవడం, పౌరహక్కులను పక్కనపెట్టి విధేయతను ప్రోత్సహించడం, ప్రశ్నను నిర్బంధించి ఆరాధనను పెంచిపోషించడం.. ఇలాంటి ధోరణులు ఏ సమాజానికైనా ప్రమాద సంకేతాలే. అందువల్ల పవన్ కళ్యాణ్‌ను ఒక వ్యక్తిగా కాకుండా ఒక లక్షణంగా చూడాల్సిన అవసరం ఉంది. తెలుగు సమాజంలోని హీరో ఆరాధన, కుల రాజకీయాలు, వ్యక్తిపూజ, హేతువిరోధ ధోరణులు, ప్రజాస్వామ్య విలువల క్షీణత - ఈ అన్నింటి కలయికగా ఆయనను అర్థం చేసుకున్నప్పుడే ప్రస్తుత రాజకీయ పరిస్థితి యొక్క అసలు స్వరూపం మనకు కనిపిస్తుంది. వీటన్నిటికి తోడు పవన్ కళ్యాణ్ రాజకీయ పరిణామంలో అత్యంత గమనించదగిన మార్పు ఆయన లౌకికవాద భావాల నుండి బహిరంగ సనాతన రాజకీయ ప్రకటనల వైపు చేసిన ప్రయాణం. హిందుత్వ రాజకీయాల ప్రధాన లక్షణం సమాజంలోని వాస్తవ సామాజిక-ఆర్థిక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మత రాజకీయాల వైపు మళ్లించడం. నిరుద్యోగాన్ని మర్చిపోయి మతం గురించి మాట్లాడించడం, అసమానతలను పక్కనబెట్టి సంస్కృతి గురించి మాట్లాడించడం, హక్కుల ప్రశ్నలను బలహీనపరచి విశ్వాసాల జవాబులను ముందుకు తేవడం. ఈ రాజకీయ ప్రాజెక్టుకు కేవలం బీజేపీ నాయకులు మాత్రమే అవసరం లేదు ; ప్రాంతీయ స్థాయిలో దాని భాషను, దాని ప్రతీకలను, దాని ప్రాధాన్యతలను ప్రాచుర్యంలోకి తెచ్చే సామాజిక ప్రభావం కలిగిన పవన్ కళ్యాణ్ వంటి నాయకులు కూడా అవసరం అవుతారు. ఈ కోణం నుంచి చూస్తే, పవన్‌కళ్యాణ్ పాత్ర మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన హిందుత్వ రాజకీయాలకు కేవలం మిత్రుడిగా కాదు, వాటి సామాజిక విస్తరణకు ఒక ముఖ్య వాహకుడిగా కనిపిస్తారు. ఎందుకంటే ఆయన చేస్తున్న పని కేవలం ఒక రాజకీయ కూటమిలో భాగస్వామ్యం మాత్రమే కాదు ; హిందుత్వ రాజకీయాల భాషను సాధారణీకరించడం. "సనాతన ధర్మం" పేరుతో రాజకీయ చర్చను పునర్నిర్వచించడం. లౌకికతను అనుమానాస్పదంగా చూపించడం. హేతువాదాన్ని వెటకారం చేయడం. ప్రశ్నించే స్వరాలను లక్ష్యంగా చేసుకోవడం. ఇవన్నీ యాదృచ్ఛికంగా జరుగుతున్నట్లు కనిపించవు.

అసలు ఒక రాజకీయ నాయకుడిని అంచనా వేయాలంటే అతను ఎవరిని సమర్థిస్తున్నాడో మాత్రమే కాదు, ఎవరిని లక్ష్యంగా చేసుకుంటున్నాడో కూడా చూడాలి. పవన్ కళ్యాణ్ ఈ రోజు తన రాజకీయ దాడులను ప్రధానంగా హేతువాదుల మీద, లౌకికవాదుల మీద, ప్రజాస్వామిక విమర్శకుల మీద, రాజ్యాంగబద్ధ హక్కుల కోసం మాట్లాడే గొంతుకల మీద కేంద్రీకరిస్తున్నాడు. మరోవైపు కుల ఆధిపత్యం, కార్పొరేట్ దోపిడీ, సామాజిక అసమానతలు, అధికార కేంద్రీకరణ వంటి నిర్మాణాత్మక ప్రశ్నలు ఆయన రాజకీయ చర్చలో ఎలాంటి స్థానాన్ని పొందడం లేదు. ఈ ఎంపికలు యాదృచ్ఛికాలు కావు. అవి ఆయన భావజాల స్థానాన్ని సూచిస్తున్నాయి.

అందువల్ల సమస్య పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా సనాతన ధర్మాన్ని నమ్ముతున్నాడా లేదా అన్నది కాదు. సమస్య ఏమిటంటే, ఆయన రాజకీయంగా ఏ శక్తులకు ఉపయోగపడుతున్నాడు ? ఆయన రాజకీయ చర్యల చివరి ఫలితం ఎవరికి లాభం చేకూరుస్తోంది ? ఆయన ప్రజల్లో బలపరుస్తున్న విలువలు ఏమిటి ? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికితే, ఒకప్పుడు మార్పు గురించి మాట్లాడిన వ్యక్తి ఈ రోజు హిందుత్వ రాజకీయాల సామాజిక విస్తరణలో కీలక పాత్ర ఎలా పోషిస్తున్నాడో అర్థమవుతుంది.

ఇక తెలంగాణ సందర్భంలో పవన్‌కళ్యాణ్ చేసిన ఒక వివాదాస్పద వ్యాఖ్య : "తెలంగాణ మీ అయ్య జాగీరా." దానికి తెలంగాణ సమాజం సమాధానంగా "అవును, మా అయ్య జాగీరే" అని చెప్పింది. కానీ ఆ మాట వాడడంలో ఉన్న భూస్వామ్య, పితృస్వామ్య భావనను అర్థం చేసుకోవాలి. భాష కేవలం భావాలను వ్యక్తపరిచే సాధనం కాదు. మనం సమాజాన్ని ఎలా ఊహించుకుంటామో, అధికారాన్ని ఎలా అర్థం చేసుకుంటామో, సంబంధాలను ఎలా నిర్మించుకుంటామో కూడా భాష ద్వారానే వ్యక్తమవుతాయి. అందుకే భాషలోని ప్రతి పదం కేవలం ఒక పదం కాదు ; అది ఒక చరిత్రను, ఒక సామాజిక సంబంధాన్ని, ఒక ప్రాపంచిక దృక్పథాన్ని మోసుకెళ్తుంది. "అయ్య జాగీరు" అనే పదబంధం అలాంటి పదాల్లో ఒకటి. మొదట అది ఒక సాధారణ తిట్టు మాటలా, లేదా ఏదో వ్యక్తి హక్కును ప్రశ్నించే పదబంధంలా కనిపించవచ్చు. కానీ దాని లోపలి నిర్మాణాన్ని పరిశీలిస్తే, అందులో రెండు కీలక భావనలు దాగి ఉన్నాయి : "అయ్య" మరియు "జాగీరు".

"అయ్య" అనేది ఇక్కడ కేవలం ఒక వ్యక్తిని (తండ్రిని) సూచించడం కాదు. అది ఒక పురుషాధిక్య, అధికారం కలిగిన స్థానాన్ని సూచిస్తుంది. కుటుంబంలో తండ్రి, గ్రామంలో పెద్దమనిషి, సమాజంలో యజమాని(భూస్వామి, పెట్టుబడిదారుడు), రాజకీయాల్లో నాయకుడు..ఇలా వివిధ రూపాల్లో కనిపించే పితృస్వామ్య అధికారానికి "అయ్య" ఒక సాంస్కృతిక ప్రతీక. అదే సమయంలో "జాగీరు" అనే పదం భూమి, ఆస్తి, యాజమాన్యం, ఆధీనత అనే భావనలను తెలియజేస్తుంది. ఈ రెండూ కలిసినప్పుడు వచ్చే అర్థం ఏమిటి? ఒక పురుష యజమాని ఉంటాడు. అతనికి ఒక ఆస్తి ఉంటుంది. ఆ ఆస్తిపై అతనికి సహజమైన హక్కు ఉంటుంది. ఆ హక్కును ప్రశ్నించే వారికి సమాధానంగా "ఇది మీ అయ్య జాగీరా?" అని అడుగుతారు.

ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ పదబంధం

యాజమాన్యాన్ని విమర్శించడానికి ఉపయోగించబడుతున్నప్పటికీ, అది విమర్శ చేసే భాష కూడా అదే యాజమాన్య-కేంద్రిత ఊహల నుంచి వస్తుంది. అంటే "జాగీరు" అన్న భావననే ప్రశ్నించకుండా, ఎవరి జాగీరు అన్నదే ప్రశ్నగా మారుతుంది. ఇంకా లోతుగా చూస్తే, ఇందులో ఒక పితృస్వామ్య నిర్మాణం కనిపిస్తుంది. ఎందుకంటే సామాజిక ఊహలో "యజమాని" ఎప్పుడూ ఒక పురుషుడు. "అయ్య జాగీరు" అంటాం కానీ "అమ్మ జాగీరు" అనడం కనిపించదు. తెలంగాణ ఉద్యమకారులైనా "అవును, ఇది మా అమ్మ జాగీరు" అని చెప్పలేకపోయారు. ఇది యాదృచ్ఛికం కాదు. చరిత్ర పరంగా ఆస్తి, అధికారం, వారసత్వం, నిర్ణయాధికారం అన్నీ పురుషుల చేతుల్లో కేంద్రీకృతమైన సమాజ నిర్మాణాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. భాష ఆ చరిత్రను ఇప్పటికీ మోస్తూనే ఉంది. ఆ భాషను, భావనను పునరుత్పత్తి చేసే సామాజిక, రాజకీయార్థిక పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. అసలైన ప్రజాస్వామ్యం ఈ ఊహలను తలకిందులు చేస్తుంది. ప్రజాస్వామ్యంలో నాయకుడు "అయ్య" కాదు. రాష్ట్రం ఎవరి "జాగీరు" కాదు. ప్రభుత్వ పదవి వారసత్వ ఆస్తి కాదు. ప్రజా వనరులు ఎవరి వ్యక్తిగత యాజమాన్యంలో ఉండవు. ప్రజలే సార్వభౌములు. నాయకులు తాత్కాలిక ప్రతినిధులు మాత్రమే.

అందువల్ల "అయ్య జాగీరు" అనేది భూస్వామ్య సంబంధాల అవశేషం. అది పితృస్వామ్య అధికారానికి ఒక భాషాత్మక గుర్తు. అది యజమాని-బానిస సంబంధాలను సాధారణీకరించే ఒక సాంస్కృతిక జ్ఞాపకం. భాషలో ఇలాంటి పదాలు బతికి ఉన్నంత కాలం, వాటి వెనుక ఉన్న అధికార సంబంధాలు పూర్తిగా అదృశ్యమవ్వవు. అందుకే భాషను విమర్శించడం అనేది కేవలం వ్యాకరణాన్ని సరిచేయడం కాదు. ఆ భాషలో ఉన్న అధికారాన్ని, ఆధిపత్యాన్ని గుర్తించడం. వాటిని ధ్వంసం చెయ్యడం. కులానికి సంబంధించి మరో ముఖ్యమైన విషయం. పవన్ కళ్యాణ్‌కు తెలిసో తెలియకో "జన సైనికులను" ఉద్దేశిస్తూ ఒక మీటింగ్‌లో "కులం ఒక సోషల్ ఫాక్ట్" (సామాజిక వాస్తవం) అని చెప్పాడు. ఈ సోషల్ ఫాక్ట్ అని అనడంలో అసలు ఉద్దేశం ఏంటి? అది ఒక వాస్తవాన్ని ఒప్పుకోవడమా ? లేక తెలియకుండానే ఒక సామాజిక అన్యాయాన్ని సహజీకరించడమా ?

"సోషల్ ఫాక్ట్" అనే భావనను ఫ్రెంచ్ సామాజిక శాస్త్రవేత్త ఎమిల్ డుర్ఖైం ప్రతిపాదించాడు. అతని ప్రకారం సోషల్ ఫాక్ట్ అంటే వ్యక్తికి వెలుపల ఉన్న, వ్యక్తి మీద నిర్బంధ శక్తిని కలిగి ఉన్న, సమాజంలో సాధారణంగా అంగీకరించబడిన సామాజిక వాస్తవం. భాష, చట్టం, కుటుంబ వ్యవస్థ, మతాచారాలు, నైతిక నియమాలు.. ఇవన్నీ సోషల్ ఫ్యాక్ట్స్‌కి ఉదాహరణలు. ఆయన ప్రకారం మనం పుట్టక ముందే ఇవి ఉంటాయి ; మనం పుట్టాక వీటి మధ్యలోనే జీవించాల్సి వస్తుంది; వాటిని పూర్తిగా నిరాకరిస్తే సమాజం నుంచి ప్రతిఘటన ఎదురవుతుంది. సమాజం తన సమతుల్యతను కోల్పోతుంది. కాబట్టి ఈ సామాజిక వాస్తవాలను అంగీకరించాలి.

ఈ నిర్వచనం ప్రకారం చూస్తే కులం కూడా ఒక సోషల్ ఫాక్ట్ మాదిరిగానే కనిపిస్తుంది. ఎందుకంటే ఎవరూ తమ కులాన్ని ఎంచుకుని పుట్టరు. కులం వ్యక్తికి ముందే ఉంటుంది. వ్యక్తి పుట్టిన క్షణం నుంచే అది సామాజిక గుర్తింపులో భాగమవుతుంది. వివాహ సంబంధాల నుంచి రాజకీయ ప్రాతినిధ్యం వరకు, విద్యా అవకాశాల నుంచి సామాజిక గౌరవం వరకు అనేక అంశాలపై అది ప్రభావం చూపుతుంది. కుల నియమాలను అతిక్రమించిన వారికి సమాజం శిక్షలు విధించిన చరిత్ర కూడా ఉంది. ఈ అర్థంలో కులం ఒక శక్తివంతమైన సోషల్ ఫాక్ట్.

అయితే ఇక్కడే ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది. కులం ఒక సోషల్ ఫాక్ట్ అని చెప్పడం కులాన్ని అర్థం చేసుకోవడానికి సరిపోతుందా? సరిపోదని భారతీయ సామాజిక చరిత్ర చెబుతుంది. ఎందుకంటే డుర్ఖైం పద్ధతి ప్రధానంగా సమాజం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవాలనుకుంటుంది. కానీ అది సమాజం న్యాయంగా పనిచేస్తుందా లేదా అన్న ప్రశ్నను కేంద్రం చెయ్యదు. అతని ఫంక్షనలిస్ట్ దృక్పథం సమాజాన్ని ఒక జీవి లాగా చూస్తుంది. శరీరంలో ప్రతి అవయవం ఏదో ఒక పని చేసినట్లే, సమాజంలోని ప్రతి సంస్థ కూడా ఏదో ఒక "కార్యం" నిర్వహిస్తుందని భావిస్తుంది. సమస్య ఇక్కడే మొదలవుతుంది. ఒక వ్యవస్థ కొనసాగుతోంది కాబట్టి అది అవసరమైనదేనా ? ఒక వ్యవస్థ వేల సంవత్సరాలుగా ఉంది కాబట్టి అది న్యాయమైనదేనా ? ఒక సామాజిక నిర్మాణం సమాజంలో స్థిరపడిపోయింది కాబట్టి దానికి చట్టబద్ధత వచ్చేస్తుందా ? ఫంక్షనలిజం ఈ ప్రశ్నల దగ్గర మౌనంగా ఉంటుంది.

డుర్ఖైం సిద్ధాంతం "కులం ఎందుకు ఉంది ?" అని అడుగుతుంది. కానీ "కులం వల్ల ఎవరు పైకి ఎక్కారు, ఎవరు అణగారిపోయారు?" అని అడగదు. అది "కుల వ్యవస్థ సమాజంలో ఏ పాత్ర పోషించింది?" అని అడుగుతుంది. కానీ "ఈ వ్యవస్థ వల్ల ఎవరి జీవితాలు నాశనమయ్యాయి?" అని అడగదు. అది స్థిరత్వాన్ని చూస్తుంది; కానీ ఆ స్థిరత్వం మాటున దాగివున్న అధికారం, దోపిడీ, ఆధిపత్యాన్ని చూడ నిరాకరిస్తుంది. అందుకే అంబేద్కర్ దృష్టికోణం ఇక్కడ అత్యంత కీలకం. అంబేద్కర్‌కు కులం ఒక సాధారణ సామాజిక వాస్తవం కాదు. అది ఒక రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్య వ్యవస్థ. ఆయన ప్రసిద్ధంగా చెప్పినట్లుగా కులం కేవలం "డివిజన్ ఆఫ్ లేబర్" కాదు; "డివిజన్ ఆఫ్ లేబరర్స్". అంటే కేవలం శ్రమ విభజన మాత్రమే కాదు, అది శ్రామికుల విభజన కూడా. అంతేకాదు, ప్రతి కులం తన కింద ఉన్న మరో కులాన్ని

అణచివేసే విధంగా నిర్మించబడిన "గ్రేడెడ్ ఇనీక్వాలిటీ". అంటే పౌరలు పౌరలుగా అమర్చిన అసమానతల వ్యవస్థ.

**ఇంకా సాధారణీకరించి చెప్పాలంటే :**

దుర్ఖేం అడిగే ప్రశ్న: "కులం ఎలా పనిచేస్తుంది?"

అంబేద్కర్ అడిగే ప్రశ్న: "కులం ఎవరిని అణచివేస్తుంది?"

దుర్ఖేం దృష్టితో కులాన్ని ఒక సామాజిక వాస్తవంగా అర్థం చేసుకోవచ్చు. కాని అంబేద్కర్ దాన్ని ఒక సామాజిక నేర వ్యవస్థగా అర్థం చేసుకున్నాడు.

ఈ రెండింటి మధ్య ఉన్న తేడా అత్యంత రాజకీయమైనది. ఎందుకంటే "కులం ఒక సోషల్ ఫాక్ట్" అనే మాట ఆధిపత్య కులాలకు, వాళ్ల రాజకీయాలకు సేవ చేసే మాట. అది యథాతథ స్థితిని సమర్థించే మాట. "కులం ఒక సోషల్ ఫాక్టే కదా", "ఇది ఎప్పటినుంచో ఉంది కదా", "ప్రజల మనస్తత్వాలు ఒక్కరోజులో మారవు కదా" అంటూ కులవ్యవస్థను సహజమైనదిగా, తప్పించలేనిదిగా చూపించడం. ఇక్కడ సోషల్ ఫాక్ట్ అనే భావన విమర్శకు కాకుండా సాకుకు మారిపోతుంది. ఇదే కారణంగా కులాన్ని కేవలం ఒక సామాజిక వాస్తవంగా చూడటం సరిపోదు. ఎందుకంటే బానిసత్వం ఒకప్పుడు సోషల్ ఫాక్టే. సతీ సహగమనం ఒకప్పుడు సోషల్ ఫాక్టే. కానీ అవి సమాజంలో ఉన్నాయన్న కారణంతో వాటికి నైతికత రాదు.

అందుకే "కులం ఒక సోషల్ ఫాక్ట్" అనే మాట విన్నప్పుడు, వెంటనే అడగాల్సిన ప్రశ్న: దాన్ని చెప్పేవాడు కులం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవాలనుకుంటున్నాడా, లేక అది అలాగే కొనసాగడానికి ఒక తాత్విక కవచం తయారు చేస్తున్నాడా? ఈ రెండింటి మధ్య ఉన్న తేడానే చివరికి సామాజిక శాస్త్రానికి, సామాజిక న్యాయ రాజకీయాలకు మధ్య ఉన్న తేడా. పవన్ కళ్యాణ్‌కు సామాజిక శాస్త్రవేత్త హోదా ఇవ్వలేం. కానీ ఆయన భాష మాత్రం కులాన్ని, కుల ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడమే!

చివరగా, ఇప్పుడు పవన్ కళ్యాణ్ కనుసన్నల్లో కొనసాగుతున్న నిర్బంధం గురించి. ప్రజాస్వామ్య వ్యవస్థకు అసలు పరీక్ష అధికారాన్ని ప్రశ్నించినప్పుడు ఆ వ్యవస్థ ఎలా స్పందిస్తుందనేదే. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం, విమర్శించడం, వారి నిర్ణయాలను సవాలు చేయడం ప్రజాస్వామ్యంలో ఒక హక్కు మాత్రమే కాదు, ఒక పౌర బాధ్యత కూడా. రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యం అధికారాన్ని ప్రశ్నించే హక్కును కలిగి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న వారి పట్ల విమర్శ సహజం. ఆ విమర్శ కఠినంగా ఉండొచ్చు, కటువుగా ఉండొచ్చు, అసౌకర్యంగా ఉండొచ్చు. కానీ అసౌకర్యం కలిగిస్తోందన్న కారణంతో దాన్ని నేరంగా పరిగణించలేం. ఒక ప్రజా నాయకుడి ప్రతిష్ఠ, ఒక ప్రభుత్వ ఇమేజ్, ఒక పార్టీ గౌరవం.. ఇవేవీ రాజ్యాంగ హక్కులకంటే పెద్దవి కావు.

ఇంకా ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, చట్టాన్ని న్యాయం కోసం కాకుండా రాజకీయంగా వినియోగించే ధోరణి. చట్టం ఒక ప్రజాస్వామ్య సమాజంలో పౌరులను రక్షించడానికి ఉండాలి; అధికారాన్ని రక్షించడానికి కాదు. కానీ ఒకసారి చట్ట అమలు సంస్థలు అధికారంలో ఉన్నవారి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయడం ప్రారంభిస్తే, పౌర హక్కులు క్రమంగా బలహీనపడతాయి. అప్పుడు కేసు శిక్ష కోసం కాకుండా భయపెట్టడం కోసం ఉపయోగించబడుతుంది. అరెస్టు న్యాయం కోసం కాకుండా సందేశం పంపడం కోసం ఉపయోగించబడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో లక్ష్యం ఒక వ్యక్తిని జైలుకు పంపడం మాత్రమే కాదు. ఒక ఉదాహరణను సృష్టించడం. "ప్రశ్నిస్తే ఇదే జరుగుతుంది" అనే సందేశాన్ని సమాజానికి పంపడం. ఆ సందేశం ప్రభావం ప్రత్యక్ష బాధితుడి మీద మాత్రమే ఉండదు. వందలాది మంది ఇతరుల మీద కూడా ఉంటుంది. వారు మాట్లాడే ముందు ఆలోచిస్తారు. విమర్శించే ముందు భయపడతారు. తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ముందు పరిణామాలను లెక్కేస్తారు. ఇదే ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి.

> **పవన్ కళ్యాణ్‌ను విమర్శించాడు అనే సాకుతో "ప్రశ్న" రావణ్‌పై కొన్ని డజన్ల కొద్దీ కేసులు వేశారు. ఆ కేసుల్లో జైలుకు పంపడం వీలు కావడం లేదని ఏకంగా "రాజద్రోహం" కేసు పెట్టి ఖైదీని చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధం. ఇప్పుడు ఇది కేవలం రావణ్ సమస్య కాదు. ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ సమస్య. తెలుగు సమాజంలో విమర్శించే స్థలం ఎంత మిగులుతోంది? భిన్నాభిప్రాయానికి ఎంత రక్షణ ఉంది? అధికారాన్ని ప్రశ్నించే హక్కు ఎంత వరకు సురక్షితంగా ఉంది? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశాలు కావాలి.**

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు. విమర్శించే హక్కు, వ్యతిరేకించే హక్కు, వెటకారం చేసే హక్కు, అసమ్మతి వ్యక్తం చేసే హక్కు... ఇవన్నీ కలిసే ప్రజాస్వామ్యం. అధికారాన్ని ప్రశ్నించినందుకు ఎవరైనా భయపడాల్సి వస్తే, ప్రజాస్వామ్యానికి ప్రమాదం అక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఎందుకంటే ప్రతి నిర్బంధం వెనుక ఒక వ్యక్తి మాత్రమే బాధపడడు. ఒక సమాజం తన స్వేచ్ఛలో కొంత భాగాన్ని కోల్పోతుంది. కాబట్టి ప్రశ్నను సజీవంగా నిలబెట్టుకుందాం. మన స్వేచ్ఛను మనమే కాపాడుకుందాం. ❑ **(కొలిమి సౌజన్యంతో)**

# పెట్టుబడిదారీ విధానం, ఉపాధి కల్పన - చరిత్ర ఏం చెప్తోంది ?

- ప్రభాత్ పట్నాయక్



పద్దెనిమిదవ శతాబ్దం చివరి భాగంలోను, 19వ శతాబ్దం తొలి భాగంలోను బ్రిటన్‌లో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న కాలంలో కొత్తగా తెచ్చిన యంత్రాల మీద తయారైన సరుకుల వలన చాలామంది చేతి వృత్తిదారుల ఉపాధి పోయింది. అది యంత్రాల ప్రవేశానికి వ్యతిరేకంగా సాగిన లుడ్డైట్ ఉద్యమానికి దారితీసింది. నిరుద్యోగం పెరగడంతో పేదరికం పెరిగింది. కొన్నేళ్ల అనంతరం 19వ శతాబ్దం తర్వాతి భాగంలో ఆ దేశంలో దారిద్ర్యంతో బాధపడే ప్రజానీకం శాతం తగ్గింది. నిరుద్యోగంతో బాధపడే వారి సంఖ్య తగ్గింది.

అప్పటి బ్రిటన్ అనుభవం పెట్టుబడిదారీ విధానంలో ఇమిడివున్న ఒక స్వభావసిద్ధ లక్షణం అని చెబుతూ దానిని మొత్తం పెట్టుబడిదారీ దశకే వర్తింపజేస్తుంటారు కొందరు. పెట్టుబడి ప్రవేశించినప్పుడు మొదట్లో కొంత నిరుద్యోగానికి అది దారి తీయవచ్చునని, అయితే ఆ పెట్టుబడి ప్రవేశం వలన మొత్తం మీద ప్రజానీకపు స్థితిగతులు మెరుగుపడతాయని, క్రమేణా, ఆర్థిక అసమానతలు పెరిగినా, అంతకు మునుపటి కన్నా ప్రజలందరి జీవన ప్రమాణాలూ మెరుగు పడతాయని వారు వాదిస్తుంటారు. ఈ వాదన చాలా విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఏ దేశంలోనైనా భారీస్థాయిలో నిరుద్యోగ సమస్యను చవి చూస్తున్నప్పుడు ఆ దేశం తన వద్ద పెట్టుబడులు పెట్టేలా పెట్టుబడిదారులను ఆకర్షించడమే పరిష్కారమని వాళ్లు సలహా ఇస్తూంటారు. ఇప్పుడు మన దేశంలోని ఏ రాష్ట్రానికైనా ఈ పరిష్కారాన్నే ఒక మంత్రంలాగా వాళ్లు చెప్తున్నారు. "మీది పేద రాష్ట్రం అయితే పెట్టుబడిదారులకు భారీగా రాయితీలివ్వండి. అప్పుడు వాళ్లు వచ్చి మిమ్మల్ని పేదరికం నుంచి బయటకు తీసుకొస్తారు". ఇదే ఆ మంత్రం.

ఇలా చెప్పడానికి వారి దగ్గర ఎటువంటి సిద్ధాంతపరమైన ప్రాతిపదికా లేదు సరికదా, వాళ్లు చరిత్రలో వాస్తవంగా జరిగిందేమిటో తెలుసుకోవడంలో పూర్తిగా పొరపాటు పడుతున్నారు. కొత్త యంత్రాలను ప్రవేశ పెట్టడం అనేది ఒకే ఒక్కసారి జరిగే వ్యవహారం. అయితే అప్పుడు మాత్రమే, అది పోగుబడ్డ పెట్టుబడిని మళ్లీ పెట్టుబడి పెట్టే వేగం తగ్గకుండా కొనసాగితేనే, ఆ యంత్రాల ప్రవేశం కారణంగా మొదట్లో తలెత్తిన నిరుద్యోగాన్ని అధిగమించడం, అదనంగా ఉద్యోగాలను కల్పించడం సాధ్యపడుతుంది. కాని, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానంలో నిరంతరం కొత్త యంత్రాల కోసం, కొత్త సరుకుల ఉత్పత్తి కోసం పరిశోధనలు, ప్రయత్నాలు కొనసాగుతూనే వుంటాయి. అందువలన నిరంతరం కార్మికులకు ఉన్న ఉద్యోగాలు పోతూనే వుంటాయి. అందుచేత పెట్టుబడిదారీ విధానం వలన ఏర్పడిన నిరుద్యోగం ఆ వ్యవస్థలో ఎన్నటికీ అదృశ్యం కాదు. పెట్టుబడిదారీ విధానం నిరుద్యోగాన్ని లేకుండా చేసేస్తుందని చెప్పడానికి ఎటువంటి సైద్ధాంతిక ప్రాతిపదికా లేదు.

**ఇక చారిత్రికంగా చూద్దాం.** అప్పట్లో యంత్రాల ప్రవేశం కారణంగా తలెత్తిన నిరుద్యోగం లుడ్డైట్లను ఆగ్రహావేశాలకు గురి చేసింది. కాని ఆ తర్వాత నిరుద్యోగం ఉపశమించింది. దానికి కారణం పెట్టుబడిదారీ విధానంలో స్వభావసిద్ధంగా ఉన్న లక్షణం ఏదీ కాదు. అప్పుడు నిరుద్యోగం తగ్గడానికి మూడు స్పష్టమైన కారణాలు ఉన్నాయి. బ్రిటన్ నుండి, ఐరోపా ఖండం నుండి కెనడా, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా దేశాలకు దాదాపు ఐదు కోట్ల మంది వలసలు వెళ్లారు. అక్కడికి వలసలు పోయి, స్థానికులను ఊచకోత కోసి, తరిమివేసి ఆ ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. వ్యవసాయ దారులుగా మారారు. 1815 నుండి 1914 మధ్య శతాబ్దం కాలంలో బ్రిటన్‌లో ఎంత మంది కొత్తగా జనాభా పెరిగారో, వాళ్లలో సగం మంది ఈ కొత్త ప్రాంతాలకు వలసపోయారు. దీని ఫలితంగా బ్రిటన్‌లో నిరుద్యోగం గణనీయంగా తగ్గింది.

**ఇక రెండో కారణం చూద్దాం..** ఈ పెట్టుబడిదారీ దేశాలు కొన్ని ఇతర దేశాలను తమ పెత్తనం కిందకు తెచ్చుకున్నాయి. భారతదేశం కూడా వాటిలో ఒకటి. 19వ శతాబ్దం మొత్తం ఈ వలస దేశాల్లో జీవించే స్థానిక వత్తిదారుల ఉత్పత్తులను దెబ్బ తీస్తూ తమ వద్ద యంత్రాల మీద ఉత్పత్తి అయిన సరుకులను తెచ్చి గుమ్మరించారు. దాంతో స్థానిక చిన్న ఉత్పత్తిదారులు నాశ నమయ్యారు. ఈ క్రమాన్నే పారిశ్రామిక వినాశనం(డీ ఇండస్ట్రి యలైజేషన్) అని అంటారు. అంటే యంత్రాల ద్వారా జరిగిన ఉత్పత్తి అక్కడ బ్రిటన్‌లో పెద్దగా నిరుద్యోగానికి దారి తీయలేదు కాని ఇక్కడ వలస దేశాల్లో భారీ నిరుద్యోగానికి దారి తీసింది.

**ఇక మూడవ కారణం :** మొదట్లో యంత్రాల తయారీకి చాలా పెద్ద సంఖ్యలో మనుషులు అవసరమయ్యారు. అందుచేత యంత్రాల ప్రవేశం వలన పనులుపోతున్నా, యంత్రాల తయారీకి కూడా పెద్ద సంఖ్యలో మనుషులు అవసరమైనందున మొత్తం మీద ఉద్యోగాలు తగ్గిపోవడం అనేది పరిమితంగానే ఉండేది. ఈ మూడు కారణాలూ ఏ విధంగా చూసినా, పెట్టుబడిదారీ వ్యవస్థ స్వభావసిద్ధ లక్షణం నుంచి వచ్చినవి కానేకావు. మొదటి రెండు కారణాలూ వలస విధానం పర్యవసానంగా వచ్చాయి. ఇక

మూడవ కారణం ఆ ప్రత్యేక సందర్భంలో ఉన్నదే కాని పెట్టుబడిదారీ విధానపు స్వభావం నుంచి వచ్చినది కాదు. అటువంటిది అన్ని సందర్భాల్లోనూ ఏర్పడదు. అందుచేత పెట్టుబడిదారీ విధానం వలన తాత్కాలికంగా నిరుద్యోగం పెరిగినా, మొత్తం మీద దీర్ఘకాలంలో అభివృద్ధి జరుగుతుందని, ప్రజల స్థితిగతులు మెరుగుపడతాయని చెప్పడానికి ఎటువంటి ఆధారమూ లేదు. అది ఏ విధంగానూ సమర్ధనీయం కాదు. ఆ కాలంలో ఒక ప్రత్యేక సందర్భంలో ఐరోపా ఖండంలో జరిగిన ప్రత్యేక పరిణామాలను మొత్తం ప్రపంచానికంతటికీ, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ అంతటికీ వర్తింపజేయబూనుకోవడం సరి కాదు.

ఇంకా చెప్పాలంటే నేటి పెట్టుబడిదారీ విధానం “అభివృద్ధి” అనే దానికే వ్యతిరేకంగా ఉంది. కొన్ని గణాంకాలను పరిశీలిస్తే ఇది కనిపిస్తుంది. 2010-2020 మధ్య దశాబ్ద కాలంలో ప్రపంచ జీడీపీ వార్షిక వృద్ధి రేటు 2.6 శాతం. రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలం మొత్తం మీద ఇది ఏ దశాబ్దానికన్నా తక్కువగా ఉంది. ఈ దశాబ్దంలోని మొదటి ఐదేళ్లలో ప్రపంచ శ్రామిక ఉత్పాదకత ఏటా 1.8 శాతం చొప్పున పెరిగితే తర్వాత ఐదేళ్లలో అది 1.4 శాతానికి పడిపోయింది. అంటే సగటును మొత్తం దశాబ్ద కాలానికి 1.6 అని అనుకోవచ్చు. జీడీపీ వృద్ధి రేటుకి, ఉత్పాదకత పెరుగుదల రేటుకి మధ్య తేడా ఎంత ఉంటుందో ఉపాధి అదే రేటులో పెరుగుతుంది. అంటే ఈ దశాబ్దకాలంలో ఉపాధి వృద్ధి ఒక శాతం మాత్రమే. ఏటా కార్మికుల సంఖ్య 1.5 చొప్పున పెరుగుతోంది. ప్రపంచం మొత్తం మీద నిరుద్యోగం పెరుగుతూనేపోతోంది. కరోనా అనంతర కాలంలో ప్రత్యేకంగా ప్రభుత్వాల వ్యయాలు పెరిగినే కాలం ఇది ఈ దశాబ్దంలోనే పరిస్థితి ఇలా ఉందంటే కరోనాకు ముందరి దశాబ్ద కాలంలో ప్రభుత్వ వ్యయం బాగా తక్కువ స్థాయిలో వున్న కాలంలో, నిరుద్యోగం ఇంకా ఎక్కువ మోతాదులో ఉండి వుండాలి.

పెట్టుబడిదారీ వ్యవస్థ తాజా దశ అయిన నయా ఉదారవాద కాలంలో జీడీపీ వృద్ధి వేగం తగ్గిపోతోంది. దీనికి కారణం ఆ విధానాల అమలు ఫలితంగా అసమానతలు బాగా ఎక్కువగా పెరిగిపోవడం, ప్రభుత్వాలు జోక్యం చేసుకునే శక్తి బాగా తగ్గిపోవడం. అందుచేత నయా ఉదారవాద పెట్టుబడిదారీ దశలో ఉపాధి కల్పనలో అభివద్ధి వేగం తగ్గిపోతోంది. కార్మికుల సంఖ్య పెరిగే వేగంకన్నా కూడా తగ్గిపోతుంది. అందుచేత నయా ఉదారవాద విధానాలలోనే స్వభావసిద్ధంగా నిరుద్యోగాన్ని పెంచే లక్షణం ఉంది. అయితే, పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేసే దేశాలన్నీ నిరుద్యోగాన్ని పరిష్కరించడంలో విఫలమై తీరుతాయని అనుకోనక్కర్లేదు. ఏ దేశాలైతే తమ వద్ద ఉన్న నిరుద్యోగాన్ని పరిష్కరిస్తాయో అవి అందుకోసం ఇతర దేశాల్లో నిరుద్యోగం పెరిగిపోవడానికి కారణమౌతాయి. అంటే అన్ని దేశాలూ పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేసి అన్నీ అభివృద్ధి దిశగా పురోగమించడమనేది అసాధ్యం. ఇక్కడ అభివృద్ధి అంటే పేదరికాన్ని అధిగమించడం అని గ్రహించాలి. ప్రపంచం మొత్తంగా కలిపి చూసినప్పుడు పెట్టుబడిదారీ విధానాన్ని కొనసాగించడం అనేది పేదరికాన్ని అనివార్యంగా పెంచుతుంది. ప్రపంచబ్యాంక్ వంటి సంస్థల మేథోపరమైన హస్తలాఘవం ఇక్కడే కనిపిస్తుంది. కొన్ని దేశాలు పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన నడిచి తమ పేదరికాన్ని అధిగమించాయి. వాటినే ఉదాహరణలుగా చూపి ప్రపంచం మొత్తం ఈ విధంగా అధిగమించగలుగుతుందని ప్రపంచబ్యాంక్ బోధిస్తుంది. ఆ దేశాలు తమ పేదరికాన్ని అధిగమించే సమయంలోనే దాని ఫలితంగా మరికొన్ని దేశాల పేదరికం మరింత పెరిగిందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనంతటినీ కలిపి చూసినప్పుడు పేదరికం పెరుగుతున్న తీరు వేగం పుంజుకుంటున్నదని కనిపిస్తుంది. ప్రపంచబ్యాంక్ చెప్తున్నదానికి ఇది పూర్తి విరుద్ధం.

వాస్తవానికి కొన్ని దేశాలు, సాపేక్షంగా చిన్న దేశాలు, తమ వద్ద ఉండే కొద్దిపాటి నిరుద్యోగాన్ని అధిగమించాయి. అందుకోసం అవి సంపన్న దేశాల నుండి పెట్టుబడులను ఆహ్వానించాయి (ఆసియా పులులు ఒక ఉదాహరణ). కాని ఇవి అరుదైన మినహాయింపులే తప్ప సర్వసాధారణ ఉదాహరణలు కాలేవు. ఇటువంటి చిన్న చిన్న దేశాలకు వర్తించే అనుభవాలు అపారంగా నిరుద్యోగం ఉన్న భారతదేశం వంటి పెద్ద దేశాలకు అస్సలు వర్తించవు. మనకి ఈ నిరుద్యోగం వలస పాలనా కాలం నుంచీ, వారి దోపిడీ పుణ్యమా అని ఒక శాపంలాగా చుట్టుకుంది. పెద్ద ఎత్తున వ్యవసాయ రంగం ఉండడంతో దాని మాటున ఈ నిరుద్యోగం నివురుగప్పిన నిప్పులా ఉంది. పెట్టుబడిదారీ మార్గాన ఇటువంటి దేశం వెనుకబాటుతనాన్ని అధిగమించి అభివృద్ధి సాధించి నిరుద్యోగాన్ని రూపుమాపుతుంది అని ఆశించడం అర్థం లేనిది. నయా ఉదారవాద విధానాల ప్రవేశానికి ముందరి కాలంలో ఈ వాస్తవాన్ని బాగానే అర్థం చేసుకున్నారు. అందుకే ప్రభుత్వ జోక్యంతో కొంతమేరకు అభివృద్ధి సాధించారు. కాని నయా ఉదారవాద దశలో పెట్టుబడిదారీ భక్తి ఎంత ఎక్కువగా ఎక్కిస్తున్నారంటే గతంలో అర్థం చేసుకున్నది ఇప్పుడు మరిచిపోయారు. భ్రమల్లో పడ్డారు. ఈ భ్రమల నుంచి ప్రజలు ఎంత వేగంగా బయట పడగలిగితే అంత తొందరగా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేయగల ప్రత్యామ్నాయ విధానాల వైపు అడుగులు వేయడానికి వీలౌతుంది. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసి తద్వారా అభివృద్ధి క్రమం వేగాన్ని నిలకడగా పెంచుకుంటూ పోవడం సాధ్యపడుతుంది. పెట్టుబడులు దేశ సరిహద్దులు దాటిపోడానికి వీలు లేకుండా నియంత్రించి, ప్రభుత్వ రంగాన్ని బలంగా నిలబెట్టి తద్వారా పెట్టుబడిదారుల ఒత్తిళ్లను తిప్పికొట్టి ముందుకు పోవడం కుదురుతుంది. ఇదెంత తొందరగా జరిగితే మానవాళికి అంత మేలు. ❑ **(ప్రజాశక్తి సౌజన్యంతో)**

# ట్రంప్‌ను భయపెడుతున్న 'కమ్యూనిస్టు భూతం'



- ఎం.కోటేశ్వరరావు

ఒక భూతం ఇప్పుడు వెంటాడుతున్నది, అదే కమ్యూనిస్టు భూతం అనే వాక్యంతో కారల్ మార్క్స్-ఎంగెల్స్ 1848లో రూపొందించిన కమ్యూనిస్టు ప్రణాళిక ప్రారంభం అవుతుంది. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు అదే భూతం సామ్రాజ్యవాదం, దాని కుంభస్థలంగా వున్న అమెరికాను మరోసారి "కమ్యూనిస్టు భూతం" ఊపివేస్తోంది. గతంలో అక్కడి కార్మికవర్గంపై సోషలిస్టు శిబిర సమాజాల ప్రభావం పడకుండా చూసేందుకు పాలకవర్గం అనుసరించని దుష్ట విధానాలు లేవు. ఇప్పుడు చైనా, వియత్నాం, ఉత్తర కొరియా, క్యూబా వంటి సోషలిస్టు దేశాలు ఉన్నప్పటికీ గతం మాదిరి శిబిరంగా లేవు. అయినప్పటికీ గతం కంటే ఇప్పుడు ఎక్కువగా భయపడుతున్నారు. నాడు సోషలిజం విఫలమైందని అమెరికా, ఐరోపా దేశాల పాలకవర్గం ప్రచారం చేస్తే పెట్టుబడిదారీ విధానం విఫలమైందని యువతీ యువకులు అనుభవపూర్వకంగా రోజురోజుకూ ఎక్కువగా గుర్తించటమే దీనికి కారణం. ఎరక్కపోయి ఇరుక్కున్నట్లు ఇరాన్ శక్తి యుక్తులను తక్కువగా అంచనా వేసిన డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు నవంబరు 3న జరిగే మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీని గెలిపించేందుకు నానా గడ్డీ కరుస్తున్నాడు. తెల్లవారితే ఇరాన్ మీద కొత్త అబద్దం, ప్రచారాన్ని ముందుకు తెస్తున్నాడు. దీంతో పాటు ఓటర్లను భయపెట్టేందుకు పూనుకున్నాడు. అమెరికాకు ఇప్పుడు "కమ్యూనిజం పెద్ద ముప్పు" అంటూ ఊగిపోతున్నాడు. సోషలిజం, కమ్యూనిజాలను ఏడు నిలువుల లోతున తిరిగి లేవకుండా పాతిపెట్టామని చెప్పిన నోటితోనే ఇప్పుడు ముప్పు వచ్చిందని చెబుతున్నాడు. నిజంగా అలాంటి ముప్పు తలెత్తిందా ? నిజానిజాలేమిటి ?

ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ కమ్యూనిజాన్ని ఆలింగనం చేసుకొంటోందని డోనాల్డ్ ట్రంప్ గత వారం వ్యాఖ్యానించాడు. పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలలో డెమోక్రటిక్ పార్టీ తరఫున అభ్యర్థులుగా పురోగామివాదులు, అదే పార్టీలో డెమోక్రటిక్ సోషలిస్టులుగా ప్రకటించుకున్న వారు అనేకచోట్ల ముందంజలో ఉండటమే దీనికి కారణం. ముఖ్యంగా న్యూయార్క్‌లో ట్రంప్, ఇతర కమ్యూనిస్టు వ్యతిరేకులు ఎంత రెచ్చగొట్టినా ఓటర్లు డెమోక్రటిక్ సోషలిస్టు జోహ్రాన్ మందానీని మేయర్‌గా ఎన్నుకున్నారు. అనేకచోట్ల అదే పునరావృతం అయ్యేట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. పురోగామివాదులకు పెద్ద పీట వేయటం అమెరికా విలువలకు ముప్పు అంటూ మితవాద శక్తులు గగ్గోలు పెడుతున్నాయి. వాటితో డెమోక్రటిక్ పార్టీలోని వారు కూడా చేతులు కలుపుతున్నారు. గత మంగళవారం న్యూయార్క్ నగరం నుంచి మూడు పార్లమెంటు స్థానాలకు డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరిగిన ప్రైమరీలలో మందానీ బలపరిచిన అభ్యర్థులు నెగ్గారు. శుక్రవారం క్రైస్తవ మితవాదుల సభలో మాట్లాడిన ట్రంప్ వారంతా కమ్యూనిస్టులను, దేశానికి కమ్యూనిజం ముప్పు వచ్చిందని ఆరోపించాడు. ఆదివారం వాషింగ్టన్ నగర మేయర్ కమ్యూనిస్టు కాబోతున్నట్లు ట్రంప్ వాపోయాడు. దీంతోపాటు ఏకంగా దేశ రాజధాని వాషింగ్టన్ డీసీ నగరంలోనే అలాంటి అభ్యర్థి ముందుండటం ట్రంప్‌కు కలవరం కలిగించింది. ఫెయిత్ అండ్ ఫ్రీడమ్ కోయలిషన్ అనే మతపరమైన మితవాదుల వార్షిక సమావేశంలో ఆధిక్యత కోసం మార్గం అనే ఇతివృత్తంపై ట్రంప్ మాట్లాడుతూ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడు. ఆ అంశాలనే తర్వాత తన సామాజిక మాధ్యమంలోను పోస్టు చేశాడు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత రెండవ ప్రపంచ యుద్ధం, పెరల్ హార్బర్, లేదా 2011 సెప్టెంబరులో న్యూయార్క్ నగర ప్రపంచ వాణిజ్య కేంద్రంపై దాడికంటే 250 ఏళ్లనాడు ఏర్పడిన అమెరికాకు తొలిసారిగా కమ్యూనిజం ముప్పుగా మారిందని పేర్కొన్నాడు. ఉచితంగా ఇళ్లు, ఆహారం వంటి నినాదాలతో ముందుగా కమ్యూనిజం ఆకర్షిస్తుంది. తర్వాత అది కూలిపోతుందని ట్రంప్ తన ఉపన్యాసంలో సెలవిచ్చాడు. డెమోక్రటిక్ పార్టీ పెద్ద ప్రమాదంలో ఉంది. మౌలికమైన సామాజిక కార్యక్రమాలతో అది సాంప్రదాయ అమెరికా విలువలను ధ్వంసం చేస్తున్నది. ఇది న్యూయార్క్ నగరంతోనే ఆగదు. వామపక్ష తీవ్రవాదులు పిల్లలను నపుంసకులుగా మారుస్తారు. వారు క్రైస్తవులు, చర్చ్‌ల మీద యుద్ధాన్ని తిరిగి ప్రారంభించాలని చూస్తున్నారు. న్యూయార్క్ నగరంలో ఎన్నికైన కమ్యూనిస్టులను చూశారు. సాంప్రదాయ అమెరికా జీవన విధానాన్నే పూర్తిగా నాశనం చేయాలని చూస్తున్నారని ట్రంప్ ఆరోపించాడు.

కమ్యూనిజం మతానికి వ్యతిరేకం. హింస దానిలో అంతర్భాగం. హత్యలు వారికి పెద్ద అంశం. వారు పశువులని అన్నాడు. గాజాలో ఇజ్రాయెల్ యూదు దురహంకారులు పిల్లలను ఎలా పథకం ప్రకారం వధించారో చూసి కూడా ఆ దుర్మార్గాన్ని నిస్సిగ్గుగా సమర్ధించి చంపండి, నరకండి అంటూ ప్రోత్సహించిన ట్రంప్ కమ్యూనిస్టులపై ఇలా మాట్లాడటం ఆశ్చర్యం కలిగించటం లేదు. క్రైస్తవ మతవాదుల సమావేశంలో ప్రసంగించిన ప్రజాప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ అదే

కమ్యూనిస్టు వ్యతిరేక ఉన్మాదంతో ఊగిపోయాడు. కమ్యూనిజం విదేశీ సమస్య కంటే అంతర్గత ముప్పు అన్నాడు."దేశంలో ఇప్పుడు ఒక ప్రమాదకర ధోరణి నడుస్తోంది, సరిగా చెప్పాలంటే దేశమంతటా పార్లమెంటుకు పోటీ చేసేందుకు చిన్న మందానీలు ఎదుగుతున్నారు" అన్నాడు. ఇవాంజ లిస్టులంటే క్రైస్తవ మతమార్పిడిని బహిరంగంగా ప్రోత్సహించే మిషనరీ సంస్థలకు చెందిన వారు. అమెరికా చరిత్రలో కమ్యూనిస్టు వ్యతిరేకతను నూరిపోసినవారిలో వీరి పాత్ర కూడా తక్కువేమీ కాదు. ఇలాంటి వారంతా పాల్గొన్న సభ కనుకనే ట్రంప్ కమ్యూనిస్టు వ్యతిరేకత గురించి మాట్లాడాడు. ఎనిమిది పదుల ట్రంప్ ఎప్పుడేం మాట్లాడతాడో తెలియటం లేదు.

కమ్యూనిస్టులు చర్చీలను కూల్చి వేస్తారు. క్రైస్తవులను చంపుతారు. మతాన్ని నాశనం చేస్తారని మాట్లాడిన నోటితోనే అంతకుముందు అసలు తానే పెద్ద కమ్యూనిస్టు దేశానికి నాయకుడినని, షీ జిన్‌పింగ్ ఎంతో మంచి వ్యక్తి అని అన్నాడు. శుక్రవారం కమ్యూనిజంపై ప్రారంభించిన దాడిని ఆదివారం నాడు కొనసాగించాడు. వాషింగ్టన్ డీసీ నగర మేయర్ పదవికి డెమోక్రటిక్ పార్టీ మహిళా నాయకురాలు జానీస్ లెవిస్ జార్జ్ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. ఆమె దాదాపు ఎన్నికయినట్లే అని స్వయంగా ట్రంప్ తన సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాడు. ఆమె ఒక కమ్యూనిస్టు అని, రాజధాని నగరానికి ఆమె విధానాలు హాని కలిగిస్తాయని వాపోయాడు. నగరంలోని జైళ్లను ఖాళీ చేస్తారని, వలసదార్లకు రక్షిత నగరంగా మారుస్తారని, నేరగాండ్లను నగరానికి తిరిగి తీసుకువస్తారని ఆరోపించాడు. లెవిస్ జార్జ్ ప్రస్తుతం నగర కార్పొరేషన్ వార్డు సభ్యురాలిగా ఉన్నారు.ఇప్పుడున్న డెమోక్రటిక్ మేయర్ మరోసారి పోటీ చేయడం లేదు. దాంతో ఆమె ముందుకు వచ్చారు. తాను డెమో క్రటిక్ సోషలిస్టునని స్వయంగా ప్రకటించుకున్నారు. అధికార రిపబ్లికన్ పార్టీకి కనీసం మేయర్ అభ్యర్థికూడా లేని స్థితి. లెవిస్ కనుక అభ్యర్థిగా ఎన్నికైతే నగరాన్ని ఫెడరల్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ట్రంప్ బెదిరించాడు. గతేడాది ఆగస్టు నుంచి నగరంలో నేరాలను అరికట్టే పేరుతో వివిధ రాష్ట్రాల నుంచి రప్పించిన నేషనల్ గార్డు దళాలను తిష్ట వేయించాడు. అంతకు ముందు నగరాన్ని సుందరీకరించేందుకు అనేక పథకాలను రూపొందించినట్లు ప్రకటించిన ట్రంప్ లెవిస్ అభ్యర్థిత్వం ఖరారు కాగానే ఆ పథకాలు ఎలా అమలుచేస్తారో చూస్తానంటూ మాట్లాడాడు. ట్రంప్ తనపై మోపిన అభాండాలు, ఆరోపణలను లెవిస్ ఖండించారు. ట్రంప్ అధికార యంత్రాంగంతో కలసి పని చేస్తానని అన్నారు. డెమోక్రటిక్ పార్టీ అధిష్టానవర్గ అభీష్టానికి వ్యతిరేకంగా పార్టీలో బడా ప్రముఖులుగా వున్న వారిని ఓడిం చేందుకు తనతో భావసారూప్యత కలిగిన ముగ్గురిని బలపరచి మందానీ తన సత్తా చాటుకున్నాడు. పాత రాజకీయాలే ప్రస్తుత సంక్షోభానికి కారణమని, ఆ రాజకీయాలు దాన్నుంచి బయటపడవేయలేవని, న్యూయార్క్ నగరవాసులు నూతన రాజకీయాలను కోరుకుంటు న్నారని మందానీ వ్యాఖ్యానించాడు. దీని అర్థం ఇజ్రాయిల్‌తో అమెరికా సంబంధాలు, అసమానతలు చెల్లవని చెప్పటమే అని విశ్లేషకులు చెబుతున్నారు.డెమోక్రటిక్ పార్టీ అధిష్టానం అభ్యర్థులుగా ధనికులు, అందునా ధనవంతుల మీద పన్నులు వేయాలనటాన్ని వ్యతిరేకించే వారిని ప్రతిపాదించింది. మందానీ వారికి వ్యతిరేకంగా తన మద్దతుదార్లను గెలిపించాడు. యూదు సామాజిక తరగతి గణనీయంగా ఉన్న న్యూయార్క్ నగరంలో ఈ ముగ్గురూ ఇజ్రాయిల్ వైఖరిని దానికి బేషరతుగా మద్దతిచ్చే ట్రంప్ విధానాన్ని వ్యతిరేకించేవారు కావటం విశేషం. ఈ ఫలితాలు సోషలిస్టు ఉద్యమానికి పెరుగుతున్న మద్దతుగా కూడా పరిగణిస్తున్నారు.

డెమోక్రటిక్ పార్టీలో డెమోక్రటిక్ సోషలిస్టులు పెరుగుతున్నారు. అమెరికాలో పెట్టుబడిదారీ వ్యవస్థ సామా జిక భద్రతా పథకాలను అమలు జరుపుతున్నప్పటికీ సమాజంలో అసమానతలు, అసంతృప్తి పెరుగుతున్నాయి. సామాన్యులు స్వంత ఇల్లు సమకూర్చుకోవటం పెద్ద సమస్యగా మారుతోంది, ఆరోగ్య సంరక్షణ కూడా అదే విధంగా ఉంది. ఒక పరిమితికి మించి జనాలను పెట్టుబడిదారీ వ్యవస్థ పట్టించుకోదని తేలిపో యింది. యువతరానికి విద్యా రుణాలు తలకుమించిన భారంగా మారాయి. తమ ఆకాంక్షలను నెరవేర్చటంలో పెట్టుబడిదారీ విధానం విఫలమైందని భావించే యువత సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు అనేక సర్వేలు వెల్లడించాయి. ధనికుల మీద పన్నులను అధికంగా విధించి ఆ మేరకు సామాన్యులకు ఫలా లను అందించాలని డెమోక్రటిక్ సోషలిస్టులు కోరుతున్నారు, నిజమే కదా అని యువత ఆకర్షితులౌతున్నారు. అమెరికా ఆర్థిక పురోగమనం ఆశించిన విధంగా లేదు, నిజవేతనాలు పడిపోతు న్నాయి. అనవసరమైన యుద్ధాలతో ఆయుధ కంపెనీల కోసం ఖజానా ఖాళీ చేయటం మీద ఉన్న శ్రద్ధ ఏ పార్టీ అధికారంలో ఉన్నా జనం మీద చూపటం లేదు. నిజానికి డెమోక్రటిక్ సోషలి స్టులు ఇప్పుడున్న పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చివేసి సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేస్తామని చెప్పటం లేదు. ఇప్పుడున్న దానిలోనే కార్మికవర్గానికి అనుకూలంగా మరిన్ని సంక్షేమ చర్యలను చేపట్టా లని డిమాండ్ చేస్తున్నారు. దాన్నే ట్రంప్ వంటి వారు కమ్యూ నిజంగా అభివర్ణిస్తున్నారు. సంస్కరణలకు ఒక పరిధి, పరిమితి ఉంటాయి, అది దాటి ముందుకు పోవాలంటే కమ్యూనిజమే శరణ్యమని యువత మరికొన్ని అడుగులు ముందుకు వేస్తారేమో అన్నది అమెరికా పెట్టుబడిదారుల అసలు భయం, దానికి ఎవరూ చేసేదేమీ లేదు. రానున్నది రాకమానదు, కానున్నది కాక మానదన్నది చరిత్ర చెప్పిన సత్యం! ❑

# కార్పొరేట్‌లకు అచ్చే దిన్



- మార్పు శరత్

*గత దశాబ్ద కాలంగా భారత రాజకీయాల్లో “అచ్చే దిన్” అనే నినాదం ఒక ప్రధాన చర్చాంశంగా నిలిచింది. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తామని, 15 లక్షల రూపాయలు ప్రజలందరి ఖాతాల్లోనూ వేస్తామని, అవినీతిని తగ్గిస్తామని, ఉపాధి అవకాశాలు పెంచుతామని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తామని హామీ ఇచ్చింది. పన్నెండేళ్ల తర్వాత, 2026 నాటికి ఆ హామీల ఫలితాలను అంచనా వేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో కొన్ని గణాంకాలు ఆసక్తికరమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.*

- 2014లో ముకేశ్ అంబానీ సంపద రూ.1.55 లక్షల కోట్లు 2026 నాటికి అది రూ.9.8 లక్షల కోట్లకు పెరిగింది. అంటే పెరుగుదల 532%.
- 2014లో రూ.45,000 కోట్లుగా ఉన్న గౌతమ్ అదానీ సంపద.నేడు రూ.7.6 లక్షల కోట్లు. పెరుగుదల 1,589%.
- 2014 నాటికీ BJP ఆస్తులు రూ.970 కోట్లు నేడది రూ.6,088 కోట్లు. 528% పెరుగుదల.
- 2014 నాటికీ కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.55 లక్షల కోట్లు నేడు రూ.338 లక్షల కోట్లు. 514% పెరిగింది.

ఈ గణాంకాలను చూస్తే దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక స్పష్టమైన ధోరణి కనిపిస్తుంది. కొద్ది మంది కార్పొరేట్ దిగ్గజాల సంపద అపూర్వంగా పెరిగింది. అదే సమయంలో దేశ రుణభారం భారీగా పెరిగింది.

## సంపద కేంద్రీకరణ - అభివృద్ధి ఫలితాలు ఎవరికీ?

భారతదేశంలో ఆర్థిక వృద్ధి జరిగిందనే విషయంలో సందేహం లేదు. GDP పెరిగింది. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలను చేరుకుంది. మౌలిక వసతుల నిర్మాణం పెరిగింది. అయితే ఈ వృద్ధి ఫలితాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరాయా ? ప్రపంచ వ్యాప్తంగా అసమానతలపై అధ్యయనాలు చేసే సంస్థలు చెబుతున్న దాని ప్రకారం భారతదేశంలో అత్యంత ధనిక 1% ప్రజల చేతుల్లో దేశ




సంపదలో భారీ భాగం కేంద్రీకృతమవుతోంది. దేశ సంపద పెరుగుతున్న కొద్దీ దాని పెద్ద భాగం కార్పొరేట్ వర్గాలు, పెట్టుబడిదారులు, పెద్ద వ్యాపార గృహాలకు చేరుతోంది. ముకేశ్ అంబానీ సంపద ఆరు రెట్లకుపైగా పెరగడం, గౌతమ్ అదానీ సంపద పదిహేను రెట్లకు పైగా పెరగడం కేవలం వ్యక్తిగత విజయగాథలు మాత్రమే కాదు. ప్రభుత్వ విధానాలు, ప్రైవేటీకరణ, మౌలిక వసతుల కాంట్రాక్టులు, బ్యాంకింగ్ వ్యవస్థ, పెట్టుబడి వాతావరణం వంటి అంశాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయని విమర్శకులు వాదిస్తున్నారు.

## అప్పులపై నడుస్తున్న అభివృద్ధి ?

2014లో కేంద్ర ప్రభుత్వ అప్పు సుమారు రూ.55 లక్షల కోట్లు ఉండగా, 2026 నాటికి అది రూ.338 లక్షల కోట్లకు చేరిందని అంచనాలు చెబుతున్నాయి. ప్రభుత్వం వాదన ఏమిటంటే ఈ అప్పులను రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, రక్షణ రంగం అభివృద్ధి కోసం వినియోగించామని. కానీ ప్రజాస్వామ్యంలో ఒక సహజమైన ప్రశ్న తలెత్తుతుంది. అప్పులు పెరిగితే వాటి భారాన్ని భవిష్యత్ తరాలు భరించాల్సి వస్తుంది. మరి ఆ అప్పులతో సృష్టించిన ఆస్తులు, ఉపాధి, ప్రజా ప్రయోజనాలు ఎంతవరకు ప్రజలకు చేరాయి? దేశంలో యువత నిరుద్యోగం ఇప్పటికీ ఒక ప్రధాన సమస్యగా ఉంది. లక్షలాది ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయి. కాంట్రాక్టు ఉద్యోగాలు పెరుగుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలోనే ఉంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు GST, డీమోనిటైజేషన్, ఆర్థిక మందగమనం ప్రభావాల నుంచి పూర్తిగా

(మిగతా 30వ పేజీలో)

# ప్రతిఘటన, పునరుజ్జీవనం.. ఇండియా కూటమి భవిష్యత్తు



- దీపాంకర్ భట్టాచార్య

**లో**క్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఇటీవల ఇండియా (INDIA) కూటమి నాయకుల సమావేశంలో చేసిన ప్రసంగాన్ని బహిరంగంగా విడుదల చేయడం ఒక విశేష పరిణామం. భారత గణతంత్ర రాజ్యాంగ పునాదులపై, ప్రజల జీవనోపాధులపై, ప్రజాస్వామ్య స్వేచ్ఛలపై జరుగుతున్న బీజేపీ–సంఘ్ పరివార్ దాడులను ఎదుర్కొనేందుకు ఐక్య ప్రతిఘటన అవసరమని ఆయన చేసిన పిలుపు స్వాగతార్హం. ఆ ప్రతిఘటన నిజంగా శక్తివంతంగా, దీర్ఘకాలికంగా మారాలంటే కొన్ని అంశాలపై మరింత లోతైన ఆలోచన అవసరం.

## స్వాతంత్ర్యోద్యమ వారసత్వం - అందరి భాగస్వామ్యం

ఇండియా కూటమి 2023లో ఏర్పడినప్పటి నుంచి జరిగిన అన్ని సమావేశాల్లో పాల్గొన్న అనుభవంతో చెప్పగలను. రాహుల్ గాంధీ ప్రసంగం ఆశాజనకంగానే ఉన్నప్పటికీ, 23 రాజకీయ పార్టీలతో కూడిన విభిన్న భావజాలాల వేదికలో అది కొంత వరకు కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమావేశాన్ని తలపించింది. పూర్ణ స్వరాజ్య లక్ష్యాన్ని స్వీకరించిన తర్వాత కాంగ్రెస్ స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిందనేది నిజమే. కానీ భారత స్వాతంత్ర్య సంగ్రామం కేవలం కాంగ్రెస్ కథ మాత్రమే కాదు. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఫూలే–అంబేద్కర్–పెరియార్ స్రవంతి, భగత్‌సింగ్ వంటి విప్లవకారుల పాత్ర అంతే ముఖ్యమైనది. పూర్ణ స్వరాజ్య భావనను 1921లో కాంగ్రెస్ సమావేశంలో మొదట ప్రతిపాదించిన వారు కమ్యూనిస్టు నాయకులు మౌలానా హస్రత్ మొహానీ, స్వామి కుమారానంద. భగత్‌సింగ్ హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ ద్వారా భారత భవిష్యత్తుకు ఒక విప్లవాత్మక దిశను సూచించాడు.

## నియంతృత్వానికి వ్యతిరేకంగా చారిత్రక పోరాటం..

నేడు జరుగుతున్న పోరాటం స్వాతంత్ర్యోద్యమాన్ని నిర్మించిన ప్రజాస్వామ్య, లౌకిక, సమానత్వ శక్తులకు, ఆ ఉద్యమానికి దూరంగా నిలిచిన హిందుత్వ రాజకీయ శక్తులకు మధ్య జరుగుతున్న ఘర్షణ. ఆర్ఎస్ఎస్ - బీజేపీ భారత ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ సంస్థలను, పార్లమెంటరీ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని తమ భావజాలానికి అనుగుణంగా మార్చాలని ప్రయత్నిస్తున్నాయి. "ఒక దేశం–ఒక పార్టీ" అనే దిశగా దేశాన్ని నడిపించేందుకు ప్రయత్నిస్తే, దాని నష్టాన్ని కేవలం ఇతర పార్టీలు మాత్రమే కాదు. కాంగ్రెస్ కూడా చవిచూడాల్సి వస్తుంది. స్వాతంత్ర్యోద్యమ వారసత్వం ఏ రాజకీయ పార్టీకి శాశ్వత రక్షణ కవచం కాదు. నేటి ఫాసిస్టు దాడిని ఎదుర్కోవడానికి నిరంతర ప్రజా ప్రతిఘటనే మార్గం.

## న్యాయబద్ధమైన గణతంత్రం కోసం..

భారతదేశాన్ని కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి నెట్టివేసే పెట్టుబడిదారీ నమూనా దేశాన్ని సంక్షోభంలోకి నెట్టింది. ప్రజల సంపదను కొద్ది మందికి బదిలీ చేస్తూ, పర్యావరణాన్ని నాశనం చేస్తూ, సామాజిక అసమానతలను పెంచుతోంది. భారత విదేశాంగ విధానం స్వతంత్రతను కోల్పోతూ అమెరికా–ఇజ్రాయెల్ వ్యూహాలకు అనుగుణంగా మారుతోంది. ఆదివాసీల భూములు, అటవీ హక్కులపై దాడులు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య నిరసనలను అణచివేస్తూ, "బుల్డోజర్ న్యాయం", "ఎన్‌కౌంటర్ రాజకీయాలు" ప్రోత్సహించబడుతున్నాయి. మత ఆధిపత్యాన్ని జాతీయతగా చూపించే సాంస్కృతిక జాతీయ వాదాన్ని తిరస్కరించాలి. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను పునరుద్ధరించేందుకు సమగ్ర సంస్కరణలు అవసరం. ప్రజల ప్రతిఘటన ఇప్పటికే ప్రారంభమైంది. ప్రజలు ఇప్పటికే అనేక సందర్భాల్లో ప్రభుత్వాన్ని వెనక్కి తగ్గించారు. భూసేకరణ ఆర్డినెన్స్‌ను రైతులు వ్యతిరేకించారు. మూడు వ్యవసాయ చట్టాలను రైతాంగ ఉద్యమం రద్దు చేయించింది. సీఏఏ వ్యతిరేక ఉద్యమం రాజ్యాంగ విలువల రక్షణకు దేశవ్యాప్త ప్రతిఘటనగా మారింది. కార్మికులు పెరుగుతున్న పనిగంటలు, తగ్గుతున్న వేతనాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. విద్యార్థులు విద్యా వ్యవస్థ సంక్షోభంపై నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పోరాటాలకు ప్రజలు భారీ మూల్యం చెల్లించారు. రైతాంగ ఉద్యమంలో 700 మందికి పైగా రైతులు మరణించారు. ఫాదర్ స్టాన్ స్వామి జైలు నిర్బంధంలోనే మరణించారు. ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్ తదితరులు సంవత్సరాలుగా జైళ్లలో ఉన్నారు. అనేక కార్మిక, ప్రజాస్వామ్య ఉద్యమ కార్యకర్తలు నిర్బంధాలను ఎదుర్కొంటున్నారు.

## ఇండియా కూటమికి కొత్త ఊపు అవసరం

పౌరసత్వ ఉద్యమం, రైతాంగ పోరాటం, భారత్ జోడో యాత్ర, అలాగే కొన్ని రాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి ఆవిర్భావానికి అనుకూల పరిస్థితులను సృష్టించాయి. 2024 ఎన్నికల్లో ఇండియా కూటమి **(మిగతా 34వ పేజీలో)**

# ఆంద్రే బెటెయిల్ : భారతదేశంలో కుల వ్యవస్థపై కొన్ని ప్రతిబింబాలు..



- కె.శ్రీనివాసులు

ఆంద్రే బెటెయిల్ మరణంతో, భారతీయ సమాజశాస్త్రంలో అనేక తరాల విద్యార్థులను తీర్చిదిద్దిన, ఐదు దశాబ్దాలకు పైగా భారతీయ సమాజ అధ్యయనానికి అంకితభావంతో కృషి చేసిన ఒక మహానుభావుని శకం ముగిసింది. South Asians & Diaspora సైద్ధాంతిక లోతు, అనుభావిక అవగాహనల మధ్య అసాధారణమైన సమన్వయం సాధిస్తూ, కఠినమైన క్షేత్ర అధ్యయనంపై ఆధారపడిన ఆయన బౌద్ధిక వారసత్వం అపూర్వమైనది. భారతీయ సమాజం, అందులోని కులం, వర్గం, హోదా ఆధారిత సామాజిక స్థాయీకరణతోపాటు ఈ అంశాల కలయిక ద్వారా ఏర్పడే అధికార సంబంధాల మార్పు - ఇవే బెటెయిల్ దీర్ఘకాలిక బౌద్ధిక ఆసక్తి. సాంప్రదాయకంగా కుల వ్యవస్థను వర్ణ పరిధిలో అధ్యయనం చేయడం జరిగింది. ఇండాలజికల్ (భారతీయ విజ్ఞాన) సంప్రదాయం నుంచి వచ్చిన ఈ దృక్పథం భారతీయ శాస్త్రాలను గ్రంథాల ఆధారంగా చదవడం ద్వారా రూపొందించబడింది. ఈ గ్రంథ గత సోపాన క్రమానికి జీవన వాస్తవికత కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం కేవలం వలసవాద వ్యాసాలలో మాత్రమే కాకుండా, భారతీయ సమాజశాస్త్ర ప్రారంభదశలో స్పష్టంగా కనిపించింది. జీఎస్ ఘుర్యే నుంచి మొదలుకుని తర్వాత పండితులు కూడా భారతీయ సామాజిక నిర్మాణాన్ని వర్ణ చట్రంలోనే అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు.

## గణనీయమైన ప్రభావం

ఫ్రెంచ్ సమాజ శాస్త్రవేత్త లూయిా డ్యూమాంట్ తన విశిష్ట రచన 'హోమో హైరార్కికస్' (మానవ సోపానక్రమం)లో ఈ గ్రంథగత దృక్పథానికి అత్యుత్తమ ఉదాహరణగా నిలిచారు. People & Society పవిత్రత-అపవిత్రత ఆధారంగా కుల వ్యవస్థను ఒక నైతిక క్రమంగా చిత్రీకరించి, చాతుర్వర్ణ వ్యవస్థపై ఆధారపడి వివరించారు. డ్యూమాంట్ రచన కుల అధ్యయనానికి ఒక ప్రమాణంగా మారి, పాశ్చాత్య పండితులపైనే కాకుండా తర్వాత తరం భారతీయ సమాజ శాస్త్రవేత్తలపైన గణనీయమైన ప్రభావం చూపింది. నిర్మల్ కుమార్‌బోస్, ఎంఎన్ శ్రీనివాస్ - తనకు మార్గదర్శకులైన ఈ ఇద్దరు ప్రముఖుల ప్రభావంతో బెటెయిల్ భారతీయ సామాజిక నిర్మాణాన్ని అధ్యయనం చేశారు. అయితే బెటెయిల్ దృక్పథం, పద్ధతి, విశ్లేషణలో వారిని మించిపోయారు. గ్రంథాల నుంచి వాస్తవ ప్రపంచం వైపు, మూలపాఠాల నుంచి సామాజిక సందర్భం వైపు - వాటి మధ్య



ఉన్న సంబంధాన్ని విస్మరించకుండా - ఆయన అవలంభించిన పద్ధతి పరమైన మార్పు సహజమైనది. భారతీయ సమాజం, ముఖ్యంగా కుల సమస్యను కేవలం గ్రంథకర్త దృక్పథం నుంచి బయటకు తీసుకొచ్చి, కఠినమైన అనుభావిక (క్షేత్రాధారిత) అధ్యయనంపై ఆధారపడి గతిశీలమైన, సందర్భానుసారమైన విశ్లేషణ అందించారు. వలసవాద వారసత్వం కారణంగా భారతీయ సమాజశాస్త్రం పాశ్చాత్య సిద్ధాంతాలలో బాగా ఇరుక్కుపోయింది. సామాజిక మార్పులోని గతిశీలతను అర్థం చేసుకోవడానికి అడ్డుపడే, ముందుగా నిర్ణయించుకున్న సైద్ధాంతిక చట్రాలను నిరోధించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించారు. సిద్ధాంతం సామాజిక వాస్తవికతను కప్పివేయకుండా దానిపై వెలుగునివ్వాలని నమ్మారు.

## కులం, వర్గం, అధికారం..

బెటెయిల్ రాసిన మొదటి ముఖ్య రచన 'కాస్ట్, క్లాస్ అండ్ పవర్' (కులం, వర్గం, అధికారం-1965) తంజావూరు జిల్లాలోని రామపురం (శ్రీపురం) అనే బ్రాహ్మణ అగ్రహార గ్రామంపై ఆధారపడి రాయబడింది. ఇది సాధారణ గ్రామ అధ్యయనం కాకుండా, భారతీయ సమాజ శాస్త్రంలో ప్రభావవంతమైన సిద్ధాంతాలతో లోతైన సంబంధం ఏర్పరచుకున్న అసాధారణ రచన. South Asians & Diaspora ఈ పుస్తకం ఎంఎన్ శ్రీనివాస్ రాసిన 'రిమెంబర్డ్ విలేజ్' (జ్ఞాపకాల గ్రామం)తో పోల్చదగిన స్థానం సంపాదించింది. గ్రామ అధ్యయనాలలో సాధారణంగా దృష్టి సారించే కుటుంబం, బంధుత్వం, ఆచారాలు వంటి వాటి పరిధి నుంచి ఈ అధ్యయనం బయటకు వచ్చింది. కులం, వర్గం, హోదా, మారుతున్న అధికార సమీకరణాలపై ఇది దృష్టి పెట్టింది. ఒకే అంశం సామాజిక స్థాయీకరణను పూర్తిగా

వివరించలేదని బెటెయిల్ స్పష్టం చేశారు. భూమి, వృత్తి, హోదా, విద్య, రాజకీయ ప్రాప్యతలలో వస్తున్న మార్పుల ద్వారా కులం-వర్గం-అధికారాల మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని (ఇంటర్ సెక్షనాలిటీని) వివరించారు. "శ్రీపురం సాపేక్షంగా మూసుకుపోయిన సామాజిక వ్యవస్థ నుంచి, సాపేక్షంగా స్వేచ్ఛాయుతమైన (తెరిచిన) వ్యవస్థగా మారుతోంది" అని విశ్లేషించారు. ఈ మార్పులో కీలకమైన అంశం బ్రాహ్మణుల భూస్వామ్యం, నియంత్రణ తగ్గడం. అదే సమయంలో బ్రాహ్మణేతర కౌలుదారులు, వృత్తి కులాలు సామాజిక సోపానక్రమంలో పైకి ఎదగడం. భూమి విపణి(మార్కెట్) ఏర్పాటు, విద్యా వ్యాప్తి, ప్రభుత్వ ఉద్యోగాల్లో వారి ప్రవేశం ఈ మార్పును మరింత సులభతరం చేశాయి. మాక్స్ వెబర్ సిద్ధాంతం నుంచి ప్రేరణ పొందిన బెటెయిల్ కులం, వర్గం, హోదా, అధికారం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టం చేశారు. అయినప్పటికీ మార్క్సిస్టు విశ్లేషణ పట్ల ఆయన పూర్తి వ్యతిరేకత చూపలేదు. వివిధ బౌద్ధిక సంప్రదాయాల పట్ల ఆయనకున్న విశాల దృక్పథం(తెరిచిన మనస్తత్వం) ఆయన ప్రత్యేక లక్షణం.

**మార్పును గుర్తించిన బెటెయిల్..**

బెటెయిల్ "మూసుకుపోయిన సమాజం" నుంచి "స్వేచ్ఛా యుత సమాజం" వైపు జరుగుతున్న మార్పును గుర్తించారు. ఇది కేవలం ఒక్క అంశానికే ప్రాధాన్యత ఇవ్వకుండా, అనేక కారకాలను పరిగణనలోకి తీసుకోవడానికి వీలు కల్పించింది. రామపురంలో బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు, ఆది-ద్రావిడులు అనే మూడు ప్రధాన కుల సమూహాలు ఉన్నాయని, అలాగే వర్గాలు భూస్వాములు, కౌలుదారులు, కూలీలుగా విభజించబడ్డాయని ఆయన గుర్తించారు. కుల హోదా, ఆస్తి యాజమాన్యం కలయిక ద్వారా అధికారం నిర్వచించబడింది. బ్రాహ్మణులు కులం, భూస్వామ్యం, సామాజిక హోదా, రాజకీయ అధికారం అన్నింటిలోనూ ఉన్నత స్థానంలో ఉండేవారు. ఆది-ద్రావిడులు అట్టడుగున ఉండేవారు. బ్రాహ్మణేతరులు మధ్యస్థంగా ఉండేవారు. స్వాతంత్ర్యానంతరం, ముఖ్యంగా బ్రాహ్మణేతర ద్రావిడ ఉద్యమం వల్ల బ్రాహ్మణులు తమ భూములు అమ్మి నగరాలకు వలస వెళ్లారు. దీంతో బ్రాహ్మణేతరులు (ముఖ్యంగా శూద్ర కులాలు) ఆ భూములను కొనుగోలు చేసి రైతులుగా మారి, రాజకీయ శక్తిగా ఎదిగారు. అయితే ఈ మార్పు ఆది-ద్రావిడుల (దళితుల) జీవితాలపై పెద్దగా ప్రభావం చూపలేదు. వారు ఇప్పటికీ కుల సోపానక్రమంలో అట్టడుగునే ఉన్నారు, భూమిలేని కూలీలుగానే మిగిలిపోయారు. గ్రామీణ ప్రాంతాలలో ఒకప్పుడు భూస్వాములకు, భూమిలేని వారికి మధ్య ఉన్న వ్యత్యాసం ఇప్పుడు ఆధిపత్య శూద్ర కులాలకు, దళితులకు మధ్య వైరుధ్యంగా మారింది. తమిళనాడులో ద్రావిడ పార్టీల మద్దతుదారులైన ఈ శూద్ర కులాలే దళితులపై జరుగుతున్న హింసాత్మక దాడులకు ప్రధాన కారకులవుతున్నారు. ఎంఎన్ శ్రీనివాస్ ప్రతిపాదించిన 'సంస్కృతీకరణ' భావనను బెటెయిల్ సవాలు చేశారు. ఆ భావన ప్రకారం నిమ్న కులాలు ఉన్నత కులాల(ముఖ్యంగా బ్రాహ్మణుల) ఆచారాలను, విలువలను అనుసరించడం ద్వారా సమాజంలో ఎదుగుతాయి. కానీ బెటెయిల్ ఇది పాక్షికంగా మాత్రమే నిజమని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా నిమ్న కులాలు తమ "అట్టడుగు స్థానాన్ని" గర్వంగా చెప్పుకోవడం, కులం పేర్లను తమ గుర్తింపుగా జోడించుకోవడం పెరుగుతున్నట్లు ఆయన గమనించారు.

**రాజ్యాంగ నైతికత..**

"సామరస్యపూర్వక", "సామరస్యరహిత" వ్యవస్థల మధ్య బెటెయిల్ చేసిన వ్యత్యాసం చాలా ముఖ్యమైనది. సామరస్యపూర్వక వ్యవస్థలో సామాజిక వాస్తవికతకు, సామాజిక నైతికతకు మధ్య సమన్వయం ఉంటుంది. అసమానతలు ఉన్నప్పటికీ అవి చట్టబద్ధమైనవిగానే అంగీకరించబడతాయి. సామరస్యరహిత వ్యవస్థలో ఈ సమన్వయం లోపిస్తుంది. రాజ్యాంగ నైతికత అనగా - రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక ఆదర్శాలను, విలువలను, స్ఫూర్తిని కాపాడటమేనని బెటెయిల్ నిర్వచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేసిన తన చివరి ప్రసంగంలో చెప్పినట్లు.. సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి లక్ష్యాలు ఉన్న రాజ్యాంగాన్ని, కుల వ్యవస్థ ఆధారంగా పాతుకుపోయిన అసమాన సమాజంపై అమలు చేయడం ద్వారా ఒక "వైరుధ్యాల జీవితం" మొదలవుతుందని ఆయన హెచ్చరించారు. బెటెయిల్ లౌకికవాదం, లౌకికీకరణ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కూడా చర్చించారు. మొదటిది ఒక ఆదర్శం కాగా, రెండవది సమాజంలో దాని ఆచరణాత్మక అమలు.

**'కుల వ్యవస్థ క్షీణత' వాదన..**

తన తరువాతి రచనలలో బెటెయిల్ కుల వ్యవస్థ క్షీణిస్తోందని వాదించారు. పవిత్రత-అపవిత్రత నియమాలు బలహీనపడడం, వివాహాల్లో కుల పట్టింపులు తగ్గడం, కులానికి వృత్తికి మధ్య ఉన్న సంబంధం విడిపోవడం - ఇవి ఆయన వాదనకు ఆధారాలు. అయితే, ఆయన చేసిన ఈ వాదనను దళితులపై పెరుగుతున్న హింస, దళిత ఉద్యమాలు, పరువు హత్యలు, పత్రికల్లో పెళ్లి సంబంధాల ప్రకటనలు(మ్యాట్రిమోనియల్స్), కులం ఆధారిత వృత్తుల స్థిరత్వం వంటి అంశాలతో బేరీజు వేసుకుని చూడాలి. నిజానికి, నయా ఉదారవాద యుగంలో కులం తన సాంప్రదాయ రూపంలో కనిపించకపోవచ్చు. కానీ సామాజిక ఉత్పత్తి, ఆస్తి యాజమాన్యం, అధికార పంపిణీలో సవర్ణ, ఆధిపత్య శూద్ర కులాల ఆధిపత్యం ఇప్పటికీ బలంగానే

**(మిగతా 34వ పేజీలో)**

# స్వామి వివేకానంద 'హిందూత్వ' వ్యతిరేకి



- కే.ఎల్.కాంతారావు

**స్వామి వివేకానంద ఒక గొప్ప హిందూ మత నాయకుడు. సాటిలేని మేటి హిందూమత ప్రచారకుడు. అయినా ఆయన భావాలన్నీ హిందుత్వవాదుల భావాలకు తీవ్రంగా వ్యతిరేకంగా ఉన్నాయి. వాటిని ఒక్కొక్కటిగా పరిశీలిద్దాం.**

హిందుత్వ వాదులు హిందూమత ప్రచారంకంటే పరమత ద్వేష ప్రచారానికే ప్రాధాన్యమిస్తారు. వారి సర్ సంఘ చాలక్ లలో ముఖ్యుడైన గోల్వాల్కర్ ముస్లింలు, క్రిస్టియన్లు దేశ ద్రోహులు అని వివరించడానికి ఒక ఉపన్యాసమే చెప్పారు. ఆయన తాను రాసిన "వుయ్ ఆర్ అవర్ నేషన్ హుడ్ డిఫైన్ డ్" అనే చిన్న పుస్తకంలో జర్మనీలో హిట్లర్ యూదులను నిర్మూలించి అక్కడి జాతుల సమస్యను ఎలా పరిష్కరించాడో ఇండియాలో ముస్లింల నిర్మూలనకు మనకది గుణపాఠం కావాలి అని రాశారు. ఈ ఆలోచనను వికానంద తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన 1893లో చికాగోలో సర్వమత మహాసభలో చేసిన మొట్టమొదటి ప్రసంగంలోనే అంటే హిందుత్వ సంఘాలు ఏర్పడక ముందే ఈ భావనను తీవ్రంగా ఖండించాడు. ఆయన ఏం చెప్పారంటే "ఈ మహాసభ గౌరవార్థం నేటి ఉదయము మోగించబడిన గంట సర్వవిధాలయిన స్వమత దురభిమానానికీ పరమత ద్వేషానికీ, సాగింపబడే సర్వవిధాలైన హింసకూ మాత్రమే కాక ఒకే గమ్యాన్ని చేరబోయే జనంలోని పరస్పర నిష్ఠుర ద్వేషభావాలకు శాంతి పాఠం కాగలదని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను" అన్నారు. (స్వామి వివేకానంద మహోపన్యాసాల, రచనల సమాహారం, సంపుటి ఒకటి, పేజీ 17).

స్వామీజీ అదే భావాన్ని అనేక సందర్భాల్లో వెలువరించారు. ఉదాహరణకు మరో సందర్భంలో ఆయన మాట్లాడుతూ "తమ మతం ఒక్కటే సుస్థిరంగా నిలిచి ఇతర మతాలన్నీ నశించాలని భావించే మందబుద్ధుల అవివేకానికి నా హృదయాంతర్గత పరితాపాన్ని తెలుపుతున్నా. వీరెంత ప్రతిఘటించినా "కావలసినది కలహం కాదు, సహకారం", "అన్యమత విధ్వంసం కాదు, తదాశయగ్రహణం", "శతృత్వం కాదు, శాంతి యుత సమన్వయం" అని మత పతాకాలపై రాయబడే దినం త్వరలోనే వచ్చి తీరుతుందని తెలుపుతాను" అని అన్నారు (పైపుస్తకం, సంపుటి ఒకటి, పేజీ 18).

ఇంకో విషయం. హిందుత్వవాదులు, హిందూమతంలో




నుంచి ఇస్లాంలోకి మతమార్పిడి, ముస్లిం రాజులు కత్తితో బెదిరించి మతాంతరీకరణ జరిపినందు వల్ల అయిందని పదేపదే నొక్కి చెబుతారు. ఇటీవలి పిల్లల పాఠ్యాంశాలలో "వారు ఒక చేతితో కత్తి, మరొక చేతితో ఖురాన్ పట్టుకొని భారతదేశంలోకి ప్రవేశించారని, హిందువులను బలవంతంగా మతం మార్చారని" చొప్పించి పిల్లల మనసులను విషపూరితం చేస్తున్నారు. కానీ వివేకానందులు ఈ వాదనను ఖండిస్తూ ఆనాడే అనేక సందర్భాలలో మాట్లాడారు. ఉదాహరణకు ఒక ఉపన్యాసంలో ఇలా చెప్పారు "భారతీయులలో అనేక మంది పేదలు ఎందుకు మహమ్మదీయులయ్యారు ? బలవంతంగా (కత్తి ఝళిపి) వారిని మతం మార్చారని చెప్పడం అర్థం లేని మాట. జమీందారుల నుండి, మతాచార్యుల నుండి విడివడి స్వతంత్రులుగా జీవించడానికే వారు అలా అయ్యారు. దీని పర్యవసానంగా మీకు బెంగాల్‌లోని రైతుల్లో హిందువులకంటే మహమ్మదీయులే ఎక్కువ సంఖ్యలో కనిపిస్తారు (పై పుస్తకం సంపుటి 9, పేజీ 253).

మరో ఉపన్యాసంలో ఆయన పేద వారు మహమ్మదీయులుగా మారడానికి కారణాన్ని చెప్పడమే కాదు మరింతమంది క్రైస్తవులుగా మారబోతున్నారని భవిష్యవాణి కూడా చెప్పారు. ఆయన ఏమన్నారంటే "మహమ్మదీయ విజయం భారతదేశంలో అణగద్రొక్కబడి ఉన్న వారికి బీద వారికి మోక్షప్రదాయిగా పరిణమించింది. అందువల్లనే మన ప్రజలలో ఐదో వంతు జనం మహమ్మదీయులయ్యారు. అదంతా కత్తి వల్ల సాధించిన కార్యం కాజాలదు. కత్తీ, అగ్గీ ఇంత కార్యం సాధించాయని

భావించడం చాలా వెర్రితనం. ఐదో వంతు అనడం ఎందుకు? మీ మద్రాసు వాసుల్లో సగం మంది మీరు జాగ్రత్త పడకపోతే క్రైస్తవులు కాగలరు. మలబారు దేశంలో నాకు కనిపించిన దానికన్నా వెర్రి విషయం పూర్వం ఎన్నడైనా ప్రపంచంలో ఉండిందా ? పాపం మాలవాళ్లు ఉన్నత కులాల వారు వెళ్లే వీధుల గుండా నడవనే కూడదట". (పై పుస్తకం సంపుటి ఆరు, పేజీ 186).

మరో సందర్భంలో సాటివారిని ద్వేషించే భావనను నిరసిస్తూ ఆయన ఇలా అంటారు "ఇతరులను ద్వేషించడం అనే పునాది మీద దేశాచారం అనే అడ్డుగోడను తన చుట్టూ నిర్మించుకోవడమే భారతజాతి పతనానికి ముఖ్య కారణం అని నా అభిప్రాయం". (పై పుస్తకం సంపుటి 9, పేజీ 241).

## ఎంతటి దేశభక్తి!

హిందుత్వవాదులు ఆర్యులు భారతీయులేననీ, వారూ, ద్రావిడులూ సమకాలీకులనీ, ఆర్యులు భారతదేశం నుండి పడమర వైపు వలస వెళ్లారని చెప్పడానికి అబద్ధాలతో కూడిన టన్నుల కొద్దీ సాహిత్యాన్ని వెలువరిస్తున్నారు. స్వామి వివేకానంద ఈ వాదనను అంగీకరించరు. ఆయన ఆర్యులు బయట వారేనని అంటారు. ఈ విషయంలో ఆయన ఏమంటారంటే "ఆర్యులు భారతదేశంలోకి చిన్న చిన్న వర్గాలుగా వచ్చి చేరారు. క్రమక్రమంగా ఈ వర్గాలు వ్యాపించసాగాయి. చివరికి వారే భారతదేశంలో ఎదురులేని పాలకులయ్యారు" (పై పుస్తకం, సంపుటం ఏడు, పేజీ 69).

అంతేకాదు, మరో ఉపన్యాసంలో "భారతదేశానికి వచ్చిన ఆర్యులు అక్కడి ఉష్ణ వాతావరణానికి అలవాడ లేకపోయారు" అన్నారు (పై పుస్తకం సంపుటి ఏడు, పేజీ 338).

మరో విషయం. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి పురాణ పురుషులను చారిత్రక వ్యక్తులుగా 'హిందుత్వవాదులు' పరిగణిస్తారు. వారు, శ్రీరాముడు అయోధ్యలో బాబ్రీ మసీదు మధ్య గుమ్మటం ఉన్న స్థలంలోనే పుట్టాడని ఎంత పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధికార పీఠానికి ఎగబాకారో అందరికీ తెలుసు. అలాగే మధురలో శ్రీకృష్ణుడు జన్మించాడనే వాదనకు ఇటీవల కాలంలో వారు ఊపు తెస్తున్నారు. స్వామి వివేకానంద ఈ వాదనను అంగీకరించరు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు చారిత్రక వ్యక్తులు కారంటూ ఆయన ఇలా చెప్పారు "రామాయణాన్ని తీసుకోండి. శీల ప్రతిపాదక గ్రంథంగా అది మనకు పరమ ప్రమాణం. అలాంటి నీతి బోధకు రాముడనే వ్యక్తి ఒకరు నిజంగా ఉండాల్సిన అవసరం లేదు. రామాయణ భారతాల్లోని ధర్మోదాత్తత, రాముడు గానీ, కృష్ణుడు గానీ చారిత్రక వ్యక్తులు కానంత మాత్రాన ఎంత మాత్రం చెడదు".(పై పుస్తకం, సంపుటి మూడు, పేజీ 356).

"హిందువులు అవతార పురుషుడిగా పూజించే శ్రీకృష్ణుడు నిజానికి పౌరాణిక వ్యక్తి. అతడి జీవితాన్ని గురించి మనకు తెలియవస్తున్న సంఘటనల్లో అధిక భాగం అతడి అనుయాయులు రాసిందే" (పై పుస్తకం సంపుటి ఏడు, పేజీ 380).

హిందుత్వవాదులు "మనమంతా హిందువులం, మనమంతా బంధువులం" అంటూనే, హిందువులలోని వర్ణాంతర వివాహాలను నిరసిస్తారు. ఈ దేశంలో గత 100 సంవత్సరాలుగా జరిగిన వర్ణాంతర వివాహాల వధూవరులలో అనేక డజన్ల మంది పరువు హత్యల పేరుతో చంపబడ్డారు. కానీ పరువు పేరుతో జరిగే ఈ హత్యలలో ఏ ఒక్క హత్యనూ హిందూత్వవాదులు ఖండించలేదు. కానీ స్వామి వివేకానంద వర్ణాంతర వివాహాలను సమర్ధించారు. అవి జరగనందు వల్లనే జాతి దుర్బలమైపోతున్నదని ఆయన ఆవేదన చెందారు. ఈ విషయమై ఆయన ఏమన్నారంటే "అనేక విధాలైన సంస్కరణలు మనకు ఉండాలి. అవసరం లేదని చెప్పేటంత బుద్ధిహీనులెవరు? ఉదాహరణకు వర్ణాంతర వివాహం తీసుకోండి. అది లేకపోవడం వల్లనే జాతి నానాటికీ భౌతికంగా దుర్బలమైపోతు న్నది" అన్నారు (పై పుస్తకం, సంపుటి 8, పేజీ 279).

స్వామీజీ వాదనను సమర్థిస్తూ ఏ ఒక్క హిందువు నాయకుడైనా బహిరంగ ప్రకటననీయగలడా? ఇటీవలి కాలంలో హిందుత్వ కార్యకర్తలు మాంసాహారానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు. మాంసాహారంపై తమ నిరసన గళాన్ని క్రమంగా పెంచుతున్నారు. ప్రస్తుతానికి కొన్ని ప్రత్యేక ప్రదేశాల్లో, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, మాంస విక్రయాలను నిషేధిస్తున్నారు. కానీ వివేకానంద మాంసాహార ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు. ఆయన ఏమన్నారంటే "శరీరకష్టం చేసి బత్తెం సంపాదించుకోని పైతరగతి వారు పది మంది ఉన్నారే, వారు మాంసాన్ని తినకుందురు గాక. రాత్రింబవళ్లు శరీర కష్టం చేసి ఆహారం సంపాదించుకోవలసిన వారికి శాకాహారాన్ని నిర్బంధంగా విధించడం మన దేశం బానిస దేశం అవ్వడానికి ఉన్న కారణాల్లో ఒకటి (పై పుస్తకం, సంపుటి ఏడు, పేజీ 245).

జ్యోతిష్యానికి సంబంధించి అది శాస్త్రమే కాదంటూ స్వామీజీ ఒక సుదీర్ఘ ప్రసంగమే చేశారు (పై పుస్తకం, సంపుటి రెండు, పేజీలు 105 నుండి 108 వరకు). జ్యోతిష్యమే కాదు, దానికి అనుబంధమైన కర్మకాండలను, వాటిని ఆచరించమని ఆదేశించే పురోహితులను ఆయన తీవ్రంగా నిరసించారు.

వివిధ సందర్భాల్లో ఆయన ఏమన్నారంటే "పురోహిత వర్గం భారతదేశానికి అరిష్టమైంది" అన్నారు. (పై పుస్తకం సంపుటి ఆరు పేజీ 381). అంతేకాదు "భారతదేశంలో సర్వానర్థాలకు మూల కారణం పేదల దుస్థితి. పురోహితాధికారం, విదేశాక్రమణం శతాబ్దాలుగా వారిని అణగదొక్కి ఉంచింది" అని అన్నారు (పై పుస్తకం, సంపుటి ఏడు, పేజీ 260).

హిందుత్వవాదులు సాటి మానవుడిని అంటరానివాడుగా చూసే దుర్మార్గవ్యవస్థకు వ్యతిరేకంగా పల్లెత్తు మాట మాట్లాడరు. కానీ గోరక్షణ కోసం చట్టాలు చేస్తారు. గోమూత్రం తాగటాన్నీ, గోమలం తింటాన్నీ సమర్థిస్తారు. హిందుత్వవాదులు పాలించే రాష్ట్రాలలో పసిపిల్లలకు మధ్యాహ్న భోజనంలో చపాతీలకు అనుపాకంగా ఉప్పు మాత్రమే వడ్డిస్తారు. ఆ పాలకులే గోవులకు స్వీట్లతో ఆహారం అందిస్తారు. ఈ అమానుష చర్యలను స్వామి వివేకానంద ఆనాడే ఖండించారు. గోరక్షక కార్యకర్తలతో మాట్లాడుతూ సాటి మానవులు ఆహారం లేక అల్లాడుతుంటే తాను అది వారి కర్మ ఫలితం అని ఊరుకోలేనని, తన వద్ద పైకం ఉంటే ముందు పేదల ఆకలి తీర్చడానికి వినియోగిస్తాననీ, ఆ తరువాత మాత్రమే గోరక్షణ విషయం ఆలోచిస్తానని చెప్పారు. (పై పుస్తకం, సంపుటి 8, పేజీలు ఐదు నుండి ఏడు వరకు).

సన్యాస జీవితాన్ని గూర్చి వివేకానంద ఏమన్నారు? "సన్యాస జీవితాన్ని స్వీకరించినప్పుడు జాతి, కుల, గోత్రాదులకు అతీతంగా ఉన్నానా ? లేదా ? అని ప్రతివారు ప్రశ్నించుకోవాలి" అన్నారు. (పై పుస్తకం, సంపుటి 8 ,పేజీ 226). ఈ రోజున ఏ హిందూత్వ సన్యాసి అయినా స్వామీజీ ఆశించినట్లు జాతి, కుల, గోత్రాదులకు అతీతంగా ఉంటున్నారా?

మరో ముఖ్య విషయం. స్వామీజీ తాను సామ్యవాదినని ప్రకటించుకున్నారు. "నేను సామ్యవాదిని. సామ్యవాదంలో లోపాలు లేవని కాదు. అసలు రొట్టె లేకుండా ఉండటం కంటే సగం రొట్టె అయినా మేలే కదా? అందుచేత నేను సామ్యవాదిని" అన్నారు. (పై పుస్తకం, సంపుటి పది, పేజీ 84). అంతేకాదు. దానికి కారణం కూడా చెప్పారు.

"కొందరికే సదా సుఖాలు కలగడం, మరికొందరికి సదా దుఃఖాలు కలగటంకంటే ఇతరులను కూడా వాటిలో భాగస్వాములుగా చేయడం మంచిది కదా ?" అన్నారు. (పై పుస్తకం, సంపుటి పది, పేజీ 84).

హిందూత్వ వాదులలో ఒక్కరైనా ఈ విషయంలో స్వామీజీని సమర్థించారా? సమర్థించగలరా? పుణ్యక్షేత్రాలకు పోవడం, మహా కుంభమేళాలకు పోయి తీర్థాలలో మునగటం, వీటి వలన ప్రజల పాపాలు పోతాయనే ప్రచారాన్ని హిందుత్వవాదులు చేస్తున్నారు. వాటి ఏర్పాట్ల కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు కానీ వివేకానంద ఆ భావనను తీవ్రంగా వ్యతిరేకించారు. "ఈ కలియుగంలో జనులు తాము ఏమి చేసినా సరే ఒక పుణ్యక్షేత్రానికి పోయినంతమాత్రాన తమ పాపాలన్నీ క్షమించబడతాయని నమ్మేంత అధోగతిలో పడిపోయారు" అని తమ ఆవేదనను వెలిబుచ్చారు(పై పుస్తకం, సంపుటి ఆరు, పేజీ 36). ఇలా స్వామి వివేకానంద అనేక విషయాలలో ఆనాడే హిందుత్వవాదుల భావనలను తీవ్రంగా వ్యతిరేకించారు. అందువల్ల దేశభక్తులైన ప్రజలు ద్వేషపూరితమైన హిందుత్వ భావనలను వదిలి, ప్రేమ పూర్వకమైన వివేకానందుని భావనలను అనుసరిస్తారని ఆశిద్దాం. ❑

# కార్పొరేట్‌లకు అచ్చే దిన్

**(21వ పేజీ తరువాయి)** కోలుకోలేకపోయాయి.

**రాజకీయ పార్టీల ఆర్థిక బలం**

ఈ కాలంలో BJP ఆస్తులు గణనీయంగా పెరిగాయి. దేశంలో అత్యంత ధనిక రాజకీయ పార్టీగా BJP ఎదిగింది. ఎన్నికల బాండ్ల వ్యవస్థ ద్వారా రాజకీయ పార్టీలకు భారీ విరాళాలు చేరాయి. ఎన్నికల బాండ్ల వివరాలు వెలుగులోకి వచ్చిన తర్వాత పెద్ద కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వ అనుకూల విధానాలు, రాజకీయ నిధుల మధ్య సంబంధాలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రజాస్వామ్యంలో పార్టీలు నిధులు సమీకరించడం సహజమే. కానీ ఆ నిధుల మూలాలు, విధాన నిర్ణయాలపై వాటి ప్రభావం గురించి ప్రశ్నలు అడగడం కూడా ప్రజాస్వామ్య బాధ్యతే.

**అచ్చే దిన్ - ప్రజల అనుభవం ఏమంటోంది ?**

దేశంలో ఎక్స్‌ప్రెస్ వేలు పెరిగాయి. విమానాశ్రయాలు పెరిగాయి. డిజిటల్ చెల్లింపులు విస్తరించాయి. పెద్ద ప్రాజెక్టులు నిర్మించబడ్డాయి అని చెప్తున్న పాలకులు నిరుద్యోగం పెరిగిందని చెప్పాలి కదా. ధరల పెరుగుదల మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బంది పెడుతోంది. రైతుల ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వేగవంతమైంది. కార్మిక చట్టాల్లో మార్పులు కార్మిక సంఘాల ఆందోళనలకు కారణమయ్యాయి. అందువల్ల అభివృద్ధి గణాంకాలు ఒక కథ చెబితే, ప్రజల దైనందిన జీవితం మరో కథ చెబుతోంది. ఒక దేశ అభివృద్ధిని కేవలం బిలియనీర్ల సంపదతో కొలవలేం. అలాగే కేవలం GDP వృద్ధితో కూడా కొలవలేం. సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు, విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత, ఆదాయ పంపిణీ వంటి అంశాలే అసలు కొలమానాలు. ఈ నేపథ్యంలో గత దశాబ్దం పైగా వినిపిస్తున్న సహజమైన ప్రశ్న దేశ సంపద పెరిగిందా? లేక సంపద కేవలం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమైందా ? ఈ ప్రశ్నకు సమాధానం కోసం గణాంకాలను మాత్రమే కాకుండా, గ్రామాల్లో రైతు పరిస్థితిని, పట్టణాల్లో ఉద్యోగం కోసం తిరుగుతున్న యువకుడిని, పెరుగు తున్న జీవన వ్యయాలతో సతమతమవుతున్న మధ్యతరగతి కుటుంబాన్ని కూడా చూడాల్సి ఉంటుంది. అప్పుడే "అచ్చే దిన్" అనే నినాదం నిజంగా ఎవరికొచ్చిందో అర్థమవుతుంది. ❑

# మన దేశంలో ఎలాంటి పౌరులను తయారు చేస్తున్నాం?

- అశిష్ సింగ్

గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశ విద్యారంగం గణనీయంగా విస్తరించింది. ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఎక్కువ మంది పిల్లలు పాఠశాలలకు వెళ్తున్నారు. ఎక్కువ మంది విద్యార్థులు కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశిస్తున్నారు. ఎక్కువ సంఖ్యలో డిగ్రీలు ప్రదానం చేయబడుతున్నాయి. అయితే ఈ పరిమాణాత్మక విస్తరణ మధ్య ఇబ్బందిని కలిగించే ఒక ప్రశ్నకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. మన విద్యా వ్యవస్థ వాస్తవానికి ఎలాంటి పౌరులను తయారు చేస్తోంది? విద్య గురించి జరిగే చర్చలు ఎక్కువగా మార్కులు, ర్యాంకులు, ప్రవేశాలు, ఉద్యోగ నియామకాలు, జీతాల చుట్టూ తిరుగుతుం టాయి. విజయాన్ని పరీక్షా ఫలితాలు, ఉద్యోగ అవకాశాల ద్వారా కొలుస్తుంటారు. ఇవి ముఖ్యమైన సూచికలే అయినప్పటికీ, విద్య సాధించవలసిన లక్ష్యాలలో ఇవి కేవలం ఒక చిన్న భాగాన్నే తెలియజేస్తాయి. విద్యను కేవలం అర్హతా పత్రాల కోసం జరిగే పోటీగా పరిమితం చేసే సమాజం, దాని లోతైన సామాజిక, పౌర సంబంధిత లక్ష్యాలను విస్మరించే ప్రమాదంలో పడుతుంది.

భారతదేశం వంటి దేశానికి ఈ సవాలు మరింత ప్రాసంగిక మైనది. ఆర్థికాభివృద్ధి, సాంకేతిక ఆవిష్కరణలు, మౌలిక వస తుల అభివృద్ధి జాతీయ పురోగతికి అత్యవసరమైనవే. అయితే ఇవి మాత్రమే ఒక అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించలేవు. ఒక దేశం చివరికి తన పౌరుల ఆలోచనా నాణ్యత, విలువలు, ప్రవర్తనల ద్వారా రూపుదిద్దుకుంటుంది. పెట్టుబడులతో రహదా రులను, పరిశ్రమలను, సంస్థలను నిర్మించవచ్చు. కానీ సామా జిక అవగాహన, ప్రజాస్వామ్య సంస్కృతి, బాధ్యతాయుత పౌరస త్వం వంటి వాటిని సాధించడానికి నిజమైన అర్థంలో విద్య అవసరం. నేడు అత్యంత ఆందోళన కలిగించే ధోరణుల్లో ఒకటి విద్యను పూర్తిగా ఉద్యోగ యోగ్యత అనే కోణంలో మాత్రమే చూడడం. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆర్థిక భద్రత ఉండాలని కోరుకోవడం సహజమే. విద్యార్థులు స్థిరమైన ఉద్యోగాలు, మెరుగైన అవకాశాలను ఆశించడం కూడా సహజమే. విద్యా సంస్థలు తమ ప్లేస్‌మెంట్ రికార్డులు, ప్రొఫెషనల్ ఫలితాలను ప్రదర్శిస్తూ తమను తాము ప్రచారం చేసుకుంటున్నాయి. అయితే సంపాదనే విద్య యొక్క ఏకైక లక్ష్యంగా మారినప్పుడు, విద్య అనేది పరివర్తనకు తోడ్పడే ప్రక్రియగా కాకుండా డబ్బు సంపా దన లావాదేవీల ప్రక్రియగా మారిపోయే ప్రమాదం ఉంది.

ఇలాంటి దృక్పథం వల్ల కలిగే పరిణామాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. అనేకమంది విద్యార్థులు సంవత్సరాల తరబడి పరీక్షలకు సిద్ధమవుతారు. నైతికత విలువలు, పౌర బాధ్యత, సామాజిక స్పృహ లేదా విమర్శనాత్మక వైఖరి వంటి అంశాలపై ఆలోచించే అవకాశాలు వారికి పరిమితంగానే లభిస్తున్నాయి. వారు సమాచారాన్ని పునశ్చరణ చేయడం నేర్చుకుంటారు గానీ, దానిని విశ్లేషించడం అంతగా నేర్చుకోరు. వారు ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం నేర్చుకుంటారు; కానీ సమాధానాలను ప్రశ్నించడం మాత్రం ఎల్లప్పుడూ నేర్చుకోరు.

ఇది ఎందుకు ముఖ్యమంటే, ఆధునిక సమాజాలు ఎదుర్కొంటున్న సవాళ్లను కేవలం సాంకేతిక నైపుణ్యాల ద్వారా పరిష్కరించడం సాధ్యం కాదు. విభజన ధోరణులు, తప్పుడు సమాచారవ్యాప్తి, సామాజిక ఘర్షణలు, పర్యావరణ సంక్షోభాలు, వేగవంతమైన సాంకేతిక మార్పులు వంటి సమస్యలకు విమర్శ నాత్మకంగా ఆలోచించడం, ఆధారాలను పరిశీలించడం, భిన్నాభి ప్రాయాలను సహించడం, సంక్లిష్ట సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించడం చేయగల పౌరులు అవసరం. ఈ సామర్థ్యాలు లేకపోతే, అత్యంత విద్యావంతమైన సమాజాలు కూడా సరైన సమిష్టి నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనవచ్చు.

భారతదేశం వంటి వైవిధ్యభరిత దేశానికి ఈ లక్షణాల ప్రాము ఖ్యత మరింత ఎక్కువ. భారత రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే న్యాయాన్ని అందించే విలువలపై ఆధారప డిన సమాజాన్ని ఊహించింది. ఈ ఆదర్శాలు కేవలం చట్టపర మైన నిబంధనల ద్వారా సాధించబడవు. అవి విద్య, సామాజికీ కరణ ద్వారా ప్రజల మనస్సుల్లో అంతర్గతంగా స్థిరపడాలి. యువత వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడం, భిన్నత్వాన్ని గౌరవించ డం, శత్రుత్వం లేదా పక్షపాతం లేకుండా ఇతరులతో మెలగడం నేర్చుకోవాలి. సహనం, ఆమోదభావం, ఓర్పు, సహానుభూతి వంటి విలువలను చాలామంది 'సాఫ్ట్ వాల్యూస్'గా కొట్టిపారే స్తారు. కానీ ఇవే ప్రజాస్వామ్యానికి అత్యవసరమైన సామర్థ్యాలు. వినడం, చర్చించడం, శాంతియుత సహజీవనం చేయడం వంటి సామర్థ్యాలను కోల్పోయిన సమాజం చివరికి తన సామాజిక పునాదులను తానే బలహీనపరుచుకుంటుంది. అందువల్ల విద్య విద్యార్థులకు కేవలం పోటీ పడడం మాత్రమే కాకుండా, సహకరించడం కూడా నేర్పాలి. వ్యక్తిగతంగా ఎలా విజయవం తం కావాలో మాత్రమే కాకుండా, సమాజంలో సమిష్టిగా ఎలా

కలిసి జీవించాలో కూడా నేర్పాలి. అదే స్థాయిలో ముఖ్యమైనది నిశిత ఆలోచనా శక్తిని పెంపొందించడం. సమాచారం సమృద్ధిగా ఉండి, దానిపై దృష్టి కేంద్రీకరించే సమయంలేని ఈ యుగంలో, వాస్తవం (fact) ఏమిటో, అభిప్రాయం(opinion) ఏమిటో, వాటి మధ్య తేడాను గుర్తించే సామర్థ్యం ఒక పౌర అవసరంగా మారింది. పౌరులు నిరంతరం పరస్పర విరుద్ధ కథనాలు, సంచలనాత్మక వాదనలు, తారుమారు చేయబడిన సమాచారం, భావజాలాల ప్రేరేపనల మధ్య జీవిస్తున్నారు. ఆధారాలను విశ్లేషించడం, పక్షపాత వైఖరులను గుర్తించడం, హేతుబద్ధమైన నిర్ణయాలకు రావడం ఇప్పుడు కేవలం విద్యా నైపుణ్యం మాత్రమే కాదు; బాధ్యతాయుత పౌరసత్వానికి అవసరమైన మౌలిక అర్హత. దేశవ్యాప్తంగా ప్రొఫెషనల్ విద్య వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఈ ఆందోళన మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఉపాధ్యాయ విద్య, మేనేజ్మెంట్ స్టడీస్, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రం, ఫార్మసీ, నర్సింగ్, జర్నలిజం, కంప్యూటర్ అప్లికేషన్లు వంటి అనేక కోర్సుల్లో విద్యార్థులు చేరుతున్నారు. ఈ కోర్సులు సాధారణంగా ఉద్యోగావకాశాలు, సామాజిక పురోగతికి మార్గాలుగా ప్రచారం చేయబడుతున్నాయి. అయితే పాఠ్యాంశాల ప్రాసంగికత, అధ్యాపకుల లభ్యత, ఉత్తమ శిక్షణ, దీర్ఘకాలిక ఉద్యోగ యోగ్యత వంటి ప్రశ్నలు అనేవి ప్రవేశాల సంఖ్యలు, ప్లేస్మెంట్ వాగ్దానాలకంటే చాలా తక్కువ చర్చకు వస్తున్నాయి. ఒక ప్రొఫెషనల్ డిగ్రీ మాత్రమే వృత్తిపరమైన నైపుణ్యానికి హామీ ఇవ్వదు. విద్యాసంస్థలు పెరగవచ్చు, కొత్త కోర్సులు ప్రారంభమవచ్చు, ప్రవేశాలు అధికమవచ్చు. కానీ అభ్యాస నాణ్యతను నిర్ణయించే కొలమానాలు చాలా క్లిష్టమైన ఇతర అంశాలతో ముడిపడి ఉంటాయి. పాఠ్యాంశాలు సమకాలీన అవసరాలకు అనుగుణంగా ఉన్నాయా? విద్యార్థులకు సమస్యలను పరిష్కరించడం నేర్పుతున్నారా? లేక కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం మాత్రమే నేర్పుతున్నారా? అర్థవంతమైన బోధన అందించడానికి తగిన అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు సంస్థల్లో ఉన్నారా? ఈ ప్రశ్నలు పరిశీలనకు ఎంతో అర్హమైనవి.

ఇక్కడ నిజమైన విద్యకు మరియు 'సర్టిఫికెట్ సంస్కృతి' (Credentialism) మధ్య తేడాను గుర్తించాలి. సర్టిఫికెట్ సంస్కృతి అనేది ధ్రువపత్రాలు, డిగ్రీలు సంపాదించడంపై దృష్టి పెడుతుంది. నిజమైన విద్య అనేది జ్ఞానం, వివేచన, సామర్థ్యం, మేధోపరిపక్వతను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడుతుంది. ఈ రెండూ చాలాసార్లు ఒకదానితో ఒకటి కలిసిపోతాయి; అయినప్పటికీ అవి రెండూ ఒకటి కావు. ఒక సమాజం ఎక్కువ సంఖ్యలో పట్టభద్రులను తయారు చేస్తూనే నైపుణ్య లోపాలతో, నిశిత ఆలోచన కొరవడిన లోపంతో, పరిమిత ఆవిష్కరణలతో వెనుకంజ వేయవచ్చు. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుల పాత్ర కేంద్రీయమైనది. అయితే బాధ్యతను కేవలం పాఠశాలలకే అప్పగించలేము. పిల్లలు పాఠశాలకు వెళ్లకముందే తల్లిదండ్రులు, సంరక్షకులు వారి దృక్పథాలను మలుస్తారు. భిన్నాభిప్రాయాలకు, వైవిధ్యానికి, అధికారానికి, ఆధారాలకు పెద్దలు ఎలా స్పందిస్తున్నారో పిల్లలు గమనిస్తారు. పిల్లలలో ఆసక్తిని నిరుత్సాహపరిస్తే, ప్రశ్నించడం అవిధేయతగా భావిస్తే, పక్షపాతాన్ని సహజంగా అంగీకరిస్తే, తరగతి గదులు మాత్రమే ఆ ప్రభావాలను సరిచేయలేవు. అందువల్ల విద్యలో విజయాలను అర్థం చేసుకునే విధానాన్ని విస్తరించాల్సిన అవసరం ఉంది. విద్య యొక్క నిజమైన విజయం కేవలం ఎంతమంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు లేదా ఉద్యోగాలు పొందారు అనే దానికే పరిమితం కాకూడదు. విద్యార్థులు మేధో స్వాతంత్ర్యం, నైతిక విచక్షణ, సామాజిక అవగాహన, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవాన్ని అభివృద్ధి చేసుకున్నారా అనే అంశాలు కూడా అందులో ఉండాలి. ఈ ఫలితాలను కొలవడం కష్టమే అయినప్పటికీ, సమాజం యొక్క దీర్ఘకాలిక ఆరోగ్యానికి ఇవే మరింత ముఖ్యమైనవి కావచ్చు.

అందువల్ల ఈ సవాలు కేవలం తాత్వికమైనది మాత్రమే కాదు. ఇది విద్యా విధానం, సంస్థాగత ఆచరణలపై ప్రత్యక్ష ప్రభావం చూపే ఆచరణాత్మక అంశం కూడా. పాఠ్యాంశాలు కంఠస్థ విద్యపై అధిక ఆధారపడకుండా విశ్లేషణాత్మక రచన, శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాలు, చర్చా సంస్కృతి, సమస్య పరిష్కార సామర్థ్యాలపై మరింత దృష్టి పెట్టాలి. విద్యాసంస్థలు అధ్యాపకుల సామర్థ్యాల అభివృద్ధికి దృష్టి పెట్టాలి; మౌనంగా అంగీకరించడానికి బదులుగా ప్రశ్నించే వాతావరణాన్ని సృష్టించాలి. తల్లిదండ్రులు, సంరక్షకులు విద్యా కోర్సుల ఎంపికలను కేవలం జీతాలు, ప్లేస్మెంట్ల ఆధారంగా కాకుండా, అభ్యాస నాణ్యత మరియు వ్యక్తిత్వ వికాసం ఆధారంగా అంచనా వేయాలి. కాబట్టి అసలు ప్రశ్న ఏమిటంటే, విద్య యువతకు జీవనోపాధి సంపాదించడంలో సహాయపడగలదా లేదా అనేది కాదు. ఖచ్చితంగా సహాయపడాలి. నిజమైన ప్రశ్న ఏమిటంటే– విద్య స్వతంత్రంగా ఆలోచించగల, భిన్నాభిప్రాయాలను గౌరవంగా స్వీకరించగల, తప్పుడు సమాచారాన్ని సవాలు చేయగల, ప్రజాస్వామ్య సమాజంలో బాధ్యతాయుతంగా వ్యవహరించగల వ్యక్తులను తయారు చేస్తున్నదా? భారతదేశం 'వికసిత భారత్' వైపు చేసే ప్రయాణం కేవలం ఆర్థిక వృద్ధి రేట్లు, సాంకేతిక విజయాలు, ప్రతి సంవత్సరం ప్రదానం చేసే డిగ్రీల సంఖ్యల ద్వారా మాత్రమే నిర్ణయించబడదు. విమర్శనాత్మక ఆలోచనా శక్తి, రాజ్యాంగ విలువలు, మేధో ధైర్యం, సమిష్టి ప్రయోజనాల పట్ల నిబద్ధత కలిగిన పౌరులను దేశం రూపొందిస్తుందా లేదా అనే దానిపైన కూడా అది సమానంగా ఆధారపడి ఉంటుంది. అభివృద్ధి చెందిన భారతదేశానికి కేవలం విద్యావంతులే కాదు; ఆలోచనాశీలురైన పౌరులు కూడా అవసరం. ❑

# మతమౌఢ్యం వదులుకున్న వాడే స్వేచ్ఛా మానవుడు..



- దేవరాజు మహారాజు

మనిషి తనను తాను మనిషిగా భావించుకున్నప్పుడు, ఎదుటి వారిని మనుషులుగా గుర్తించినపుడు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆనందం లభిస్తుంది. మొత్తానికి మొత్తంగా భద్రతా భావం ఇనుమడిస్తుంది అని అంటారు తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి. కప్పు ఖాళీగా ఉంటేనే మీరందులో కాఫీ, టీ, పళ్ళరసం వగైరా ఏదైనా పోసుకోవచ్చు. ముందే నీళ్ళతో నిండి ఉన్న కప్పులో మరేమీ పోయలేరు. పోయాలనుకుంటే ముందు ఆ కప్పును ఖాళీ చెయ్యాలి. మనిషి మెదడు కూడా అలాంటిదే.

పసితనంలో ఎవరి మెదడైనా ఖాళీ కప్పు లాంటిదే. అందులో ఏ మత విశ్వాసాలూ ఉండవు. తాతయ్యలు, నానమ్మలు, తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు మెల్లమెల్లగా ఆ పసివాడికి దైవ భావనను పరిచయం చేస్తారు. సంప్రదాయాలు, సంస్కృతి తాతలు వారసత్వంగా నేర్చుకున్న వందల యేళ్ళ నాటి విషయాలు, ఈ కాలపు ఈ పసివాడికి నూరిపోస్తారు. అంటే ఏమిటీ? కొంచెం కొంచెం వాడి మెదడు కప్పు నింపేస్తున్నారన్న మాట! ఆ రకంగా యుక్త వయసు వచ్చే సరికి వాడికో దేవుడు, వాడికో మతం, వాడికో సంప్రదాయం ఏర్పడి, వాడో చట్రంలో బిగుసుకుని ఉండిపోతున్నాడు.

తన చుట్టూ ఉన్న సమాజం గురించి, తన దేశం గురించి, ప్రపంచం గురించి, విశ్వ విజ్ఞానం గురించి ఏమీ తెలుసుకోవడం లేదా? అంటే, భేషుగ్గా తెలుసుకుంటున్నాడు. కానీ, వాటిని తన మెదడులో, మనసులో బలంగా నిలుపుకోలేకపోతున్నాడు. కారణం వాడి మెదడు కప్పులో ఖాళీ లేకపోవడమే! కప్పు ఖాళీగా ఉంటేనే ఇతరులకు ఉపయోగపడేది. ఇతరులకు ఉపయోగపడదామన్న తపన ఉంటేనే మీ కప్పు ఖాళీ చేసుకుని మీరు సిద్ధంగా ఉంటారు. మానవ హృదయంతో, మానవత్వం గురించి ఆలోచిస్తూ, మనిషి మనిషి కోసం బతికినపుడే అతను మానవుడవుతాడు.

## మూస ఆలోచనల నుంచి విముక్తి..

తమలో గడ్డకట్టుకుని ఉన్న దైవ భావనకు బయటి ప్రపంచంలోని భౌతిక ప్రపంచానికి – విశ్వ విజ్ఞానానికీ మధ్య జనం మెదళ్ళలో హోరాహోరీగా యుద్ధం జరుగుతూ ఉంటుంది. ఎటూ తేల్చుకోలేని వారు అయోమయంలో పడి కొట్టుకుంటూ ఉంటారు. కొందరు మాత్రం నిర్మోహమాటంగా తమ మెదడు కప్పు ఖాళీ చేసుకుంటారు. అందులో తమ దృక్పథాలకు అనుగుణంగా, తాము కావాలనుకున్న వైజ్ఞానిక స్పృహను నింపుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు పోగలుగుతుంటారు. భయస్థులు, చంచల మనస్కులు, కళ్ల ముందున్న వాస్తవాన్ని చూడలేని గుడ్డి వాళ్లు మాత్రం దేవుడిలో తమ ఆత్మల గురించి, పరలోకాల గురించి, పునర్జన్మల గురించి భయపడుతూ బతుకీడుస్తుంటారు. నమ్మకాలు, దేవుళ్లు, సంస్కృతి, సంప్రదాయాలు, అంధ విశ్వాసాలతో వున్న ఏ మనసైనా అయోమయంతో బరువెక్కిపోతుంది. అది వారి తాతల మనసుకు నకలు కాపీ (ట్రూ కాపి). ఒరిజినల్ కాదు. ఎవరి మనసైనా ఒరిజినల్ కాపీలా ఉండాలంటే దానికి వివేకం, వివేచన అవసరమౌతాయి. హేతుబద్ధంగా పరిశీలించుకోవడం, నిజాల నిగ్గు తేల్చుకోవడం అవసరమౌతోంది. అప్పుడే ఆ మనసులో సృజనాత్మకత, నవ్యత వంటివి ప్రవేశించగలుగుతాయి. వాటితో ఆ మనసున్న వ్యక్తికి అప్రయత్నంగానే ప్రత్యేక వ్యక్తిత్వం రూపొందుతుంది. మనిషి తనను తాను మనిషిగా భావించుకున్నప్పుడు, ఎదుటి వారిని మనుషులుగా గుర్తించినపుడు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆనందం లభిస్తుంది. మొత్తానికి మొత్తంగా భద్రతా భావం ఇనుమడిస్తుంది అని అంటారు తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి.

## తెరిచిన మనసు - విశాల దృక్పథం..

అలాగే మరొక విషయం కూడా ఆలోచించాలి. మనం ఎవరి ఇంటికైనా వెళ్ళాలనుకుంటే, వారి ఇంటి గేటు తెరచి ఉంటేనే వెళ్ళగలం. గేటుకు తాళం వేసి ఉంటే మనం వెళ్ళలేము. ఈ ప్రపంచంలో చాలా మంది తమ తమ ఇళ్ళకు ఏదో ఒక మతానికి సంబంధించిన పెద్ద తాళం కప్పు బిగించుకుని ఉంటున్నారు. అంటే తమ మెదడుకు మతం అనే తాళం వేసుకుంటున్నారు. ఇక ఇతరులు రావడానికి వీలేది? వచ్చేవారు ఇతర మతాలవారు కావొచ్చు, ఇతర ఆలోచనా ధోరణి గలవారు కావొచ్చు. ఇతర కులాల వారు, ఇతర వర్గాల వారు ఎవరైనా కావొచ్చు. మీకు మీరు మరొకదానికి 'ఫిక్స్' అయి ఉన్నప్పుడు వేరే వాటిని ఎలా ఆహ్వానించగలరు ? విశాల హృదయం గురించి, విశ్వ మానవుడి గురించి, విశ్వవిజ్ఞానం గురించి మీరెలా తెలుసుకోగలరు ? ముందు మీరు మీ గేట్లు తెరచి ఉంచాలి. అంటే మీ మనసు–మెదడూ తెరచి ఉంచాలి. మనసు మెదడు వేరు వేరు కావు. రెండూ ఒకటే– అందులోని చెత్తనంతా బయటికి పంపిస్తే గానీ, మీ మనసులో కొత్తగాలి వీచదు. కొత్త

వెలుతురు సోకదు. ఇంటితో పోల్చి చూస్తే తలుపులు చిన్నవి. తలుపులతో పోల్చి చూస్తే వాటికి వేసే తాళం చిన్నది. ఇక తాళం చెవి అన్నింటి కన్నా చిన్నది. కానీ అంత చిన్నదయినా, అది మొత్తం ఇంటినే తెరవగలదు కదా? మత మార్గమే మీ ఇల్లనుకుని, సంస్కృతినే తలుపులు బిడాయించుకుని, దానికో సంప్రదాయపు తాళం వేసుకుని లోపల కూర్చుంటే ఏమవుతుందీ? బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా పోతుంది. మీలో మీరే కుంచించుకు పోతారు. దీనికి పరిష్కారముంది. సైన్సు మీ తాళాన్ని తెరిచే తాళం చెవి కాగలదు. సైన్సు తాళం చెవితో మీ సంప్రదాయపు తాళాన్ని ఒక్కసారి తెరవండి. సంస్కృతి పేరుతో బిగుసుకున్న తలుపులు బార్లా తెరుచుకుంటాయి. మత మౌఢ్యపు ఇల్లు తెరుచుకుని, అందులో కాస్త గాలీ, వెలుతురూ ఆడతాయి. ప్రపంచజ్ఞానం అందుబాటులో కొస్తుంది. అప్పుడు మీరూ మనుషుల్లో కలుస్తారు. ఆలోచన చిన్నదైతే మాత్రం ఏమిటీ? అది పెద్ద పెద్ద సమస్యల్ని పరిష్కరించేది కావొచ్చు కదా?

**నమ్మకాలు - వాస్తవాలు**

ఒకడు బైక్ మీద అడవిలోకి చాలా దూరం వెళ్ళాడనుకుందాం. అతనికి రెండు దారులు కనబడ్డాయి. ఒక దారికి దేవుడున్నాడనే బోర్డు కనబడింది. మరో దారికి దేవుడు లేడు అనే బోర్డు ఉంది. ఎవరూ లేని చోటికి ఒంటరిగా వెళ్ళడం దేనికీ అనే భయంతో ఈ దారిలో ఎవరో ఒకరు ఉన్నారు కదా అనే భరోసాతో ఒకరి తర్వాత ఒకరు చాలా మంది దేవుడున్నాడు అనే దారిలో వెళుతున్నారు. కొద్ది మంది మాత్రం 'ఇంత దాకా ఒంటరిగా ధైర్యంగా వచ్చాను కదా? ఇంకా ముందు ఎవరూ లేకపోతేనేం?' అనే ఆత్మవిశ్వాసంతో దేవుడు లేడు అనే దారిలో వెళుతున్నారు. అసలు విషయమేమంటే ఏ దారిలో వెళ్ళినా ఒకటే. కొంత దూరం వెళ్ళాక రెండు దారులు కలిసేవే. 'దేవుడున్నాడు - లేడు' అని చెప్పే ఆ సైన్ బోర్డులు మనుషుల్ని విడగొట్టడానికి తప్పితే కలపడానికి కాదు. మత విశ్వాసాలు, లక్షల సంఖ్యలో దేవుళ్ళు పనికొచ్చేది ఎందుకంటే, మనుషుల్ని నిర్దాక్షిణ్యంగా విడగొట్టడానికి మాత్రమే! నిజం ఎప్పుడూ ఒకటే ఉంటుంది. వాస్తవం ఒకటే ఉంటుంది. ఊహలు, భ్రమలు, ఎన్నయినా, ఎన్ని రకాలుగానైనా ఉండొచ్చు. అందుకే కదా, దేవుళ్ళు ఇన్ని రకాలుగా ఉన్నారు.

**హేతుబద్ధత - నిజమైన మానవత్వం**

మహా మానవతావాది, జాతీయ విప్లవకారుడు, తత్వవేత్త, రాజకీయ సిద్ధాంతకర్త ఎంఎన్ రాయ్(మానవేంద్రనాథ్ రాయ్) "పిల్లి ఆత్మకథ"లో రాసుకున్న విషయం ఆధారం చేసుకుని, అందులోని అంతరార్థాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంది. "ప్రతి మతమూ ప్రజలను మరింత అజ్ఞానానికి గురి చేసే సాధనంగా ఉండిపోయింది. ప్రజలు ఉన్నత వర్గాల పరిపాలనకు లొంగిపోవాలి. ప్రభువుల్ని గుడ్డిగా నోరు మూసుకుని అనుసరించాలి. సిరిసంపదల హెచ్చుతగ్గులను దైవ నిర్ణయాలుగా భావించాలి. వారు పూర్వ జన్మలో చేసిన పాప పరిహారంగా ఈ జీవితాన్ని దుర్భరంగా గడపాలి. మూఢ విశ్వాసాలతో, జ్ఞాన శూన్యులుగా, భావ స్వేచ్ఛ ఎరుగకుండా బతకాలి. మతమే ప్రజల్ని ఇలాంటి దుస్థితికి తెచ్చింది." నీకున్న దానితో నువ్వు గొప్పవాడివి కావు. ఇతరులకు నువ్విచ్చే దానితో అవుతావు. నీ మెదడు కప్పు ఖాళీగా ఉంటేనే కదా, దానితో నువ్వు ఎవరికైనా ఏమైనా ఇవ్వగలవు. విశాల హృదయంతో, తెరచిన మనసుతో ఉన్నప్పుడే సమ్యక్ దృష్టితో పరిశీలించగలవు. అప్పుడే హాయిగా 'స్వేచ్ఛాలోచన' నాలో ఊపిరి పీల్చుకుంటుంది?

**స్వేచ్ఛా- మానసిక బానిసత్వం..**

గేదెను గుంజకు కట్టేసినట్టు, నీ మనసును, బుద్ధిని గుంజలాంటి ఒక మతానికి కట్టేసుకున్నావనుకో. ఇక అంతే - - మనసు ఆ గుంజచుట్టే తిరుగుతూ ఉంటుంది. అక్కడక్కడే ఆ పరిధిలో గింజుకోవాల్సిందే. అరవాల్సిందే! ఒక్కసారి గేదెను గుంజ నుంచి విప్పి చూడండి. అది స్వేచ్ఛగా ఊరి బయటికి, పొలాల్లోకి, అడవుల్లోకి పరిగెత్తుతుంది. చెప్పొచ్చేదేమంటే మనిషి గేదె కాదు. మనిషి మనిషే. మనిషి గేదెను కట్టేస్తున్నాడు. సరే, మరి మనిషి? తనను తానే ఎందుకు కట్టేసుకుంటున్నాడూ? మనిషి గేదెలా బతకకూడదు. మనిషిలాగా బతకాలి. స్వంత ఆలోచనలతో, స్వంత నిర్ణయాలతో, సంయమనంతో, విచక్షణతో ఎదగాలి! మనిషి మెదడుని నియంత్రించే మత మౌఢ్యం, చాదస్తాలు, సంప్రదాయాల బంధనాలొంచి మనిషి స్వేచ్ఛగా బయటికి రావాల్సిన అవసరం ఉంది. ఇది ఎవరికి వారు, అందరూ సీరియస్‌గా ఆలోచించుకోవాల్సిన విషయం. మూఢ విశ్వాసాల నుంచి, మత పరమైన నమ్మకాల నుంచి స్వేచ్ఛ పొందినపుడే మానవ జీవితంలో ఒక కొత్తదనం ప్రారంభమవుతుంది. ప్రతి క్షణాన్ని, ప్రతి కదలికని, ప్రతి సందర్భాన్ని, ప్రతి సంఘటనను గతితార్కికంగా విశ్లేషించుకుంటూ ఉన్నపుడే, కార్య కారణ సంబంధాల్ని అర్థం చేసుకుంటున్నప్పుడే మనిషిలో ఆత్మ విశ్వాసం బలపడుతుంది. ప్రపంచంలోని ఏదో ఒక మతాన్ని అంగీకరించి, ఏదో దేవుణ్ణి ఆరాధిస్తూ, పరలోక సౌఖ్యాల కోసం అంగలారుస్తున్నంత కాలం మనిషి కృశించి మగ్గిపోతూనే ఉంటాడు. వాడికి ఆత్మవిశ్వాసం పెరగదు. నాణ్యమైన విత్తనాలు నాటితేనే ప్రాణమున్న మొక్కలు మొలుస్తాయి. నాణ్యమైన పంట పండుతుంది. ఏదో ఒక మతానికి సంబంధించిన పిచ్చి గింజలు చల్లితే పంటలు ఆ విధంగానే ఉంటాయి మరి. ఇక్కడొక విషయం ఆలోచించాల్సి **(మిగతా 34వ పేజీలో)**

# భారత రైతాంగ సమస్యలకు పరిష్కారం ఎప్పుడు?



- వడ్డే శోభనాద్రీశ్వరరావు

వ్యవసాయ సంక్షోభ నివారణకు, రైతు ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు, రైతులకు ఆదాయ-సామాజిక భద్రత చేకూర్చేందుకు సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి (సి2 ప్లస్ 50 శాతం) చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలు ప్రకటించాలని 2006 లోనే నివేదిక నిచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. రైతాంగ సమస్యల పరిష్కారం చేస్తానని 2021 డిసెంబర్ 9వ తేదీన ఇచ్చిన లిఖితపూర్వక హామీని తుంగలో తొక్కడమేకాక, కనీస మద్దతు ధరల విధానానికి మంగళం పాడుతూ "జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం" (ఎన్.పి.ఎఫ్.ఎ.ఎమ్)ను ప్రకటించి, "పంట ధర ఇన్సూరెన్స్" ముసుగులో ఎం.ఎస్.పిని ఎత్తివేసే ద్రోహానికి ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వం పూనుకొంది. 2000 నుండి 2013 మధ్య కాలంలో ఎం.ఎస్.పి ధరలు తక్కువగా నిర్ణయించబడటం వలన 23 పంటల పైన భారత రైతాంగానికి రూ.45 లక్షల కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని ఒ.ఇ.సి.డి - ఐ.సి.ఆర్.ఐ.ఇ.ఆర్ సంస్థలు పేర్కొన్నాయి. సగటున ఏటా రైతాంగానికి రూ.3 లక్షల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఉదాహరణకు క్వింటాలు వరి ధాన్యానికి రూ.766, మొక్కజొన్నకు రూ.704, జొన్నకు రూ.1,110, కందికి రూ.2,874, మినుముకు రూ.2646, పెసరకు రూ. 2,446, పత్తికి రూ.2365 చొప్పున నష్టపోతున్నారు. అందుకే చట్టబద్ధ ఎం.ఎస్.పి ధరలను ప్రకటించాలని పట్టుబడుతున్నాం.

### ప్రైవేట్ వారికోసమే విద్యుత్ సవరణ చట్టం

వ్యవసాయానికి ఉచిత/తక్కువ టారిఫ్‌తో విద్యుత్, బలహీన వర్గాల పేదలకు రాయితీ విద్యుత్‌లను తొలగించి, మొత్తం ఖర్చులన్నిటితో లెక్కించిన టారిఫ్‌ను, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి, నెలలో ముందుగానే సెల్‌ఫోన్ల తరహాలో బిల్లులు వసూలు చేయాలనే దుష్ట విధానాన్ని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తెచ్చింది. అంతేకాక పలు దశాబ్దాల కాలంలో ప్రజల నుండి పన్నుల ధనం,బ్యాంకుల నుండి/పి.ఎఫ్.సి నుండి రుణాలతో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, విద్యుదుత్పత్తి సంస్థలు, డిస్కమ్‌లతో సహా కారు చౌకగా (బుక్ వాల్యూకు) ప్రైవేట్ వారికి కట్టబెట్టే ఈ దుష్టచట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.

### విత్తన చట్టం రైతాంగ వ్యతిరేకం

విత్తన చట్టం 1966 లోని లోపాలను సరిచేయడానికి బదులు,



విదేశీ విత్తన కంపెనీల ప్రయోజనాలను మెరుగు పరిచేందుకు తీసుకువచ్చిన ఈ చట్టంలో నాణ్యత లేని నకిలీ విత్తనాల వల్ల రైతులకు చేకూరిన నష్టానికి పరిహారం గురించి లేకపోవడం అత్యంత ఆశ్చర్యకరం. బహుళజాతి, విదేశీ విత్తన కంపెనీల తెరచాటు సూచనలతో రూపొందించబడిన ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నాం.

### ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అమలు చేయాలి

గ్రామీణ నిరుపేదలకు ఉపాధిని,ఆదాయాన్ని సమకూరుస్తూ, ఆహార భద్రతను పెంపొందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో గాంధీజీ పేరు తొలగించడమేకాక, రాజ్యాంగంలోని ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా, రాష్ట్రాల హక్కులను హరిస్తూ, రాష్ట్రాలను సంప్రదించకుండానే 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం ద్వారా దేశంలోని కోట్లాదిమంది నిరుపేదలకు ఎన్.డి.ఎ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నది. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి చట్టాన్ని అటకెక్కించడమే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశంగా కనబడుతోంది. అందువలననే వి.బి.గ్రామ్‌జీ పథకాన్ని ఉపసంహరించి.. మరికొన్ని మార్పులతో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

### పంట భూములను లాక్కోవడం ఆపాలి

షెడ్యూల్ తెగలు,షెడ్యూల్ కులాలు,ఇతర అణగారిన, వెనుకబడిన వర్గాల,పేదల ప్రయోజనాలను పరిరక్షించేందుకు భారత రాజ్యాంగం పేర్కొన్న సూత్రాలను భారత సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పులను దృష్టిలో వుంచుకొని, వాటికి భంగం కలుగని రీతిలో భూములను కేటాయించడం అవసరం. కేవలం పారిశ్రామికవేత్తలు కోరిన చోట, కోరినంత

విస్తీర్ణాన్ని ఇవ్వాలనుకోవడం తగదు. ప్రజా ప్రయోజనం కోసం మాత్రమే ప్రభుత్వం భూమిని సేకరించాలని, రైతుల పంట పొలాలను, ముఖ్యంగా బలహీన వర్గాలకు ఎసైన్ చేసిన భూములను తీసుకోరాదని డిమాండ్ చేస్తున్నాం.

## నూతన జాతీయ సమగ్ర కౌలు చట్టం అవసరం

కౌలు రైతులు అత్యధికంగా భూమి లేని,సన్నకారు, చిన్న రైతులు, బలహీన వర్గాలకు చెందినవారు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలను అందించడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు నీతి ఆయోగ్ సంస్థ "మోడల్ ల్యాండ్ లీజ్ చట్టాన్ని" అమలు చేయాలని రాష్ట్రాలకు పంపించింది. అయితే ఈ చట్టం ప్రకారం రైతు తన భూమిని ఫలానా వ్యక్తికి కౌలుకు ఇచ్చినట్లు సంతకం చేయాల్సి వుంటుంది. వెనుకటి కాలంలో వున్న కౌలు చట్టాలు రద్దయ్యాయన్న సమాచారం తెలియక పోవడం, తన భూయాజమాన్య హక్కుకు భంగం కలుగుతుందే మోనన్న అనుమానంతో రైతులలో అత్యధికులు సంతకం చేయడానికి ముందుకు రావడం లేదు. ఫలితంగా కౌలు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద, ధనిక రైతుల వద్ద హెచ్చు వడ్డీలకు రుణాలు తీసుకోవలసిన పరిస్థితులున్నాయి. రూ.2 లక్షల వరకు కొల్లేటరల్ సెక్యూరిటీ లేకుండానే రైతులకు రుణాలివ్వాలని రిజర్వు బ్యాంకు ఆదేశాలు వున్నప్పటికీ, బ్యాంకులు పాటించక పోవడం క్షమార్హం కాదు. బ్యాంకుల ఆలోచనా సరళిలో మార్పు అవసరం. లక్షలాది మంది రైతులు, కౌలు రైతులు, చిరు వ్యాపారులు, చేతివృత్తుల వారు తదితరులకు రుణాలు ఇస్తే అదనపు సిబ్బంది, సర్వీసులో అదనపు వ్యయం, రికవరీకి అదనపు వ్యయం అవుతాయి. కొద్దిమంది బడా బాబులకు,భారీ పరిశ్రమలకు రుణాలు ఇస్తే టార్గెట్లు పూర్తవుతాయనే ఉద్దేశ్యంతో బ్యాంకులుండటం శోచనీయం. కౌలు రైతులందరికీ భూయజ మాని సంతకంవున్నా లేకున్నా గ్రామ వ్యవసాయోద్యోగి సమాచా రం మేరకు రుణం అందించాలి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం). కావున నూతన జాతీయ సమగ్ర కౌలు చట్టాన్ని తీసుకురా వలసిన అవసరం వుంది.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం ప్రమాదకరం

తుది రూపం తీసుకోబోతున్న ఇండో అమెరికన్ ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందం భారత రైతాంగానికి తీవ్రమైన నష్టాన్ని కలుగజేసే ప్రమాదం వుంది.ఇప్పటి వరకు భారత్‌కు అమెరికా నుండి దిగుమతుల కన్నా ఎగుమతులే కొంత మేరకు అధికంగా వుంటున్నాయి. ఇప్పుడు ఏటా రూ.9 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక, వ్యవసాయ,సాంకేతిక, ఆహార ఉత్పత్తులను విధిగా దిగుమతి చేసుకునేందుకు అంగీకరిస్తోంది. ఇందుకు మన దేశంలో మొక్కజొన్న, పత్తి, వేరుశనగ మొదలైన పంటల రైతులకు, కోట్లాది మందికి ఉపాధిని, ఆదాయాన్ని సమకూర్చు తున్న డెయిరీ రంగానికి నష్టం వాటిల్లబోతోంది. దొడ్డిదారిన జన్యు మార్పిడి వంగడాలు మన దేశంలోకి ప్రవేశించి మన సేంద్రీయ ఉత్పత్తులకు భంగం వాటిల్లే అవకాశముంది. అందువల్ల ఈ ఒప్పందంపై భారత ప్రభుత్వం సంతకం చేయరాదని డిమాండ్ చేస్తున్నాం.

## అమెరికా యుద్ధోన్మాదంతో ప్రపంచానికి ముప్పు

లోగడ కొన్ని దేశాల మధ్య వైషమ్యాన్ని పెంచి, యుద్ధాలు జరగడం వల్ల అమెరికాలోని ఆయుధ కంపెనీలకు లాభాలు చేకూర్చే దుర్విధానం వుండేది. ఇటీవల ట్రంప్ వెనిజులాలో చమురు సంపదపై కన్నేసి, ఆ దేశాధ్యక్షుడిని, భార్యను కిడ్నాప్ చేసిన ఘటన ప్రపంచ దేశాలను భయాందోళనలకు గురిచేసింది. అంతటితో ఆపక ఇరాన్ పైన ఇజ్రాయిల్‌ను ఎగదోసి యుద్ధ క్రీడను ప్రారంభించింది. దాంతో భారత్‌తో సహా అనేక దేశాలలో ఆర్థిక వ్యవస్థలు గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. పెట్రోల్, డీజిల్, ఎల్.పి.జి గ్యాస్ కొరతల భయాలతోపాటు, మన దేశం నుండి కోడిగుడ్లు, మామిడి గుజ్జుతో పాటు పలు వ్యవసాయ ఆహార ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోయి రైతులకు, ఎగుమతిదారులకు కంటి మీద కునుకు లేని పరిస్థితి ఏర్పడింది. కావున వెంటనే యుద్ధాన్ని విరమిం చాలని అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్‌లను అభ్యర్థించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

## ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేంద్రం నిధులు

కోట్లాది మంది ప్రజలకు పని కల్పిస్తూ,ఆహార భద్రత చేకూరుస్తూ, ఎగుమతుల ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని సమకూ రుస్తున్న వ్యవసాయరంగ పురోభివృద్ధికి, రైతులు వ్యవసాయ కార్మికుల ఆదాయాల పెంపునకు దోహదపడే ఇరిగేషన్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం క్షమార్హం కాదు. మన రాష్ట్రంలో పలు ఇరిగేషన్ ప్రాజెక్టుల పైన వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రధాన కాలువల పనులు ముందుకు సాగినా, రిజ ర్వాయర్లలో నీరు ఉన్నా డిస్ట్రిబ్యూటరీ, పంటకాలువల పనులు నత్తనడకగా సాగుతున్నాయి. దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడం లేదు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చట్టం 2005 లోని 11, 12, 19 సెక్షన్లను సవరణ చట్టం 2005లో కొనసాగిం చాలి. ప్రకృతి వైపరీత్యం సంభవించినప్పుడు అమలు చేయాల్సిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సవరణ చట్టం 2025లో తొలగించి ప్రమాదం సంభవించినప్పుడు రైతు బకాయిని వాయిదా వేయటం, కొంత తాత్కాలిక సహాయం అందించడానికి, నష్టపరిహారం ప్రకటించేందుకు వున్న సెక్షన్లను తొలగించడం మోడీ ప్రభుత్వ రైతు వ్యతిరేక దృక్పధానికి ఉదాహరణ.విదేశీ ఇన్సూరెన్స్ అండ్ ఫైనాన్స్ సంస్థల తెర వెనుక ఆదేశాలను పాటించడం దుర్మార్గం.

రైతుల వాస్తవ ఖర్చుకు ప్రభుత్వం వైపరీత్యాల సందర్భంలో అందించే ఇన్‌పుట్ సబ్సిడీలకు పోలిక ఉండటం లేదు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా ఇన్-పుట్ సబ్సిడీలను పెంచాల్సిన ఆవశ్యకత వుంది. పంటల బీమా పథకాన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభాలను చేకూర్చేదిగా కాక, రైతులను సరిగా ఆదుకొనే రీతిలో విధివిధానాలను సవరించాలి. పంట బీమా పథకం ప్రీమియంను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 2:1 నిష్పత్తిలో భరించడం సమంజసం. భారత ప్రభుత్వం మన దేశంలో 10 హెక్టార్ల లోపు భూమి వున్న రైతు కుటుంబాలు (రిసోర్స్ పూర్ ఫార్మర్స్)గా నోటిఫై చేసి వున్నందున వీరికి అందించే సబ్సిడీలపై ఎటువంటి ఆంక్షలు లేనందున, 'గ్రీన్ బాక్స్' సదవకాశాలను భారత ప్రభుత్వం రైతాంగానికి అందచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. పైన పేర్కొన్న సమస్యల పరిష్కారం కోసం యావత్ రైతాంగం కుల, మత, ప్రాంతీయ, రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాడి, పరిష్కారాలు సాధించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ❑

# ప్రతిఘటన, పునరుజ్జీవనం.. ఇండియా కూటమి భవిష్యత్తు

**(22వ పేజీ తరువాయి)** బీజేపీకి గట్టి సవాలు విసిరింది. అయితే అనంతరం మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ ఎన్నికల్లో ఎదురైన ఎదురుదెబ్బలు కూటమి ప్రభావాన్ని తగ్గించాయి. ఎన్నికల ప్రక్రియపై పెరుగుతున్న అనుమానాలు, బీజేపీ పెరుగుతున్న ఆధిపత్యం పరిస్థితిని మరింత క్లిష్టం చేశాయి. ఈ నేపథ్యంలో ఇండియా కూటమికి కొత్త రాజకీయ శక్తి, కొత్త ఉత్సాహం అవసరం. రాహుల్ గాంధీకి ఇక్కడ ద్వంద్వ బాధ్యత ఉంది – కాంగ్రెస్‌ను పునరుజ్జీవింపజేయడం, అలాగే విభిన్న భావజాలాల పార్టీలతో కూడిన ఇండియా వేదికను పరస్పర గౌరవం, విశ్వాసం, సహకారంతో ముందుకు నడిపించడం. భారతదేశం వైవిధ్యంలో ఏకత్వంతోనే అభివృద్ధి చెందగలదు. అదే సూత్రం ఇండియా కూటమికీ వర్తిస్తుంది. ప్రజల పోరాటాలతో అనుసంధానమై, ప్రజాస్వామ్య పరిరక్షణను కేంద్ర కర్తవ్యంగా తీసుకుని, సామాజిక న్యాయం మరియు లౌకిక ప్రజాస్వామ్య భారత నిర్మాణ లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే ఇండియా కూటమి భవిష్యత్తును నిర్మించగలదు. ప్రజా ప్రతిఘటన, ప్రజాస్వామ్య ఐక్యత, రాజకీయ పునరుజ్జీవనం – ఇవే నేటి భారత రాజకీయాల ప్రధాన అవసరాలు. ❑

## ఆండ్రే బెటెయిల్ : భారతదేశంలో కుల వ్యవస్థపై కొన్ని ప్రతిబింబాలు..

**(24వ పేజీ తరువాయి)**

ఉంది. ఇక నయా-హిందుత్వ కాలంలో కులం మరింత స్పష్టంగా బహిర్గతమవుతోంది. బెటెయిల్ రిజర్వేషన్లను "ప్రతిభతో రాజీ" పడటంగా భావించారు. విద్యాసంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జాతీయ జ్ఞాన సంఘం(నేషనల్ నాలెడ్జ్ కమిషన్) సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. అయితే నయా ఉదారవాద ప్రైవేటీకరణ వల్ల ప్రభుత్వ రంగం కుంచించుకుపోతున్న వాస్తవాన్ని ఆయన తీవ్రంగా పరిగణించలేదు. బెటెయిల్ ఆరు దశాబ్దాల బౌద్ధిక ప్రయాణం భారతీయ సమాజశాస్త్ర పరిణామానికి అద్దం పడుతుంది. ఆదర్శాలకు అతీతంగా, విశాల దృక్పథంతో, కఠినమైన క్షేత్ర అధ్యయనంతో సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవడమే మనం ఆయన నుంచి నేర్చుకోవాల్సిన ప్రధాన పాఠం. ఈ విధానమే సమానత్వ సమాజం నిర్మాణం వైపు మనల్ని నడిపించగలదు. ❑

# మతమౌఢ్యం వదులుకున్న వాడే స్వేచ్ఛా మానవుడు..

**(31వ పేజీ తరువాయి)**

ఉంది– అన్ని మతాలు శాంతి ప్రబోధిస్తూ శాంతి స్థాపనకే పనిచేస్తుంటే మరి వేల వేల యేళ్ళుగా ప్రపంచంలో శాంతి ఎందుకు స్థాపించబడడం లేదూ? అంటే మతాలన్నీ విఫలమైనట్టే కదా?

**అభూతకల్పనలు ఎలా పలాయనం చిత్తగిస్తాయంటే?**

మనిషి మానవ శక్తిని గుర్తించి, శ్లాఘించి, కీర్తించగలిగినపుడు అతను ఇక ఏ శక్తి గురించి ఆలోచించనవసరం లేదు. జవాబులకు బలం ఉన్నప్పుడు ప్రశ్నలు తోకముడుస్తాయి. వాస్తవాలు దృఢమవుతున్న కొద్దీ భ్రమలు, ఊహలు, కల్పనలు, పరలోకాలు పలాయనం చిత్తగిస్తాయి. మనిషిలోని మంచితనమనేది మతంతోనూ, స్థాయితోనూ, జాతితోనూ, రంగుతోనూ, లింగ భేదంతోనూ లేదా రాజకీయ పరమైన, సాంస్కృతిక పరమైన దృక్పథాలతోనూ ముడిపడి లేదు. కేవలం ఎదుటి వారితో అతను ఎట్లా వ్యవహరిస్తున్నాడన్న దానిమీదే అతని మంచితనం గుర్తింపులోకి వస్తుంది. అలాగే మనిషిలోని చెడుతనం ఎలా ఉంటుంది? మూర్ఖుడంటే ఎవరు? అనేది ఆలోచిస్తే దానికి సమాధానం ఇలా ఉంటుంది: "అతను నిజం తెలుసుకుంటాడు. నిజాన్ని చూస్తాడు కూడా! అయినా అబద్ధాల్ని నమ్ముతుంటాడు." అందువల్ల ఎవరికివారు తమను తాము బేరీజు వేసుకుంటూ ఉండాలి. ❑

# అర్థశాస్త్ర విమర్శ పుస్తకానికి అనువాదకుని ముందుమాట

- ఎ.గాంధి



ఇది “అర్థశాస్త్ర విమర్శ” అనే పుస్తకం. దీని రచయిత కార్ల్ మార్క్స్. ఆయన దీన్ని 1859లో ప్రచురించాడు. ఇంగ్లిషులో A Contribution to the Critique of Political Economy అనే పుస్తకాన్ని నేను సాదాగా అర్థశాస్త్ర విమర్శ అన్న పేరుతో తెలుగు చేశాను. Political Economy Classical Economics అనీ Classical Political Economy అని పిలుస్తారు. ఇంతకుముందు అనువాదకులు Claasical Political Economyని తెలుగులో సంప్రదాయ రాజకీయ అర్థశాస్త్రం అన్నారు. అయితే, ఈ శాస్త్రం ఇంగ్లండులో విలియం పెట్టీతో మొదలై రికార్డోతోనూ ఫ్రాన్సులో బాయిస్ గుల్ బెర్ట్‌తో మొదలై సిస్మండీతోనూ ముగిసిందని మార్క్స్ ఈ పుస్తకంలోనే చెప్పాడు. అంటే, అది 17వ శతాబ్దం చివరిలో మొదలై పందొమ్మిదో శతాబ్దపు తొలి దశకాల్లో ముగిసింది. ఇది ఆధునిక ఆర్థిక రంగంలో సుమారు ఒకటిన్నర శతాబ్దంపాటు సాగిన మేధో మథనం.కనుక, ‘సంప్రదాయ’ అనే పదం సరికాదన్నది నా భావన. Classical Political Economy అన్నా, Political Economy అన్నా, తెలుగులో రాజకీయ అర్థశాస్త్రం అందాం చాలు. అర్థ శాస్త్రజ్ఞుల మధ్య ఎన్ని తేడాలున్నప్పటికీ, ఈ శాస్త్రానికి కొన్ని ఉమ్మడి లక్షణాలు ఉన్నాయి.

బూర్జువావర్గం పుట్టి పెరుగుతున్న దశలోనే ఈ శాస్త్రం కూడా తయారయింది. జాతి సంపదని పెంచే ప్రగతిశీల శక్తిగా బూర్జువావర్గాన్ని ఈ శాస్త్రం గుర్తిస్తుంది. కనుక, ఆధునిక యుగంలో, అర్థశాస్త్రం అంటే, స్థూలంగా బూర్జువా అర్థశాస్త్రమే. కనుక, సంప్రదాయ అనే పదం వాడదలుచుకుంటే, బూర్జువా సంప్రదాయ అర్థశాస్త్రమని అనవచ్చు. అయితే, బూర్జువా వర్గాన్ని సమర్థించే ఆర్థికవేత్తలందరూ అర్థశాస్త్ర వేత్తలు కాదు. వారిలో కొందరిని మార్క్స్ వల్గర్ ఎకనమిస్టులు అన్నాడు. వల్గర్ అంటే, నాటు, మోటు, అశాస్త్రీయ, కుసంస్కార, అసభ్య వగైరా అర్థాలున్నాయి. ఈ నాటు ఆర్థికవేత్తలకీ, విలియం పెట్టీ, ఆడం స్మిత్, రికార్డో, సిస్మండీ లాంటివాళ్లకీ, ఉన్న తేడా ఏమిటి? ఈ రెండు బృందాలూ పనిచేసిన కాలాలూ, నేపథ్యాలలో తేడా ఉంది. వారి దృష్టి కోణంలో కూడా తేడా ఉంది. మొదటివారు శాస్త్ర పరిశోధకులు. వారు సత్యాన్వేషకులు. రెండోవారు కేవలం వకాల్తాదారులు. బూర్జువా వర్గ తొలి దశల్లో క్లాసికల్ ఎకనామిస్టులు పని చేశారు. అప్పటికి ఎక్కువచోట్ల దొరల పెత్తనం సాగుతోంది. బూర్జువా వర్గం భూస్వామ్య వర్గంతో పోటీ పడుతోంది. ముందు ఆర్థిక రంగంలోనూ తర్వాత రాజకీయ రంగంలోనూ ఆధిపత్యం




ఈ పుస్తకం కోసం.. ఫోన్ 94900 98654

కోసం అది తంటాలు పడుతోంది. ఆనాటికి ఆ రెండు వర్గాల మధ్య వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది. అప్పటికి, బూర్జువా వర్గానికి గల చెడు పార్శ్వమూ, దాని దుర్లక్షణాలూ కనీ కనిపించ నట్టు ఉన్నాయి తప్ప స్పష్టంగా కానరావడం లేదు. బూర్జువా వర్గంతోపాటు కార్మిక వర్గం కూడా పుట్టిక్రమంగా పెరుగుతూ ఉంది. ఈ రెండు వర్గాల మధ్య కూడా పుట్టిన దగ్గర నుంచీ వైరుధ్యం ఉండదని కాదు. కచ్చితంగా ఉంటుంది. కాని తొలి దశల్లో ఆ వైరుధ్యం అంత స్పష్టంగా కానరాదు. కార్మికవర్గం రంగంపైకి బలంగా వచ్చేవరకూ బూర్జువాలకూ, భూస్వాముల కూ మధ్య వైరుధ్యాలే బాగా నదురుగా కనిపిస్తాయి. అప్పటికి అవే ప్రధాన వైరుధ్యాలు. జాతి సంపద ఏ పద్ధతుల ద్వారా వేగంగా అభివృద్ధి అవుతుందన్నది నిష్పక్షపాతంగా కనుగొనడమే ఆనాటి అర్థశాస్త్ర పరిశోధనల లక్ష్యం. భూస్వాముల కింద కొత్త సంపద పెద్దగా సృష్టి కావడం లేదనీ, బూర్జువా పద్ధతులతో కొత్త సంపద బాగా పెరుగుతోందనీ వారు గ్రహించారు. అందుకే జాతి ప్రయోజనాలు బూర్జువావర్గంతో ముడిపడి ఉన్నాయనే నిర్ధారణకు వారు చేరుకొన్నారు. వారు బూర్జువా వర్గాన్ని సమర్థించడానికి కారణం, ఆ వర్గం భూస్వామ్య వర్గం కంటే, వేగంగా జాతి సంపదని పెంచుతోంది అని గ్రహించడం వల్లనే. నాటు ఆర్థిక వేత్తలు అలా కాదు. బూర్జువా వర్గం ఆర్థిక, రాజకీయ రంగాల్లో పాతుకొన్నాకనే వారు తలెత్తారు. వీరికి

బూర్జువావర్గ ప్రయోజ నాలే పరమావధి. వారి దృష్టిలో బూర్జువా వర్గానికి మేలు జరిగితే చాలు. జాతి మేలు తర్వాత సంగతి. అందుకే వారు బూర్జువా వర్గానికి మేలు జరిగితే జాతికి మేలన్నట్టు వాదిస్తారు. అందుకే వీరిని బూర్జువా వకాల్తాదారులు అంటాడు మార్క్స్.

నేటి నయా ఉదారవాద దశలో ఆర్థిక సామాజిక రంగాల్లో పై స్థానాల్లో వుండేది, ఎక్కువగా వీరే. అర్థ శాస్త్ర విమర్శ గ్రంథంలో మార్క్స్ ఎక్కువగా దృష్టి పెట్టింది, ఈ వకాల్తాదారులపై కాదు. ఇక్కడ అర్థ శాస్త్రవేత్తల సిద్ధాంతాలే ఆయన లక్ష్యం. అర్థశాస్త్ర మంటే బూర్జువా అర్థ శాస్త్రమే అని ముందే చెప్పుకొన్నాం కదా. మార్క్స్ అధ్యయనం చేసిందీ, విశ్లేషించింది, విమర్శించింది ఆ శాస్త్రాన్నే. కొందరు పండితులు మార్క్సిజాన్ని అర్థశాస్త్రంలో ఒక భాగంగా పరిగణిస్తారు. కానీ అది సరికాదు. అర్థశాస్త్రానికి మార్క్స్ శిష్యరికం చెయ్యలేదా, అంటే చేశాడు. ఆయన ఆ శాస్త్రాన్ని ఎంత క్షుణ్ణంగా అధ్యయనం చేశాడంటే, అంతకు ముందు ఏ అర్థ శాస్త్ర వేత్తా చేయనంత క్షుణ్ణంగా చేశాడు. కనుక, ఆయన్ని దానికి అత్యుత్తమ శిష్యుడు అనవచ్చు. అయితే ఆయన ఆ శాస్త్ర పరిధిలో ఉండిపోలేదు. అధ్యయనం చేస్తూనే దాన్ని అంతే క్షుణ్ణంగా విశ్లేషించాడు; ఆ క్రమంలో ఆ శాస్త్ర పరిమితుల్ని ఆయన దాటిపోయాడు. ఆ విశ్లేషణే విమర్శగా రూపొందింది. మార్క్స్ అత్యుత్తమ అర్థశాస్త్ర విమర్శకుడు. అందుకే మార్క్సిజాన్ని స్థూలంగా 'అర్థశాస్త్ర విమర్శ' అని కూడా అనవచ్చు.ఆయన ఆ శక్తిని ఎలా సాధించగలిగాడు?

ఒక కారణం అప్పటికే భౌతిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులు. గతంలో పాలిత వర్గం అయిన బూర్జువావర్గం అప్పట్లో ఇంగ్లండు, ఫ్రాన్సు లాంటి దేశాల్లో పాలక వర్గంగా ముందు కొస్తోంది. కార్మిక వర్గం కూడా అప్పుడే స్పష్టంగా రంగంపైకి వస్తుంది. రెండో కారణం ఏమంటే, కొత్తగా మారిన, మారుతున్న అంశాలను పసిగట్టి పరిశీలించగలిగిన అనితరమైన మార్క్స్ మేధాశక్తి. పైపైన పరిశీలించే వారికి అంతా సాఫీగానే, సజావుగానే సాగిపోతున్నట్టుగా కనిపించే పరిస్థితుల్లో కూడా అంతర్గతంగా తొంగిచూస్తున్న వైరుధ్యాలను పసిగట్టడంలో మార్క్స్‌కి ఉన్న అసమాన ప్రజ్ఞ ఒక కారణం. అర్థశాస్త్ర విమర్శ అనేక వర్గ కోణాల నుంచి చేయవచ్చు. మార్క్స్ మాత్రం శ్రామిక వర్గ దృష్టి కోణం నుంచే పరిశీలించాడు. అంటే ఏమిటి? మార్క్స్ అర్థ శాస్త్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించినట్టే, బూర్జువా వర్గాన్ని, బూర్జువా సమాజాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించాడు. అది అంతకు ముందున్న వ్యవస్థ కంటే, అనేక అంశాలలో మెరుగ్గా ఉన్నమాట నిజమే. కాని ఆ వ్యవస్థ పరిమితులతో పాటు,ఆ వర్గ అవలక్షణాలని ఆయన గ్రహించాడు. అందుకే బూర్జువా వ్యవస్థ చిరస్థాయిగా మనలేదని ఆయన అర్థం చేసుకొన్నాడు. బూర్జువా వర్గం ఎలాగైతే భూస్వామ్య వర్గాలను కూలదోసి ముందుకు వచ్చిందో, అలాగే బూర్జువా వర్గాన్ని కూలదోసి ముందుకు రాగల శక్తి అందరికంటే ఎక్కువ, శ్రామిక వర్గానికి మాత్రమే ఉందనే నిర్ధారణకు ఆయన వచ్చాడు. ఆ దృష్టితోనే ఆయన ప్రపంచాన్ని పరిశీలించాడు. కార్మికవర్గం సైతం చిరస్థాయిగా ఉండదనీ,అది వర్గ రహిత సమాజానికి దారిచ్చి, అంతిమంగా మాయమైపోతుందనీ అంటాడు, మార్క్స్. అది వేరే కథ. ఈ పుస్తకం 1859లో వెలువడింది.అర్థశాస్త్ర విమర్శని అనేక సంపుటాల్లో ప్రదర్శించాలనే ఉద్దేశంతో మొదటి పుస్తకంగా భావించి దీనిని ఆనాడాయన విడుదల చేశాడు. తర్వాత ఆయన ఆలోచన మారింది. ఈ పుస్తకాన్ని అలా వుంచేసి, పెట్టుబడి పేరుతో అనేక సంపుటాల్లో మళ్లీ మొదటి నుంచీ వివరించాడు. అందుకే, ఈ పుస్తకంలో ఉన్న కొన్ని విషయాలు పెట్టుబడి మొదటి సంపుటిలో తిరిగి కనిపిస్తాయి.

అయితే, పెట్టుబడి సంపుటాల్లో చోటు చేసుకోని కొన్ని విలువయిన విషయాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి. కనుకనే ఈ పుస్తకాన్ని తెలుగు చేయాల్సిన అవసరముంది అనిపించింది. మిత్రులు అందుకు నన్ను ప్రోత్సహించారు. ఆ పని మొదలు పెట్టాక నేను ఊహించినదానికంటే నాకు చాలా ఎక్కువ సమయమే పట్టింది. అనువాదంలో ఎక్కువ కష్టాలే ఎదురయ్యాయి. సరే ఆ సంగతిని పక్కనపెట్టి మనం పుస్తకంలో ప్రవేశిద్దాం. ముందుగా మార్క్స్ ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో ఏమి చెప్పాడో చూద్దాం. అర్థశాస్త్ర విమర్శ పుస్తకాన్ని రాసేనాటికి యూరవులో దొరలు ఇంకా పూర్తిగా కనుమరుగు కాలేదు. భూస్వామ్య వ్యవస్థ బలహీనపడింది కాని అదింకా ఒక పెద్ద శక్తిగానే ఉంది. ఆనాటి ప్రధాన వర్గాలు మూడు: పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్య వర్గం, కార్మికవర్గం. ఇంకా అనేక వర్గాలున్నాయి కాని అవన్నీ మధ్యంతర వర్గాలు.

ఈ పుస్తకం లక్ష్యం పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థని విశ్లేషించడం. దానిలో భాగంగా పైమూడు వర్గాలకీ చెందిన పెట్టుబడిని, భూసంపదని, కూలిపనిని పరిశీలిస్తాను అంటాడు మార్క్స్. వాటితోపాటు రాజ్యం గురించీ, విదేశీ వాణిజ్యం గురించీ, ప్రపంచ మార్కెటు గురించీ పరిశీలించడం ఆయన లక్ష్యం. అయితే, మన ముందున్న ఈ పుస్తకంలో అవన్నీ ఉండవు. దీనిలో సరుకులు, డబ్బు అనే రెండు విషయాల గురించి మాత్రమే మనం నేర్చుకొంటాం.

**పాఠక మిత్రులకు నా మనవి :** నేను అనుబంధాలను వదిలేసి కేవలం పాఠ్యాంశాన్ని మాత్రమే తెలుగుచేశాను. ఈ పనిని మనసుపెట్టి, శ్రద్ధగా ఇష్టం గా చేశాను. అయినా ఇందులో ఎక్కడైనా మీకు ఏ పొరబాటు కనిపించినా, దయచేసి నాకు తెలియజేయండి. మొహమాట పడకండి. మలి ముద్రణలో దానిని సరిచేయడానికి తోడ్పడండి. ❑ **(పుస్తకం కోసం ఈ 94900 98654 నెంబరులో సంప్రదించగలరు)**

# అతి వాస్తవిక మాయలోకం మానవ మనుగడ

- ప్రొఫెసర్ పి.కేశవకుమార్



కళ్లెదుటే మారిపోతున్న ప్రపంచం, వాస్తవం, అబద్ధం కలిసిపోయిన సందర్భం. వాస్తవాన్ని తలదన్నే అతివాస్తవిక అధునాతన సమాజం. నిన్నటి వరకు వాస్తవం అని నమ్మినదంతా అనుమానంగా చూసే పరిస్థితి. సాంకేతికత నెట్వర్క్‌లో చిక్కుకున్న సమాజం. టెక్నాలజీ మన ఒంటిలో భాగమైపోతుంది. మనం మానవాంతర ప్రపంచంలోకి, సత్యానంతర లోకంలోకి పయనిస్తున్నామని మేధావుల ఉవాచ. సహజ మనిషిగా అంతరించి పోయి కృతిమ మేధలోకి ఇంకిపోతున్నాం. చదువు, జ్ఞానం, శాస్త్రం, హేతువు, ప్రజాస్వామ్యం అర్థాలు మార్చుకుంటాయి. ఇప్పుడు ప్రపంచం మనకు మత రాజకీయ ఆజ్ఞలా, డిజిటల్ స్క్రీన్‌లా, మీడియా చిత్రంలా, వ్యాపార ప్రకటనలా, మార్కెట్ వినిమయ వస్తువుగా పరిచయమవుతుంది. మనల్ని మనం మరిచిపోయే ఫాంటసీ వరల్డ్‌లోకి దూకేద్దామనుకుంటాం. ఇదే సందర్భంలో మనిషిని, సమాజాన్ని, చరిత్రను తలదన్ని మతం, మైథాలజీ ఒక దివ్య ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. నైతిక ప్రమాణాలు, రాజకీయ రూపురేఖలు మారిపోతున్నాయి. మన సామాజిక విలువలు, సమష్టి జీవితాలను ఏదో తెలియని శక్తి/వ్యక్తి శాసిస్తున్నట్టుగా విలోమం చెందుతుంది. నిన్నటి వరకు మూఢత్వంగా చూసింది నేడు గౌరవప్రదమైపోతుంది. మతం వెనకున్న వున్నదని నమ్మిన నైతిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. గుళ్ళు, పూజలు, క్రతువులు, వేడుకలు మతంగా ఆరాధ్యమవుతుంది. పురాతనం అత్యంత అవసరమైన ఆధునికమైపోతుంది.

మైథాలజీ చరిత్రను తలదన్నే పవిత్ర చరిత్రవుతుంది. 'ఒక ధర్మశాస్త్రం' న్యాయ సిద్ధాంతమవుతుంది. మైథాలజీలో ముంచి తీసిన ఆధారరహిత పరిజ్ఞానంతో కుట్టిన కొత్త చొక్కాలు విద్యా కేంద్రాల్లో విజ్ఞానంగా వికసిస్తుంది. సోషల్ మీడియాలో మనం మరిచిన మన జ్ఞానంగా చెక్కర్లు కొడుతుంది.

**మత ప్రభుత్వం ఇదే మన అసలైన భారతీయ ఆత్మ అంటుంది. వలసవాద విముక్తికి అంకురార్పణ అంటుంది. సనాతనమే ప్రపంచ దారి దీపమని జ్వలిస్తుంది. వేల ఏళ్ల క్రితం ఋషుల తపోబలం, మంత్ర శక్తి, మెడిటేషన్ టెక్నిక్ మన ఆరోగ్యానికి, ఆత్మ నిర్భరానికి అనంతబలాన్నిస్తుందని విపరీత ప్రచారం చేస్తుంది. మనం, మన అస్తిత్వం, జ్ఞానం, విలువలు, ఆదర్శం, ఆచరణ, రాజకీయం ఇలా అన్నీ మారిపోయి మన అసలు ఆనవాలు ఎతుక్కోవాల్సిన పరిస్థితి దాపురించింది. సామాజిక వాస్తవికం, అధికారిక శక్తుల కథనాత్మక సంభాషణలతో, టెక్నాలజీ జిలుగు వెలుగులతో సామాజిక వాస్తవికత కొత్త అవతారమెత్తుతుంది. ఇటువంటి నూతన ప్రపంచంలో మనిషి జీవితం మెరుగుపడుతుందా లేక ఇది ఓ సామాజిక పతనానికి దారితీస్తుందా అని ఆలోచించాల్సిన విషయం.**

## వర్చువల్ ప్రపంచం

ఏది నిజమో ఏది నకిలీనో తెలియని కృత్రిమ సాంకేతిక సమాజం. వాస్తవాన్ని దాటిపోయి, ఇదే వాస్తవనమే వర్చువల్ సమాజంలోకి వచ్చేశాం. టెక్నాలజీతో సహ జీవనం చేసే సైబోర్గ్‌లమయ్యాం. మీడియా, అడ్వర్టైజ్మెంట్లు, డిజిటల్ సాధనాలు, AI చిత్ర సంభాషణలు, సోషల్ మీడియా కథనాలు సృష్టించిన వాస్తవమే, అసలు వాస్తవంకంటే నిజమైందిగా నమ్మే రోజులు. ఈ వర్చువల్ సమాజంలో మనుషుల్ని, సామాజిక వాస్తవికతని బయటికి నెట్టేసే డిజిటల్ సౌందర్యం. వాస్తవంకన్నా అనుకరణ అద్భుతంగా ఉంటుంది. ఫిల్టర్లతో, సోషల్ మీడియాతో తయారు చేయబడ్డ మన ఇమేజి అందమైన ప్రామాణికంగా ఉంటుంది. నిజమైన సామాజిక సంబంధాలు మీడియా చిత్రాలు, సోషల్ మీడియా సంభాషణలు ద్వారా దృశ్య సమాజంగా మారిపో తుంది. మనకు సంబంధించిన ప్రతి విషయాన్ని దృశ్య రూపంలోకి తర్జుమా చేసుకుంటాం. వినిమయ సంస్కృతి ఆరాధనలో తప్పుడు అవసరాలు సహజ అవసరాలుగా మారిపోయి, సామాజిక సంబంధాల స్థానంలో వినిమయ సంబంధాలు ముందుకొచ్చాయి. బ్రాండెడ్ వస్తువులు మన అస్తిత్వాన్ని నిర్ణయిస్తాయి. ఈ వినిమయ సంస్కృతి ప్రజలను విమర్శనాత్మకంగా ఆలోచించనీయకుండా ఉండే ఒక ఫాంటసీ ప్రపంచంలోకి తోసేస్తుంది. తప్పుడు అవసరాలని సృష్టించి వ్యక్తులను మార్కెట్ వ్యవస్థకు అనుకూలంగా మార్చివేస్తుంది. అంటే, వ్యక్తుల, సమాజాల గుర్తింపు మార్కెట్ ద్వారానే నిర్మితమవుతుంది.

## వాస్తవ జీవితానికిక సెలవు !

వాస్తవ ప్రపంచం నుంచి పారిపోయి సెలవు తీసుకోవటం మనకు సౌకర్యంగానూ, సుఖంగానూ ఉంటుంది. కష్టాల నుంచి, బాధల నుంచి బయటపడే మోక్షం, స్వర్గం ఆలోచన అద్భుతంగా ఉంటుంది. మోక్షాన్ని ప్రసాదించే దేవుణ్ని పూజిస్తాం. గురువుల్ని వేడుకుంటాం. బతుకు కష్టంగా ఉన్న మనకు, ఒకప్పుడు మనం మహారాజులం. మనకు మహోన్నత సాంస్కృతిక వారసత్వం ఉందని చెప్పుకోవటం బహు గొప్పగా ఉంటుంది. మతం సమస్యల నుంచి ఉపశమనాన్ని ఇచ్చే ఊహాజనిత వెసులు బాటుగా ఉంటుంది. సినిమాలు, సూపర్ హీరోలు, మనమే హీరోలైనట్టుగా బలే కిక్కిస్తుంటాయి. అందుకేనేమో మన సినిమా హాళ్లు, దేవుడి గుళ్లు ఎప్పుడూ హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో నడుస్తాయి. ఇదే తీరులో, పెట్టుబడిదారి మార్కెట్ మనకు అవసరమున్నా, లేకున్నా అనేక వస్తువులను ఉత్పత్తి చేస్తూ తప్పుడు అవసరాలను అవసరమైనవిగా చేస్తుంది. మార్కెట్ సమాజంలో వస్తు వినిమయానికి బానిసలుగా ఉండడంలో అదో థ్రిల్లింగ్, అదో ప్రత్యేక గుర్తింపు. నేటి టెక్నాలజీ మనిషినే మర్చిపోయి టెక్నాలజీతో ఐక్యమై బతికే సంక్లిష్ట జీవితానుభవాన్నిస్తుంది. అలెక్సాతో మాట్లాడుకుంటాం. రోబోలతో రొమాన్స్ చేస్తాం. వర్చువల్ వరల్డ్‌లో మనిషి ఏ అవతారమైనా ఎత్తొచ్చు.

మతం, మార్కెట్, టెక్నాలజీ, వినిమయం కలిసిపోయిన ఆధునిక సమాజంలో ఆధిపత్య వ్యవస్థ తనకనుకూలంగా మలచుకుంటూ ఉంటుంది. అసమానతలు తీవ్రమై సామాజిక సంబంధాలను, సమిష్టి విలువలను నిర్వీర్యం చేస్తాయి. ఎక్కడో తెలియని అసంతృప్తి, మానసిక కుంగుబాటు వెంటాడుతుంది. ఫ్రెడరిక్ జేమ్సన్ 'పోస్ట్ మోడర్నిజం లేక కల్చరల్ లాజిక్ ఆఫ్ ద లేట్ క్యాపిటలిజం' అనే గ్రంథంలో ప్రపంచీకరణ, బహుళజాతి సంస్థలు, ఫైనాన్సియల్ క్యాపిటలిజం, వినియోగవాదం, డిజిటల్ సాంకేతికతలు చివరి దశ పెట్టుబడిదారీ విధానానికి ప్రధాన లక్షణాలుగా చెబుతాడు. సంస్కృతి ఆర్థిక వ్యవస్థకు వెలుపల ఉండక  అది పూర్తిగా మార్కెట్‌లో భాగమై వుంటుంది. కళ, మతం, రాజకీయాలు, వ్యక్తిత్వం, నిరసనలు-అన్నీ సరుకులుగా మార్చబడి మార్కెట్‌లో అమ్ముడయ్యే స్థితికి చేరుకుంటాయి. ఇందుకు వచ్చే ప్రతిఘటనను తనలో ఇముడుకునే మీడియా దృశ్యవిష్కరణలా మలచగలవు అంటాడు.

## పరిహాసమవుతున్న ప్రజాస్వామ్యం

మనిషి తన అస్తిత్వాన్నే మైమరిచే ఈ అతివాస్తవిక/అవాస్తవిక ప్రపంచంలో విముక్తి రాజకీయాలకు, ప్రజాస్వామిక పోరాటాలకి పెనుసవాలే. ప్రపంచీకరణతో బహుళ కంపెనీల వలలో చిక్కుకున్న రాజ్యాల సార్వభౌమత్వం ప్రశ్నార్థకమవుతుంది. ప్రజా స్వామ్యంలో ప్రజల ప్రాతినిధ్యం కనుమరుగవుతుంది. మన రాజకీయ భాష మారిపోతుంది. ఎన్నికలు, సీట్లు, మెజారిటీ, అది కూడా ఒక ఆధిపత్య మతం, జాతి నిర్ణయ అధికారమే ప్రజాస్వామ్యంగా ప్రకటించుకుంటుంది. రాజ్యాంగంలో రాసు కున్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, సమ సమాజ ఆదర్శం ఎగతాళికి గురవుతుంది. అగ్రకులం చెప్పినట్టు అణగారిన కులాలు, అత్యధికుల మతం చెప్పినట్టు అల్ప సంఖ్యా కులు, పురుషుడు చెప్పినట్టు స్త్రీలు లోబడి నడుచుకోవటం సహజ సామాజిక నీతిగా చెలామణి అయ్యే వాతావరణాన్ని సృష్టించడం జరుగుతుంది. ఇదంతా మన సంస్కృతి, సంప్రదా యం, వసుధైక కుటుంబ ఆదర్శంగా ఊదరగొట్టడం పరిపాట వుతుంది. రాజకీయాలు ప్రజాస్వామ్యాన్ని పరిహరించేవిగా, మత తత్వ జాతీయవాదంగా, లౌకిక, బహుళస్వామ్యానికి విరుద్ధంగా ఉండే పాపులిస్ట్ ఒరవడిలో ఉంటాయి. ఇటువంటి సమాజం లో బాధితులుగా ఉన్నవాళ్లు తమకు తోచిన విధంగా తిరగబడ టం తమ అస్తిత్వ అవసరం. అది అధికారం కోసం ప్రత్యామ్నా య సంస్కృతిని, కథనాల్ని, ప్రతీకల్ని, జ్ఞానాన్ని, రాజకీయాల్ని ప్రజలు నిర్మాణం చేసుకోవడంతో ముడిపడివుంది.

## ప్రత్యామ్నాయ పోరాట కథనాలు కావాలిప్పుడు!

మతం, మార్కెట్, రాజకీయాలు వేర్వేరు రంగాలుగా మాత్రమే కాక, జ్ఞానం, నైతికత, పాలన పద్ధతుల ద్వారా ఒకదానికొకటి అనుసంధానమైన అధికార వ్యవస్థలు. మిషెల్ ఫుకో జ్ఞానానికి, అధికారానికి వున్న సంబంధాన్ని చెబుతూ, అధికారం జ్ఞానాన్ని సృష్టిస్తుంది. జ్ఞానం అధికారాన్ని బలపరుస్తుంది. ఏది 'సత్యం' అనే విషయాన్ని అధికార సంబంధాలే నిర్ణయిస్తాయి. ఆధిపత్య సమూహాల కథనాలు జ్ఞానంగా చెలామణి అవుతూ అణచి వేయబడిన వాళ్ల అనుభవాలను జ్ఞానంగా చూడ నిరాకరిస్తాయి. వాళ్ల జ్ఞానాన్ని వెలికితీయడం, దానికి గుర్తింపు కల్పించడం సామాజిక న్యాయ పోరాటాల్లో, విముక్తి రాజకీయాలలో అత్యంత కీలకమైన ప్రక్రియ. సామాజిక ఉద్యమాలు ప్రత్యామ్నాయ జ్ఞానాన్ని వెలికితీసి ఆధిపత్య భావజాలాన్ని సవాలు చేస్తాయి. అందుకే మనకిప్పుడు ప్రత్యామ్నాయ పోరాట కథనాలు కావాలి. ఆధిపత్యాన్ని ఎదురించి నిలబడే ఆలోచనలు అధికారికం కావాలి. ఆధిపత్య, వస్తు వినిమయ సంస్కృతి మత రాజకీ యాలతో పరయాకరించబడ్డ సమాజాన్ని ప్రజాస్వామీకరించాల్సి వుంది. టెక్నాలజీ. టెక్నాలజీ ఏ సామాజిక, ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతుందో, ఆ వ్యవస్థ ప్రయోజనాలకు అనుగుణం గా పనిచేస్తుందని హెర్బర్ట్ మార్కుస్ అంటాడు. వర్గ సమాజంలో వర్గ దృక్పథం, కుల సమాజంలో కుల దృక్పథాన్ని తీసుకుం టుంది. సమాజాన్ని మార్చే క్రమంలోనే టెక్నాలజీ, మానవ సంబంధాలు మారి ప్రజాస్వామీకరణ చెందుతాయి. ఏదేమైనా మన మనుగడ కోసం ఈ భూమి మీద నుంచునే సామాజిక బాధ్యతతో రోజువారీ పోరాటాలు చేయాల్సి ఉంటుంది. ❑

# ఎగసిన ఉద్యమ తరంగం
# AISF **1936-2026**



- కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ

**చ**రిత్రను చదవటం అంటే గతాన్ని తెలుసుకోవటంగానే ఉంటుంది. మన సమకాలీనతలోని చరిత్ర అయితే గతాన్ని గుర్తు చేసుకోవడంగా ఉంటుంది. కానీ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (All India Students Federation - AISF) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసులునాయుడు రచన 'ఎగసిన ఉద్యమ తరంగం AISF 1936-2026' : దశాబ్దకాల నా అనుభవాలు' - కేవలం అలా లేదు. చదువుతుంటే రోమాలు నిక్కబొడిచిన సందర్భాలు ఉన్నాయి. అంటే, అవి అంత ఉత్తేజకరంగా ఉన్నాయి. ఉద్వేగంతో కళ్ళు చెమ్మగిల్లిన ఘట్టాలు ఉన్నాయి. అంటే, వాటిలో అంత జీవం ఉంది. పాఠకుడు ఉద్యమకారుడైతే కొన్నిచోట్ల వ్యక్తిగత అనుభవాలు గుర్తుకువస్తాయి. అంటే, అక్కడ పాఠకుడు రచనతో తాదాత్మ్యం చెందుతాడు. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వచ్చింది అంటే, ఇలాంటివన్నీ ఒక ఉత్తమ రచనకు ఉండే లక్షణాలు అంటారు పెద్దలు. అంటే, ఒకనాడు విప్లవకారుడు అయిన ఈ పుస్తక రచయిత పి.శ్రీనివాసులునాయుడు నేడు 'సజీవ చరిత్ర' రచయిత కూడా.




**ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్-ఆంధ్ర ప్రదేశ్, నవచేతన బుక్ హౌస్-తెలంగాణ.**
**వెల-100/-**

ఈ రచలో ఉద్యమ నాయకుడు శ్రీనివాసులు నాయుడు దశాబ్దకాల నా అనుభవాలు అన్నప్పటికీ, అందులో ఆయన హీరోయిజం కనబడదు. రచయిత అలా ఎక్కడా ప్రత్యేకంగా తనను కావాలని ఫోకస్ చేసుకోలేదు. ఉద్యమాన్నే ఫోకస్ చేశారు. అందులో సందర్భానుసారంగానే తాను కనిపిస్తారు. ఈ చరిత్రను ఇలా రాయటం సులువు కాదు. అందునా అది చారిత్రక సంధికాలం. సంస్థ లేనిచోట్ల నిర్మిస్తూ, ఉన్నచోట్ల మరింత విస్తృతపరుస్తూ, మరికొన్ని ప్రాంతాల్లో మరింత బలోపేతం చేసే సందర్భంలో ప్రధాన భూమిక పోషించిన వ్యక్తిగా, చోదకశక్తిగా ఉన్న శ్రీనివాసులునాయుడు ఇలా రాయటం చాలా కష్టం. ఈ రచనలో తాను నిబద్ధుడైన కార్యకర్తగా మాత్రమే ఆవిష్కృతం అయ్యారు. సాధించిన విజయాలు సమష్టి కృషి ఫలితాలు - అంటారు చాలాచోట్ల.

మొత్తం 215 పుటలున్న పుస్తకం ఇది. చారిత్రక సాక్ష్యాలుగా నిలిచిన అనేకానేక ఫొటోగ్రాఫ్‌లు ఉన్నాయి. There are many milestones for AISF అంటూ నాటి AISF జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జిత్ కౌర్ అభినందన, ఈ రచన కోసం 'పోరుపెట్టిన' AISF పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. లక్ష్మీ నారాయణ, ఈ పుస్తకం 'మనల్ని పులకింపచేస్తుంది' అంటూ పీకాక్ పబ్లికేషన్స్ ఎ.గాంధీ, 'సిద్ధాంతపరంగా, పోరాటపరంగా సుక్షితులం' అంటూ AISF మాజీ నాయకులు పి.ఎస్.వి. ప్రసాద్, 'కమిటెడ్ కార్యకర్తా అతనే, నడిపించే నాయకుడూ అతనే!' అంటూ సీనియర్ జర్నలిస్ట్ తాడి ప్రకాష్, 'ఉద్యమాల కాలం' అంటూ నమస్తే తెలంగాణ మాజీ సంపాదకులు కట్టా శేఖర్‌రెడ్డి అభినందలు, జ్ఞాపకాల ముందుమాటలు రాశారు. AISF - పువ్వు పుట్టగానే పరిమళించింది' అని రచయిత AISF పుట్టు పూర్వోత్తరాలను వివరిస్తూ రచనను ప్రారంభించారు. ఇక, అసలు విషయాన్ని రెండు భాగాలుగా విభజించారు. ఒకటి మరకను మాయం చేసిన పోరాటం, రెండు మరింత గతంలోకి.

**మొదటి భాగంలో..** దేశంలో ఎమర్జెన్సీ - దాని పర్యవసానం, AISF 32వ రాష్ట్ర మహాసభ - గుంటూరు, సంప్రదాయ ప్రజాబలాన్ని కోల్పోయిన సిపిఐ, సంక్షోభ సమయాన దొరికిన పట్టు, AISF - SFI సంబంధాలు, ఐక్య పోరాటమే కానీ, కట్‌త్రోట్ కాంపిటీషన్, అది ప్రదర్శన కాదు దండయాత్ర, పోలీసుల భీకర దాడి, మఖ్దూమ్ భవన్ మీద దాడి - పేలిన టియర్ గ్యాస్ తూటాలు, సిటీ పోలీస్ కమిషనర్ ప్రెస్ మీట్, విపక్ష నాయకుల

సమావేశం, అరెస్టులు - కేసులు, అనుభవాలు - పాఠాలు, కానరాని కాపీ పుస్తకాలు - ఉద్యమాలకు శ్రీకారం, సాధించినవి కొన్నే కానీ ఫలితాలు ఎన్నో, ఆర్ట్స్ కాలేజీకి అగ్ర నాయకుడు - భళా, నల్లబారిన నల్లకుంట పోలీస్‌స్టేషన్, MLA అహంకారానికి ముకుతాడు, ముఖ్యమంత్రి తులాభార పరాభవం, కక్షగట్టిన అనంతపురం జిల్లా కలెక్టర్, గ్రేట్ స్టూడెంట్ మార్చ్ - హైదరాబాద్, పలుమార్లు వాపోయిన NSUI నాయకుడు, వరవరరావు ఇంటి గోడపై AISF నినాదాలు, హన్మకొండలో హత్యాయత్నం - కత్తిపోట్లు, ప్రభుత్వ కుట్ర - గూండా చట్టం, కులాల కుంపట్లు - రగిలిన క్యాంపస్‌లు, పరిణతి చెందిన మన క్యాడర్, శ్రమకు దక్కిన గుర్తింపు, మన విజయ రహస్యం - అనే అంశాలను పొందుపర్చారు.

**రెండవ భాగంలో..** అనంతపురం అగచాట్లు - సంఘ నిర్మాణానికి రాళ్ళెత్తిన అనుభవం, నాగురించి రెండు మాటలు, నాకు పోలైన రెండే రెండు ఓట్లు, ఆకస్మాత్తుగా చుట్టుముట్టిన పోలీస్, చందాగా బీడీల వసూళ్ళు, ఎదురులేని చరిత్ర మొదలైంది ఇక్కడ నుంచే, సై అంటే సై అన్న విద్యార్థి ఉద్యమం, రూట్స్ ఆఫ్ ది ఫాక్షన్ పోలిటి, మంచి నాయకులు బలయ్యారు, ఐరన్ కర్టెన్‌ను ఛేదించిన AISF, అర్ధరాత్రి కలెక్టర్ బంగ్లా ముట్టడి, అవహేళన - కంకీ కొడవలంటూ అపహాస్యం, అగ్గికి బుగ్గయిన నా హాస్టల్ రూమ్, కమ్యూనిస్టును కాలేజీ ఛైర్మన్ గా గెలవనివ్వం, నన్ను మరవని అనంతపురం పోలీసులు, భవనం వెంకట్రామ్ గారు - కొన్ని జ్ఞాపకాలు, అల్లు రామలింగయ్య అగచాట్లు, గూడులేని గృహస్తులయ్యాం, అవి చిల్లరి డబ్బులకు మొఖం వాచిన రోజులు, కేతు విశ్వనాథరెడ్డి సున్నిత మందలింపు, అగ్రనాయకుడి జిల్లా పర్యటన - అనే అంశాలు వున్నాయి. వీటిల్లోని ముఖ్యమైన సారాంశం ఇది. ఈ రచన నడచిన చారిత్రక దశలో నాటి విద్యార్థి ఫెడరేషన్ ఉద్యమాలు బహుముఖంగా సాగాయి. ఒకటి అస్తిత్వాన్ని నిలుపుకోవటం. రెండు మసకబారిన ప్రతిష్టను తిరిగి దీప్తిమంతంగా ఆవిష్కరించటం. మూడు కొత్త నెత్తుటి యువతను చైతన్య పరచటం. నాలుగు వారి దృష్టిని సమస్యలవైపు మళ్ళించి వారిని ఉద్యమ బాట పట్టించటం. అయిదు వ్యక్తి ఆరాధన పోకడలతో ఇష్టా రాజ్య పాలన సాగించే ప్రభుత్వ అధిపతులపై మడమతిప్పని పోరాటాన్ని సాగించటం.

**ఇది ఎలా ప్రారంభమైంది ?** పాఠశాల విద్యార్థుల కాపీ రాత పుస్తల కోసం మొదలైంది. బి.సి, ఎస్.సి, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల హాస్టల్ సమస్యలు, ప్రైవేటు విద్యాసంస్థల్లో కాపిటేషన్ ఫీజుల వసూళ్లకు వ్యతిరేకంగా, పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాల హాస్టళ్ళలో పరిశుభ్రత, ఆహారంలో నాణ్యతా లోపం, కాంపస్‌లలో పోకిరీలు, రౌడీ మూకల వికృత చేష్టలను తిప్పికొడుతూ, విద్యార్థి భృతి పెంపుదల కోరుతూ, విద్యాశాఖలో అధికారుల నిర్లక్ష్యాన్ని, అలసత్వాన్ని నిరసిస్తూ.. ఇలా అనేక ఉద్యమాల రూపకల్పన, ఉద్యమాల్లోకి తోటి వామపక్ష విద్యార్థి సంఘాలను కలుపుకొచ్చేందుకు అలుపెరుగని నిర్విరామ కృషి కొనసాగిన తీరును కళ్లకుకట్టారు రచయిత ఆయా ఘట్టాలలో. ఈ క్రమంలో రాష్ట్రంలోని అత్యధిక విద్యాలయాల ఎన్నికల్లో AISF పతాక విజయకేతనమై ఎగిరింది. అంతేనా.. చెన్నారెడ్డి ప్రభుత్వ కాలంలో ఆయన సాగించిన అరాచక పాలన, షష్టిపూర్తి తులాభారాలను తిప్పికొట్టే వరకు ఈ ఉద్యమాలు పురోగమించాయి. వాటి స్థాయి, వాటిని నడిపిన నాయకత్వం, ఆ నాయకత్వం చెల్లించిన మూల్యం కూడా సాధారణమైనది కాదు.

గుర్తు తెలియని చిరు విద్యార్థి సమూహ ప్రదర్శనతో ప్రారంభమై వందలు, వేలాది మంది విద్యార్థుల ప్రదర్శనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు ఇలా సమస్త ఉద్యమరూపాలు కళ్ళ ముందు మెదులుతాయి చదువరులకు ఈ రచనలో. విద్యార్థులు, వారి ఉద్యమ నాయకత్వ వీపులపై ప్రారంభమైన పోలీసు క్రూర లాఠీ విన్యాసాలు, బాష్పవాయు గోళాల ప్రయోగాలు, తుపాకి కాల్పులు, జైలు శిక్షలు - అన్నిటికీ రొమ్ము ఎదురొడ్డి నిల్చిన ధీర నాయకత్వాన్ని చూసి పాఠకుడు పిడికిలి బిగిస్తాడు. ఇక్కడ రచనతో మమేకమవుతాడు ఆయా ఉద్యమాలతో సంబంధం, అనుబంధం ఉన్న పాఠకుడు.

**చివరిలో..** మిత్రుల జ్ఞాపకాలు, శ్రేయోభిలాషుల అభిప్రాయాలలో స్ఫూర్తి ప్రదాత శ్రీనివాసులు నాయుడు - వై. విశ్వేశ్వరరెడ్డి, నా చేతిలో ఐదు రూపాయలుంచి - డా. బూర్ల రామాంజనేయులు (పత్తిపాడు శాసనసభ్యులు, విశ్రాంత IAS), తలరాతను మార్చిన ఫెడరేషన్ ఉద్యమం - వి.కె.రంగారెడ్డి, రాణించాల్సిన వారు తెరమరుగు - డి.వెంకటేశ్వరరావు (విశ్రాంత జాయింట్ కమిషనర్, వాణిజ్య పన్నుల శాఖ), PDSU నుండి విలక్షణ AISFలో చేరినందుకు గర్వపడ్డాను - మహమ్మద్ అన్వర్ పాషా (విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ వాణిజ్య పన్నుల శాఖ), మాది మారుమూల ఒక లంబాడా తండా-పి.ఎల్.రవీంద్రనాయక్ (విశ్రాంత పోలీస్ సూపరింటెండెంట్), వారిని అంటారేమిటి మీరే నక్సలైట్లు అయితే చంద్ర: దొంగరి వెంకటరామ్ (విశ్రాంత అడిషనల్ ప్రొఫెసర్). యువతరానికి స్ఫూర్తిదాయకం శ్రీనివాసులు నాయుడి ఉద్యమ ప్రస్థానం-గజ్జెల అశోక్, ఇప్పటికీ AISF అంటే నాకెంతో అభిమానం-అంటూ జనశిక్షణ సంస్థాన్, కేంద్రీయ విశ్వవిద్యాలయం-హైదరాబాద్ విశ్రాంత డైరెక్టర్ టి.ఎం.ఉషారాణి, ఇలా AISF ఉద్యమం పట్ల, శ్రీనివాసులు నాయుడి నాయకత్వ ప్రభావం గురించి తమ అభిప్రాయాలు, అనుభవాలను వ్యక్తం చేశారు. నేటి తరానికి ఎంతో స్ఫూర్తిని నింపే రచన 'ఎగసిన ఉద్యమ తరంగం AISF. నేటి కాలానికి ఎంతో అవసరమైనది. ప్రతి విద్యార్థి ఉద్యమకారుడు, ప్రతి యువ ఉద్యమకారుడు తప్పక చదవాల్సిన పుస్తకం. ❑




# బలమైన రైతు కూలీ ఉద్యమాన్ని నిర్మించాలి

**ఏఐకేఎంకేఎస్ అఖిల భారత మహాసభ సావనీరు ఆవిష్కరణ సభలో వక్తల పిలుపు**

ఏఐకేఎంకేఎస్ అఖిల భారత మహాసభల సావనీర్ ఆవిష్కరణ సభ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో 30-6-2026 న ఏలూరు లేడీస్ క్లబ్ నందు జిల్లా కార్యదర్శి షేక్ బాషా అధ్యక్షతన జరిగింది. ముందుగా సావనీరును దారి దీపం పత్రికా సంపాదకులు డి.వి.ఎస్.వర్మ ఆవిష్కరించి మాట్లాడుతూ రైతు కూలీ సంఘం అఖిల భారతస్థాయిలో ఏర్పడటం రైతు కూలీ ఉద్యమాలకు శుభపరిణామం అన్నారు. పోరాట పటిమ గల రైతు కూలీ సంఘం మహాసభల సావనీర్ ఆవిష్కరించే అవ కాశం నాకు కల్పించడం గర్వంగా ఉంది అన్నారు. అఖిలభారత మహాసభలో గత రైతాంగ పోరాటాల గురించి చర్చించారని ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం రైతాంగ ఆత్మహత్యలకు మూలమైన పాలకుల విధానాలపై పోరాడాలని మహాసభ సరైన మార్గ నిర్దేశం చేసిందన్నారు. ఈ సావనీరును అందరూ చదవాలని చాలా స్పష్టంగా సూటిగా రైతు కూలీలు ఏం చేయాలో ఈ పుస్తకం తెలియచేస్తుందన్నారు. ఈ మహా సభల్లో దున్నేవాడికే భూమి హక్కుగా లభించాలని, జీవనోపాధి, అణిచివేత దోపిడీల నుండి విముక్తి కోసం పోరాడాలని ఈ మహాసభ పిలుపునిచ్చిందని అన్నారు. సామాజిక ఆర్థిక అంత రాలు ఉన్న సమాజంలో మనం స్వేచ్ఛగా బతకలేమని, ఉద్య మాల ద్వారానే మన సమస్యల పరిష్కారం చేసుకోగలుగుతామ ని, ఆ వైపుగా ఈ సావనీరు పిలుపునిస్తోందన్నారు. సంపదను సృష్టిస్తున్న రైతు కూలీ వర్గానికి తగు వాటా దక్కాల్సిన అవసరం ఉంది అన్నారు. ప్రధాన వక్తగా వచ్చిన ఏ.ఐ.కే.ఎం.కే.ఎస్.




అఖిల భారత అధ్యక్షులు ఎస్.ఝాన్సీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల మూలంగా అన్ని రాష్ట్రాల్లోనూ రైతాంగం తీవ్రమైన సమస్యల్లో కూరుకు పోయారని అన్నారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతాంగం దీర్ఘకాలంగా పోరాడుతున్నా కేంద్రంలోని మోడీ- షా ల ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్య వాదులకు సంపూర్ణంగా దాసోహం చేస్తూ వారితో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశం రాష్ట్రం చాలా అభివృద్ధి చెందుతున్నాయని పాలకులు ఊదరగొడుతున్నారని, వాస్తవ పరిస్థితి వేరుగా ఉందన్నారు. వజ్రాల పరిశ్రమ పెట్టామని, గూగుల్ డేటా సెంటర్ పెట్టామని అంటున్నారే తప్ప ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం కోసం మాత్రం పాలకులు ఆలోచించట్లే



దన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ని పాలకులు ఉద్దేశపూరితంగానే మూసివేస్తున్నారని, ఇటీవల జరిగిన ప్రమాదంలో అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణ మన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పటికీ సొంత గనులు కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు స్టీల్ ప్లాంట్‌కు, సొంత గనులు కేటాయించడం అత్యంత దుర్మార్గ మన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పథకం ప్రకారం మూసివేశారని, మన ఉత్పత్తులను తగ్గించి అమెరికా నుండి దిగుమతులు చేసుకునే విధానాలను "దేశభక్తి" గల బిజెపి పాలకులు అమలు చేస్తున్నారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ నుండి తీసుకెళ్తున్న నీరంతా గూగుల్ డేటా సెంటర్ కోసమే కానీ రైతాంగం కోసం కేటాయించట్లేదన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడానికి ఇప్పుడు సుప్రీంకోర్టులో పాలకులే కేసులు వేయించారని అన్నారు. రైతాంగం, కార్మికులు, గిరిజనులు, దళితుల సమస్యల పరిష్కారానికై సంఘటితంగా ఉద్యమాలు నిర్మించడమే తప్ప



మరో మార్గం లేదని స్పష్టపరిచారు. సభలో బి కె ఎం యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సంకు మనోరమ, రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యు. వీర బాబు, రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్.ఎస్.నాగరాజు, దళిత నాయకులు మామిడూరి మహంకాళి తదితరులు సావనీర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ❑






ఈసీగా గెలిచారు !

దక్కింది చాలు !







మతం మత్తులో..

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 4 - Issue No : 9 Online Edition June 2026

# కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు..
నవ తెలంగాణ బుక్ హౌస్,
హైదరాబాద్







ప్రతులకు..
ప్రజాశక్తి బుక్ హౌస్,
విజయవాడ

